# ఆంధ్ర వలస పాలనలో
# తెలంగాణ


| | | |
|---|---|---|
| ప్రథమ ముద్రణ | : | అక్టోబర్, 2006 |
| ప్రతులు | : | 10,000 |
| వెల | : | **10/-** |
| ముద్రణ & సర్వహక్కులు | : | **తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, 6-3-634, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.** |


పేరు : ....................................................

అడ్రసు : ....................................................

....................................................

....................................................

**తెలంగాణ.**

టెలిఫోన్ నెంబర్లు : ....................................................

....................................................

....................................................

....................................................

డ్రైవింగ్ లైసెన్స్ నెం. : ....................................................

ఇన్సూరెన్స్ పాలసీ నెం.: ....................................................

బ్లడ్ గ్రూప్ : ....................................................

బ్యాంక్ అకౌంట్ నెం. : ....................................................

గ్యాస్ కనెక్షన్ నెం. : ....................................................

## ముందుమాట

తెలంగాణ ప్రాంతానికి జరిగిన, జరుగుతున్న అనేక అన్యాయాలను పాకెట్ సైజు పుస్తక రూపంలో తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా పల్లెల్లో ఉన్నవారికి అందించాలని సంకల్పించాం. చాలామంది దీనికై కృషిచేశారు. వారందరికీ ధన్యవాదాలు. విమలగారికి, "సునీత" గారికి, తెలంగాణ ప్రభాకర్ గారికి, డి.పి.రెడ్డి.గారికి మా ప్రత్యేక ధన్యవాదాలు.

తెలంగాణలో చదవగలిగేవారు ఈ పుస్తకాన్ని చదవడమే కాకుండా, అందరికీ చదివి వినిపించాలని మా మనవి.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి పెంచుతూ ఉత్తరాలు రాస్తూ, సత్యాగ్రహాలు చేస్తూ తెలంగాణ ఉద్యమం ఉధృతం చేద్దాం. త్వరలోనే తెలంగాణ తప్పకుండా వస్తుంది.

**జై తెలంగాణ జైజై తెలంగాణ**

**బూరుగుపల్లి వెంకటేశ్వరరావు (బి.వి.రావు)**

**తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం**

# తెలంగాణా చారిత్రక నేపథ్యం

వందల సంవత్సరాల నైజాం పాలనలో హైదరాబాదు రాష్ట్రం 16 జిల్లాలు (8 తెలంగాణ జిల్లాలు, 5 మరాట్వాడా జిల్లాలు, 3 కర్నాటక జిల్లాలు) కలిగి మూడు భాషల ప్రజలతో ఉండేది. వారి వారి భాషలు, ఆచార వ్యవహారాలు వేరైనా–ఇచ్చి పుచ్చుకునే ధోరణితో ప్రజలు సహజీవనం సాగిస్తూవచ్చారు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భాగంగా ఉన్న తెలంగాణ 1724 నుండి 1948 వరకు 224 సంవత్సరాలు నిజాంపాలనలో ఉండేది. నిజాం నుండి విముక్తి కలిగించడానికి ఇక్కడి ప్రజలు భాషతో నిమిత్తం లేకుండా ఎన్నెన్నోకష్టాలు పడాల్సివచ్చింది. లెక్కలేనంత మంది పోరాడి ప్రాణాలను అర్పించారు.

## దేశ స్వాతంత్ర్యం నాటిస్థితి

ఆగస్టు 15, 1947న దేశ ప్రజలంతా స్వాతంత్ర్య వేడుకల్లో మునిగిపోయారు. ఆంధ్రులు భాగంగా ఉన్న మదరాసు రాష్ట్రానికి



కూడా ఆంగ్లేయుల నుండి విముక్తి కలిగినందున వారు కూడా ఘనంగా ఉత్సవాలు జరుపుకున్నారు. కాని నిజాం నిరంకుశత్వం నుండి విముక్తి లభించనందున తెలంగాణ ప్రజలు మాత్రం నిరాశా నిస్పృహల్లో మునిగిపోయారు. స్వాతంత్ర్య సంబరాల్లో మునిగిపోయిన ఆంధ్రులు తెలంగాణ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి ఆలోచించలేదు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాకే నిజాం నిరంకుశత్వం మరింత పెరిగిపోయింది. తెలంగాణ ప్రజల స్వాతంత్ర్య పోరాటాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలని నిర్ణయించడంతో ప్రజల కష్టాలు తారాస్థాయికి చేరుకున్నాయి. దానికి తోడు ఖాసిం రజ్వీ నాయకత్వంలోని రజాకారులు దోపిడీలకు, హత్యాకాండకు, అత్యాచారాలకు పాల్పడడంతో ప్రజలు దిక్కులేని పక్షుల్లాగా వలసవెళ్ళాల్సి వచ్చింది. ఆంధ్రా ప్రాంతాలకు వలసపోయిన తెలంగాణ ప్రజలకు కనీస మర్యాద దక్కకపోగా వారిని అందిన కాడికి దోచుకోవడంలో ఆంధ్రులు తమచేతివాటాన్ని ప్రదర్శించారు. నాగపూర్ లాంటి తెలుగేతర ప్రాంతాలకు వెళ్ళిన తెలంగాణ ప్రజలకు మాత్రం అపూర్వమైన ఆదరణ లభించింది.



## హైదరాబాదుకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు

నైజాం ప్రాంత ప్రజల ఎడతెగని పోరాటాల వలన, భారత ప్రభుత్వ చర్యల వలన, సర్దార్ పటేల్ చాకచక్యం వలన నిజాంపై ఒత్తిడిపెరిగింది. 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్‌పై పోలీసు చర్య ప్రారంభమైంది. సెప్టెంబర్ 17న చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ లొంగిపోయాడు. దీనితో హైదరాబాద్‌కు విముక్తి కలిగి, దేశానికి స్వాతంత్ర్యం లభించిన సంవత్సరం తర్వాత ఇక్కడి ప్రజలకు స్వాతంత్ర్యం లభించింది.

హైదరాబాద్ రాష్ట్రానికి నిజాం నుండి విముక్తి కలిగినప్పటికి స్వతంత్ర భారతదేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా దాదాపు నాలుగు సంవత్సరాల పాటు, అంటే 1952లో ఎన్నికలు జరిగి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యేంత వరకు, ప్రజాప్రభుత్వానికి ఇక్కడి ప్రజలు నోచుకోలేదు.

## ముల్కీ ఉద్యమం

1948 నుండి 52 వరకు నాలుగేళ్ళపాటు మిలిటరీ, సివిల్ అధికారుల పాలనా కాలాన్ని ఆసరాచేసుకొని మదరాసు రాష్ట్రంలోని ఆంధ్రులు అనేక మంది ఇక్కడకువచ్చి ఉద్యోగాలను



దక్కించుకున్నారు. తెలంగాణ వారికి ఇంగ్లీష్ రాదన్న కుంటి సాకుతో మిలిటరీ, సివిల్ పాలకులు విచక్షణారహితంగా ఉద్యోగాలలో ఆంధ్రులను నింపారు. అలా నియమించబడ్డ ఆంధ్రులు, వెనువెంటనే తమవారిని పిలిపించుకొని మరిన్ని ఉద్యోగాలను తమవారికే కట్టబెట్టారు. అలా అక్రమంగా ఉద్యోగాలలో స్థిరపడ్డ ఆంధ్రులు తమను తాము సంఘ సంస్కర్తలుగా వర్ణించుకొని, తెలంగాణ ప్రజలపై అధికార దర్పాన్ని ప్రదర్శించడం ప్రారంభించారు. ముల్కీ నిబంధనలు అమలులో ఉన్నప్పటికి ఆంధ్రులు దొంగ సర్టిఫికేట్లతో ఉద్యోగాలను దక్కించుకోవడాన్ని ఇక్కడి ప్రజలు తొందరగానే పసిగట్టారు. ఫలితంగా "గైర్ ముల్కీ – గోబ్యాక్" అంటూ ఉద్యమించారు. "ఇడ్లీ – సాంబార్ గోబ్యాక్", "గోంగూర పచ్చడి గోబ్యాక్" లాంటి నినాదాలు అప్పుడే పుట్టు కొచ్చాయి.

**విశాలాంధ్రలోనే ప్రజారాజ్యస్థాపనకు పోరాటం చేస్తామంటున్న కమ్యూనిస్టులు బెంగాల్‌లో ఏపాటి అభివృద్ధిని సాధించగలిగింద్రు? తెలంగాణా వేరైతే సుత్తి మొత్తనంటున్నదా? కొడవలి ఆడనంటున్నదా? తెలంగాణా వేరైతే మీ పోరాటానికి అడ్డేమిటి?**

**-కాళోజి**

## ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు

మదరాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న ఆంధ్రులు ఉద్యోగ రంగంలో, వనరుల్లో తమను తమిళులు దోపిడీకి గురిచేస్తున్నారని ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి నడుంబిగించారు. పొట్టి శ్రీరాములు ప్రత్యేక అంధ్రరాష్ట్రం కొరకు 1952 అక్టోబర్ 19న ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. రాజధాని సమస్యతో పాటు, ఆర్థిక సమస్యలు ఎదురవుతాయని ఊహించినప్పటికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. కాని మదరాసు నగరంలో భాగం యివ్వాలని కోరుతూ తన నిరాహారదీక్షను కొనసాగించి 63వ రోజు డిసెంబర్ 15న పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంచేశారు. దీంతో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తీవ్రరూపందాల్చింది. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి 1953 అక్టోబర్1న మదరాసు రాష్ట్రంలోనుండి ఆంధ్రులను విడదీసి, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడమైనది. మదరాసు నగరంలో ఆంధ్రకు భాగం కావాలన్న లక్ష్యంతో దీక్ష కొనసాగించి, 1952లో పొట్టి శ్రీరాములు చనిపోగా, విశాలాంధ్ర ఏర్పాటు కొరకు ప్రాణత్యాగం చేసినట్లుగా నేటినాయకులు వర్ణించడం చరిత్రను వక్రీకరించడమే తప్ప వేరు కాదు.



## ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటుకు ముందున్న పరిస్థితులు

1948లో హైదరాబాదు రాష్ట్రం, 1953లో ఆంధ్రరాష్ట్రం వేరువేరుగా ఏర్పాటైన తరువాత ఆంధ్రులు భాషాప్రయుక్త రాష్ట్రాల పల్లవిని అందుకున్నారు. కరువుకాలంలో ఒల్లనని పంపించిన మొగడు, పంటకాలంలో పంపించమని అడిగినట్లు నిజాంనుండి స్వాతంత్ర్యాన్ని పొందడంలోకాని, రజాకారుల అరాచకాలనుండి రక్షించడంలోకాని పట్టించుకోని ఆంధ్రులు, భాషా ప్రయుక్త రాష్ట్రాల పల్లవితో " అందరిదీ తెలుగే"నని, తెలంగాణ ప్రజలు కూడా తమవారేనని కపటప్రేమను ఒలకబోశారు. తెలుగు మాట్లాడే వారందరికి ఒకే రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే బూటకపు నినాదాన్ని ముందుకు తెచ్చారు. విశాలాంధ్ర ఏర్పాటును తెలంగాణవాసులు వ్యతిరేకిస్తూనే వచ్చారు. ఇదే సమయంలో కమ్యూనిస్టులు కూడా విశాలాంధ్ర ఏర్పాటుకు తందాన పలకడంతో ఆంధ్రానాయకత్వం యొక్క వాదానికి మరింత బలం చేకూరింది. అంతేకాకుండా స్వాతంత్ర్యానంతరం ఏర్పాటైన రాష్ట్రాలలో కూడా అక్కడక్కడ భాషాప్రయుక్త రాష్ట్రాల వాదం ముందుకు వచ్చింది.



దీంతో ఆనాటి కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు జడ్జి ఫజల్ అలీ అధ్యక్షతన 1953లో రాష్ట్రాల పునర్నిర్మాణానికై కమీషన్‌ను ఏర్పాటు చేసింది. అదే ఎస్.ఆర్.సి (స్టేట్ రీ ఆర్గనైజేషన్ కమీషన్). దేశంలోని వివిధ ప్రాంతాలను పర్యటించి, రాష్ట్రాల పునర్‌నిర్మాణానికి తగిన సూచనలు–సలహాలు ఇవ్వాలన్నదే ఈ కమీషన్ ప్రధాన బాధ్యత. ఆందులో భాగంగానే ఈ కమీషన్ హైదరాబాదు, ఆంధ్ర రాష్ట్రాలలో పర్యటించి ప్రజల, రాజకీయ నాయకుల అభిప్రాయాలను సేకరించి తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఆ నివేదికలో హైదరాబాదు రాష్ట్రంలోని 8 తెలుగు మాట్లాడే జిల్లాలను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరచాలని, దానికి "హైదరాబాదు రాష్ట్రం" అని నామకరణం చేయాలని సూచించింది. ఈ ఏర్పాటును అయిదు సంవత్సరాలు పరీక్షించి, ఆ తరువాత ఒక వేళ హైదరాబాదు రాష్ట్ర శాసనసభలో మూడింట రెండువంతుల మంది అంగీకరిస్తే అప్పుడు ఆంధ్ర రాష్ట్రంలో విలీనం కావచ్చునని తన నివేదికలో సూచించింది.



**రాష్ట్రాల పునర్‌నిర్మాణం కొరకు నియమించిన ఫజల్ అలీ కమీషన్ వెలిబుచ్చిన అభిప్రాయాలు:**

**1. విలీనాన్ని వ్యతిరేకించడానికి చూపించిన కారణాలు : (విలీనంతో తెలంగాణకు జరిగే నష్టాలు)**

- ★ ఎక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతంతో, తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతాన్ని కలపడం సమర్థనీయం కాదు.
- ★ లోటు బడ్జెట్‌తో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్‌తో ఉన్న హైదరాబాద్ రాష్ట్రంతో కలిపితే, హైదరాబాద్ రాష్ట్రం నష్టపోక తప్పదు.
- ★ బ్రిటిష్ పాలనలో పుట్టి పెరిగిన ఆంధ్రులకు విద్యావకాశాలు అధికంగా ఉన్నందున, నిజాం కాలంలో తెలుగు నిషేధం, ఉర్దూ నేపథ్యంలో అరకొర చదువులు చదివిన తెలంగాణవారితో కలపడం వలన ఉద్యోగాలన్నింటినీ ఆంధ్రులే దక్కించుకునే అవకాశం వుంది.
- ★ పల్లపు ప్రాంతంగా ఉన్న ఆంధ్రప్రాంతానికే నదీజలాలన్నీ వినియోగించబడే అవకాశమున్నందున తెలంగాణకు నీటివనరులలో న్యాయం జరుగదు.

**2. విలీనానికి అనుకూలాంశాలు: (విలీనంతో ఆంధ్రకు కలిగే లాభాలు)**

- ★ ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని సమస్య ఉన్నందున, హైదరాబాద్ అప్పటికే అభివృద్ధి చెంది ఉన్నందున, రెండు రాష్ట్రాల విలీనంతో ఆంధ్ర రాష్ట్రానికి ఉన్న రాజధాని సమస్య పరిష్కారమవుతుంది.
- ★ తెలంగాణలో ఖనిజ వనరులు విరివిగా ఉన్నప్పటికి ఆహార సమస్య వుంది. ఆంధ్రలో ఆహారానికి కొరత లేనప్పటికి ఖనిజ వనరుల కొరత వుంది. రెండు ప్రాంతాల విలీనంతో ఇరు ప్రాంతాల సమస్యలు పరిష్కారమవుతాయి.

*(ఇక్కడి ఖనిజ వనరులు ఆంధ్రులకు ఉపయోగపడ్డాయే తప్ప, అక్కడి ఆహార ధాన్యాలు మాత్రం ఇక్కడి ప్రజలకు దక్కలేదు)*

కమీషన్ హైదరాబాదు రాష్ట్రాన్ని ప్రత్యేకంగానే ఉంచాలనే సిఫారసులతో తెలంగాణ ప్రజల్లో సంతోషం వెల్లివిరిసింది. విశాలాంధ్ర ఏర్పాటుకై ఎదురుచూసిన ఆంధ్రులకు నిరాశ కలిగింది. ఆంధ్రరాష్ట్ర రాజకీయనాయకులు కేంద్రంపై తమ ఒత్తిడిని పెంచడానికి నాటకాలు ప్రారంభించారు. అదే సమయంలో విశాలాంధ్ర ఏర్పడుతుందేమోనన్న భయంతో తెలంగాణలో మరోసారి ప్రజా ఉద్యమం బయలుదేరింది.



**జవహార్‌లాల్ నెహ్రూ అభిప్రాయం :**

1953 ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు సమయంలో విశాలాంధ్ర నినాదంపై నెహ్రూ గారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆనాటి కర్నూల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో "విశాలాంధ్ర నినాదం వెనుక దురాక్రమణ ఉద్దేశ్యపూరిత సామ్రాజ్యవాద తత్వముందని'' బాహాటంగా ప్రకటించారు. తదనంతరం 1955 వరకు జరిగిన ఆంధ్ర నాయకుల హామీలు, ఒత్తిడులకు లొంగి 1955 మార్చి 5 న నిజామాబాద్ సభలో మాట్లాడుతూ " తెలంగాణ-ఆంధ్ర ప్రాంతాలు కలిసి ఉంటే, పొంతనకుదరకపోతే విడాకులు ఇచ్చుకున్నట్లే కొంతకాలం తర్వాత విడిపోవచ్చునని" అన్నారు.

**పెద్దమనుష్యుల ఒప్పందం**

ఓవైపు ఫజల్ అలీ కమిషన్ రెండు ప్రాంతాలను కలిపే పరిస్థితులు లేవని తేల్చిచెప్పగా, మరో వైపు కేంద్ర ప్రభుత్వం కూడా ఏమి చేయాలో తేల్చుకోలేని డోలాయమానస్థితిలో ఉండగా, ఆంధ్రనాయకత్వం తమపలుకుబడిని ప్రయోగించి కేంద్రాన్ని సమ్మతింపజేసే ప్రయత్నంలో ఉండగా, ఆంధ్రనాయకుల హామీలకు, ప్రలోభాలకు కొందరు తెలంగాణ నాయకులు లొంగిపోయి, సమైక్య రాష్ట్ర ఏర్పాటును సమ్మతిస్తూ పెద్దమనుష్యుల ఒప్పందానికి సిద్ధపడ్డారు.



1956 లో హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాల ముఖ్యమంత్రుల అధ్యక్షతన కుదుర్చుకున్న ఒప్పందంలో ఆంధ్ర రాష్ట్రం తరపున బెజవాడ గోపాల్ రెడ్డి, నీలం సంజీవరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, గౌతు లచ్చన్నలు పాల్గొనగా, తెలంగాణ పెద్దలుగా బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి. నర్సింగరావులు సంతకాలు చేశారు.

**ఒప్పందంలోని ప్రధాన అంశాలు :** (బ్రాకెట్లలో ఉల్లంఘనలు)

- ★ ఒక ప్రాంతానికి ముఖ్యమంత్రి పదవి లభిస్తే మరో ప్రాంతానికి ఉప ముఖ్యమంత్రి పదవి దక్కాలి. హోం, ఆర్థిక, రెవెన్యూ, ప్రణాళిక, వాణిజ్యం, పరిశ్రమల శాఖల్లో ఏవేని రెండు శాఖలను తెలంగాణా వారికి అప్పగించాలి.

  *(ఆంధ్రకు చెందిన సంజీవరెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కగా, తెలంగాణకు దక్కాల్సిన ఉపముఖ్యమంత్రి పదవిని రద్దుచేశారు.)*
- ★ తెలంగాణలో మద్యపాన నిషేధాన్ని తెలంగాణ శాసనసభ్యులు కోరిన విధంగా అమలు చేయాలి.

  *(తెలంగాణలో మద్యపానం అమలు చేయడం, ఆంధ్రలో నిషేధాన్ని విధించడంతో తెలంగాణ నుండి అందిన ఆదాయాన్ని ఆంధ్ర ప్రాంతం లోటుకు భర్తీ చేసుకున్నారు)*



- ★ పాలనా వ్యయాన్ని ఆంధ్ర-తెలంగాణలు 2 : 1 నిష్పత్తిలో భరించాలి. మిగిలిన తెలంగాణ ఆదాయాన్ని తెలంగాణ అభివృద్ధికే వినియోగించాలి.

  *(లోటు బడ్జెట్‌తో విలీనమైన ఆంధ్ర రాష్ట్రం సమైక్య రాష్ట్రంలో తనవంతు వాటానే సమకూర్చలేకపోయినందువలన, తెలంగాణ ప్రాంత మిగులు ఆంధ్ర ప్రాంతపు పాలనా వ్యయం వాటా క్రిందే ఖర్చయింది.)*
- ★ విశాలాంధ్రను ఏర్పాటు చేసేటప్పుడు ఒకవేళ ఉద్యోగులను తొలగించాల్సివస్తే తగిన నిష్పత్తిలోనే తొలగించాలి.

  *(తొలగించే పరిస్థితి తలెత్తనందున, కొత్తగా తీసుకునే ఉద్యోగాల్లో దొంగ సర్టిఫికెట్లతో ఆంధ్రులే నియమించబడ్డారు.)*
- ★ ఉద్యోగుల నియామకాల్లో జనాభా నిష్పత్తిని ప్రాతిపదికగా తీసుకోవాలి.

  *(తెలంగాణకు రావలసిన 5 లక్షల ఉద్యోగాల్లో 2 లక్షలు ఆంధ్రులు తన్నుకపోయారు.)*
- ★ హైదరాబాదు రాష్ట్రంలోని విద్యావకాశాలను ఇక్కడి విద్యార్థులకే దక్కేలా చూడాలి. తెలంగాణాలోని సాంకేతిక విద్యా సంస్థల్లో ప్రవేశం ఇక్కడి విద్యార్థులకే పరిమితం

చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో రాష్ట్రం మొత్తం మీద ఉన్న విద్యా సౌకర్యాలలో తెలంగాణ విద్యార్థులకు మూడింట ఒక వంతుకు తగ్గకుండా చూడాలి. ఈ రెండింటిలో తెలంగాణకు ఏది ఇష్టమైతే దానిని ఎంచుకోవచ్చు.

*(తప్పుడు ముల్కీ సర్టిఫికెట్లతో ఆంధ్రులే అధికంగా ఇక్కడి విద్యావకాశాలను వినియోగించుకున్నారు).*

★ ఉద్యోగాలలో 2 : 1 నిష్పత్తిని పాటించాలి.
*(ఇక్కడివారికి సరియైన తెలుగు రాదని, అన్ని శాఖలలో ఆంధ్రులనే నింపారు)*

★ ఉద్యోగ నియామకాలకు 12 సంవత్సరాల నివాసం తప్పనిసరిగా పాటించాలి.
*(నిబంధనను పర్యవేక్షించాల్సిన వారంతా ఆంధ్రులే అయినందున తప్పుడు నివాస పత్రాలను సమర్పించినా అడిగిన వారు లేరు).*

★ తెలంగాణ వ్యవహారాలను పర్యవేక్షించడానికి ప్రాంతీయ మండలిని ఏర్పాటు చేయాలి.
*(ఆంధ్ర అధికార యంత్రాంగం ఆసరాతో, నాయకులతో నిండిన మందబలంతో, తప్పుడు లెక్కలతో మభ్యపెడుతూ



తెలంగాణ ప్రాంతీయ మండలి సిఫారసులు ఎన్నడూ లెక్కచేయకుండా ఉల్లంఘించారు.)*

★ తెలంగాణలోని వ్యవసాయ భూములను ఆంధ్రులు కొనుగోలుచేయరాదు.
*(నీటి పారుదల వసతి ఉన్న భూములు, నల్లరేగడి నేలలు చాలావరకు ఆంధ్రుల ఆధీనంలోకి వెళ్ళాయి).*

★ క్యాబినెట్ మంత్రుల నియామకం 3:2 నిష్పత్తిలో జరగాలి. తెలంగాణకు చెందిన మంత్రుల్లో ఒకరు ముస్లిం మతస్తుడు ఉండాలి.

ఎలాగైతేనేమి ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రాంతాన్ని బలవంతంగా ఆంధ్ర రాష్ట్రంతో కలిపి 1956 నవంబర్ 1 న దేశంలోని మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటుచేశారు.

ఆనాటి దేశ రాజకీయ నాయకులు కాని, తెలంగాణ పెద్దలుకాని ఫజల్ అలీ కమీషన్‌కు ఏమాత్రం విలువ ఇచ్చిఉన్నా ఇప్పుడు తెలంగాణ ఇన్ని కష్టనష్టాలను లోనయ్యేదికాదు.



## సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రజల స్థితిగతులు :

బ్రిటిష్ పాలన ముగిసిపోతే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభిస్తాయని దేశవాసులు భావించినట్లే, నిజాం పాలన అంతమైతే తమ బతుకులు బాగు పడుతాయని, బానిసత్వం, నిరంకుశత్వం నశించి సమానత్వం లభిస్తుందని, చదువులతో పాటు కొలువులు సమకూరుతాయని, తమ పొలాలకు సాగునీరు లభిస్తుందని, కూడు, గూడు, నీడలకు లోటుండదని తెలంగాణ వాసులు కూడా ఎన్నెన్నో కలలు కన్నారు. కానీ ఆ కలలన్నీ పగటి కలలేనని, మూన్నాళ్ళ ముచ్చటేనని అర్థం కావడానికి ఎంతోకాలం పట్టలేదు.

**'రామేశ్వరం పోయినా శనేశ్వరం పోలేదన్నట్లు' నిజాం నవాబు పోయాడే కాని నిరంకుశత్వం పోలేదు, పేదరికం పోలేదు, మోసాలు తగ్గలేదు.** పైగా మరిన్ని రెట్లు పెరిగాయి. బ్రిటిష్ చదువులు నేర్చిన ఆంధ్రపాలకులు కల్లబొల్లి కబుర్లతో, మోసాలతో తెలంగాణలో తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారు. వీరి పాలనతో తెలంగాణ వాసుల బతుకులు పెనంమీదనుండి పొయ్యిలో పడ్డట్లయింది. హిట్లర్ దురహంకారాలు, దక్షిణాఫ్రికా తెల్లజాతి వారి వివక్ష, నాజీల వికృత



చర్యలను ఆంధ్రా పాలకులు తెలంగాణ తెరపైకి ఎక్కించారు. ఆంధ్రా పాలకుల ఆగడాల ముందు నిజాం నవాబు నియంతృత్వం కూడా చాలా చిన్నదై పోయింది. రాజుల పాలన, తెల్లదొరల పరోక్ష పాలన, నిజాం ప్రత్యక్ష పాలన, రజాకర్ల అమానుష చర్యలలాంటి వాటినన్నింటిని మేళవించి ఆంధ్రపాలకులు తెలంగాణ ప్రాంతాన్ని కాలనీగా మార్చుకొని ఆధిపత్యానికి దారులు పరుచుకున్నారు. ఆంధ్ర పాలకుల, అధికారుల ఆగడాలతో తెలంగాణవాసుల బతుకులు అన్ని రంగాల్లో బలైపోయాయి.

**'గొర్రెలు తినేవాడు పోయి బర్రెలు తినేవాడు వచ్చినట్లు'** నిజాం స్థానంలో ఆంధ్ర పాలకులు వచ్చారు. తెలుగు జాతి ఒక్కటైతే ఆ జాతికే నిండుదనం వస్తుందని, మాయమాటలు చెప్పి మాయ చేశారు. వాములు మేసే వారికి పచ్చగడ్డి ఫలహారం అన్నట్లు ఆంధ్రా పాలకుల అవినీతికి తెలంగాణా కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువులు పంటి కిందికే చాలడం లేదు.

విలీనం తర్వాత ఒక ప్రాంతం కోటీశ్వరులకు నిలయంగా మారగా, మరో ప్రాంతం ఆకలి చావులకు కేంద్ర బిందువయింది. చుట్టంగా ఇక్కడికి వచ్చిన ఆంధ్రులు చట్టం చాటున బరితెగించి

ప్రవర్తిస్తూ, తెలంగాణా ప్రజలను నిట్టనిలువునా, పట్టపగలే దోచుకుంటున్నారు. ఆంధ్రులు జల వనరులున్న భూస్వాములు, వ్యాపారులు, ఉద్యోగులు అని మూడు ముఖ్యమైన వర్గాలుగా స్థిరపడగా, తెలంగాణవాసులు మాత్రం ప్రకృతిపై ఆధారపడిన రైతులు, కూలీలు, నిరుద్యోగులుగా బతుకులను వెళ్ళదీస్తున్నారు.

నీటి సౌకర్యం లేక, విద్యుచ్ఛక్తి లేక, ఉన్న చెరువులకు మరమ్మత్తులు లేక తెలంగాణలోని ఒకప్పటి మాగాణి భూములు మెట్ట భూములుగా, మెట్టభూములు బీడు భూములుగా, బీడు భూములు ఎడారులుగా మారిపోతున్నాయి. ఫలితంగా కన్న కూతుళ్ళనే అమ్ముకునే స్థితి ఓవైపు, ప్రేమతో పెంచుకున్న పశువులను కసాయిలకు అమ్ముకునే దుస్థితి మరోవైపు ఎదురైంది.

## ప్రత్యేక తెలంగాణ ఉద్యమం - 1969 :

మోసాలను పసిగట్టిన తెలంగాణా వారు అడపాదడపా నిలదీస్తున్నప్పటికీ 1969 లో పుట్టిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమమే చెప్పుకోతగినదిగా గుర్తింపు పొందింది. ఈ ఉద్యమంలో ఆనాటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి నిరంకుశ పాలనకు సుమారు 400 మంది ఉద్యమ కారులు బలైపోయారు. ఈ ఉద్యమకారులకు ఎలాంటి



గౌరవం లభించలేదు. మదరాసు రాష్ట్రానికి వ్యతిరేకంగా పోరాడిన పొట్టి శ్రీరాములుకు దక్కిన గౌరవంలో ఒక్కశాతం గౌరవం కూడా మన తెలంగాణ వీరులకు దక్కలేదు. నాటి ఉద్యమ నాయకుడు డా॥ చెన్నారెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఆంధ్ర నాయకుల కుయుక్తులకు తలొగ్గి, ఆంధ్రులకు బంగారు పళ్లాన్ని అందించాడని అంటుంటారు.

ఉద్యమాన్ని చల్లార్చడానికి 1969లో అఖిలపక్ష ఒప్పందం కుదుర్చుకున్నారు.

## 1969 నాటి అఖిల పక్ష ఒప్పందం :

1. నిబంధనలకు వ్యతిరేకంగా చేరినవారిని ఉద్యోగాలనుండి తొలగించి, వారిస్థానంలో స్థానికులను నియమించాలి.
   *(ఇప్పటివరకు ఒక్కరిని కూడా తొలగించలేదు)*
2. తప్పుడు ముల్కి సర్టిఫికెట్‌లను సమర్పించిన వారిని విచారించి, శిక్షించాలి.
   *(విచారించిందే లేనప్పుడు శిక్షించడమెక్కడిది?)*
3. స్థానిక సంస్థలకు ముల్కి నిబంధనలను విస్తరించాలి.
   *(ప్రభుత్వ సంస్థలలోనే దిక్కులేదంటే స్థానిక సంస్థలలో వేరే చెప్పాలా?)*



4. సీనియార్టీని నిర్ణయించడంలో న్యాయస్థానాల తీర్పులను గౌరవించాలి.
   *(న్యాయస్థానాలను సంప్రదించారేగాని, తీర్పులను గౌరవించలేదు)*
5. ఆంధ్ర ప్రాంతానికి వెచ్చించిన తెలంగాణ నిధులను లెక్కించి, రాబోయే కాలంలో తెలంగాణకు కేటాయించాలి.
   *(తెలంగాణా మిగులునే తేల్చలేదు. అందుకే కేటాయించే ప్రశ్న ఉదయించలేదు)*
6. రాజధాని నగరంలో విద్యా వసతులను పెంచాలి.
   *(ప్రభుత్వ రంగంలో పెంచలేకపోయారు కాని ప్రైవేటు రంగంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి)*

ఎలాగైతేనేమి తెలంగాణా ఉద్యమం సద్దుమనిగింది. 1971లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర నివాదంతో ఎన్నికల బరిలోదిగిన తెలంగాణ ప్రజాసమితికి బ్రహ్మరథం పడుతూ 10 మంది పార్లమెంటు సభ్యులను గెలిపించారు. దీనితో తెలంగాణ ప్రజలంతా ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్నారని లోకానికి వెల్లడైంది. దురదృష్టవశాత్తు అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్న



నాటి మన దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రజల తీర్పును కాలరాశారు. ఆంధ్రనాయకుల గారడీ విద్యలకు ఆమె లొంగిపోవడంతో ఆంధ్రా కాంగ్రెస్ మాత్రమే మోసం చేస్తున్నదని భావించేస్థానాన్ని మొత్తం కాంగ్రెస్ పార్టీయే మోసంచేసిందని చెప్పుకునేలాచేసింది. ప్రజాసమితి పేరుతో గెలిచిన ఎం.పీలకు ఎరవేసి కాంగ్రెస్ పార్టీలో కలుపుకొని ఆ పార్టీదగాచేసింది. ఆ ఉద్యమంలోంచి పుట్టుకొచ్చి, రాజకీయ నాయకులుగా ఎదిగిన వారంతానేడు కాంగ్రెస్ పార్టీలోనే ఉండి తెలంగాణకు అడుగడుగునా అడ్డు తగులుతున్నారు.

> ***1969 లో 10 మంది పార్లమెంటు సభ్యులనిస్తే కాస్త ఓపిక పట్టమన్న ఇందిరమ్మ మాటకు ఇవాళ్టివరకు ఆగాం. ఇంకెంతకాలం ఆగాలి?*** *-కాళోజీ*

## జై ఆంధ్రా ఉద్యమం

ముల్కి నిబంధనలు చెల్లుబాటేనని సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇవ్వడంతో ఆంధ్రులలో కలకలం బయలుదేరింది. ముల్కి నిబంధనలు చెల్లుబాటు అయ్యేటట్లయితే ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలని జై ఆంధ్ర ఉద్యమాన్ని చేపట్టారు. ఈ ఉద్యమానికి ఆంధ్రులంతా సమైక్యంగా అండగా నిలబడ్డారు.

జరిగే వరకు జయభేరి, జరగకపోతే రణభేరి అన్నట్లు జరిగినంతకాలం తెలంగాణ వనరులను విజయవంతంగా కొల్లగొట్టారు. ముల్కి నిబంధనల చెల్లుబాటులో సుప్రీం కోర్టు తెలంగాణకు అనుకూలంగా తీర్పునివ్వటంతో తమ దోపిడీకి అడ్డు తగిలినట్టు భావించిన ఆంధ్రపాలకులు 'జైఆంధ్ర' పేరుతో రణభేరి మోగించారు. జై ఆంధ్రా ఉద్యమలక్ష్యం ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కంటే తెలంగాణ రక్షణలు ఎత్తివేసి, ఆంధ్రులదోపిడీకి హద్దులు చెరిపివేయడమే ముఖ్యమైంది. ఆ ఉద్యమాన్ని చల్లబరచడడానికి ఆనాటి కేంద్ర ప్రభుత్వం ఆరు సూత్రాల పథకాన్ని ప్రకటించింది. **ఆరు సూత్రాల పథకంతో జై ఆంధ్ర ఉద్యమం ఆగిపోయింది కాని, తెలంగాణా మాత్రం చెప్పలేనంత నష్టపోయింది.**

**ఆరు సూత్రాల పథకం వల్ల తెలంగాణకు జరిగిన నష్టాలు :**

★ ముల్కి నిబంధనలు రద్దు.

★ తెలంగాణ ప్రాంతీయ కమిటి రద్దు.

★ రాజధానిని ఫ్రీ జోన్‌గా వారికి వారే చెప్పుకోవడం.



★ నివాస పరిమితిని 12 సంవత్సరాల నుండి నాలుగు సంవత్సరాలకు తగ్గించడం.

★ ఆంధ్రా తెలంగాణలకు చెందిన ఆదాయ వ్యయాలను విడిగా చూపే పద్ధతిని రద్దు చేయడం.

ఈ పథకంలో ఆంధ్రులకు అనుకూలమైన నిబంధనలన్నీ పొల్లు పోకుండా, కాలయాపన లేకుండా అమలు చేయబడగా, తెలంగాణకు అనుకూలంగా ఉన్న నిబంధనలు అమలుకు నోచుకోలేదు. విశాలాంధ్ర ఏర్పాటు తర్వాత కుదుర్చుకున్న ఒప్పందాలలోకెల్లా ఈ ఆరుసూత్రాల పథకమే ఆంధ్రులకు అత్యధికంగా మేలును చేకూర్చగా, తెలంగాణాకు మాత్రం కష్ట నష్టాలను పెంచింది.

> తెలంగాణ ప్రాంత ప్రజల వెనుకబాటు తనం దూరం అయ్యేవరకు ప్రత్యేక రాష్ట్ర వాదం కొనసాగుతూనే ఉంటుంది. ఈ ఆందోళనను ఆపగలిగే శక్తి ఎవరికీ లేదు. వీలైతే తమ సహాయాన్ని అందించాలి. వీలుకాకపోతే ఒకళ్ళు చేసే ప్రయత్నాలకు అడ్డురాకపోవడం మంచిది. **-కాళోజి**



# ఆంధ్ర పాలనలో తెలంగాణకు జరిగిన/జరుగుతున్న నష్టాలు

సమైక్య రాష్ట్ర ఏర్పాటుతో అన్ని రంగాలలో తెలంగాణాకు అన్యాయమే జరిగింది. అన్యాయాల వల్ల జరుగుతున్న నష్టం సరిచేయలేనంత దూరం వెళ్ళిపోయింది. కలిసి ఉండడానికి వీలులేనంత వ్యత్యాసాలు పెరిగిపోయాయి. కొన్ని ప్రధాన రంగాలలో ఏమేరకు నష్టపోయామో స్థూలంగా తెలుసుకుందాం.

## 1. విద్యా రంగం :

విద్యావంతులను బట్టి అభివృద్ధి ఆధారపడి ఉంటుందని చెబుతుంటారు. నిజాంకాలంలో తెలుగుకు ప్రాధాన్యత కల్పించకపోవడం వల్ల తెలంగాణ కొంత నష్టపోగా, సమైక్య రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణలోని విద్యాసౌకర్యాలన్నింటిని ఆంధ్రులే చేజిక్కించుకోవడం, విద్యావసతుల కల్పనలో వివక్షను చూపించడం వల్ల సర్వం నష్టపోయాం. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, నర్సింగ్ స్కూల్‌లు మొదలగు వాటినన్నింటిని స్థాపించడంలో తెలంగాణాను మోసమే చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల



విషయంలోనే కాక, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో కూడా తెలంగాణను నిలువునా ముంచారు. ప్రభుత్వ ఖర్చుతో నడిచే విద్యా సంస్థలన్నీ ఆంధ్రా, రాయలసీమలలో ఉండగా, వ్యాపారాత్మక దృష్టితో నడుస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలు తెలంగాణా అంతటా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఒక గుంటూరు జిల్లాకు ఇచ్చే గ్రాంటు, అన్ని తెలంగాణ జిల్లాలకు ఇచ్చే గ్రాంటు కన్న ఎక్కువ.

రాష్ట్రంలో ప్రాంతీయ పరిధి కలిగిన ఆరు విశ్వవిద్యాలయాలలో కోస్తా ఆంధ్రలో రెండు, రాయలసీమలో రెండు, తెలంగాణలో ఒకటి, రాజధానిలో ఒకటి ఉన్నాయి. హైదరాబాదును ఫ్రీజోన్‌గా చెప్పుకుంటున్నందున ఇక్కడి సంస్థలను తెలంగాణా ఖాతా క్రింద జమకట్టడానికి వీలు లేదు. ఇవిగాక రాష్ట్ర వ్యాప్త పరిధిగల విశ్వ విద్యాలయాలలో మహిళా విశ్వ విద్యాలయం, ద్రావిడ భాషల విశ్వవిద్యాలయాలు రాయలసీమలో ఉండగా, వైద్య విశ్వ విద్యాలయం విజయవాడలో ఉన్నది. స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలైన సంస్కృత విశ్వవిద్యాలయం, సత్యసాయి ఉన్నత విద్యా సంస్థలు కూడా రాయలసీమలోనే ఉన్నాయి. ఇవిపోను మిగిలిన అన్ని విశ్వవిద్యాలయాలు, ఆ స్థాయి సంస్థలు, ఒక్క కాకతీయ విశ్వవిద్యాలయం తప్ప అన్నీ రాజధాని నగరంలోనే ఉన్నాయి.

విశాఖపట్నంలో ఆంధ్రా విశ్వవిద్యాలయం, తిరుపతిలో వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, గుంటూరులో నాగార్జున, అనంతపూర్‌లో కృష్ణదేవరాయ, కుప్పంలో ద్రావిడ భాషల విశ్వ విద్యాలయాలు ఉన్నాయి. వరంగల్‌లో స్థాపించిన సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని రాజధానికే తరలించారు. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయాలకు సంబంధించిన శాఖలను నెలకొల్పారు. కాని ఇలాంటి శాఖల స్థాపనకు తెలంగాణ జిల్లాలు మాత్రం నోచుకోలేదు. నల్గొండలో స్థాపించాలని శంకుస్థాపన చేసిన సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని కూడా రాజధానికే తరలించారు. ఒక్కమాటలో చెప్పాలంటే విశ్వవిద్యాలయాలు, ఆ స్థాయికి చెందిన మొత్తం 21 సంస్థలలో ఆంధ్ర రాయలసీమల్లో 10, రాష్ట్ర రాజధానిలో 10, తెలంగాణలో 1 మాత్రమే ఉన్నాయి. ఇటీవలే మరో మూడు విశ్వవిద్యాలయాలను స్థాపించాలని ప్రస్తుత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంలో కూడా పక్షపాతమే దాగిఉన్నది. ఆంధ్ర రాష్ట్రంనుండి వచ్చికలిసిన కోస్తాంధ్ర-రాయలసీమ ప్రాంతాలను రెండు ప్రాంతాలుగా చూపించి రెండు విశ్వవిద్యాలయాలను అక్కడ స్థాపించాలని నిర్ణయించగా, 4 జిల్లాల రాయలసీమతో తెలంగాణను జమకడుతూ, ఇప్పటికే అక్కడ ఉన్న అధిక విశ్వవిద్యాలయాలను



పరిగణనలోనికి తీసుకోకుండా, తెలంగాణకు ఒక విశ్వవిద్యాలయాన్ని మాత్రం కేటాయించడం ఎంత ఘోరమో ఆలోచించండి

**విద్యారంగంలో తెలంగాణకు జరిగిన అన్యాయాలు (2001-02) :**

| | ఆంధ్ర | రాయలసీమ | తెలంగాణ |
|---|---|---|---|
| జూనియర్ కళాశాలలు | 266 | 138 | 176 |
| డిగ్రీ కళాశాలలు | 167 | 70 | 74 |
| అన్ని రకాల పాఠశాలలు | 26,786 | 12,857 | 17,594 |
| అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు | 88,435 | 38,552 | 65,040 |
| అక్షరాస్యతా శాతం | 39% | 38% | 30% |
| ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ఖర్చు (సంవత్సరానికి కోట్లలో) | 17.4 | 7.73 | 2.63 |
| 1969 నుండి నేటివరకు ఎయిడెడ్ జూనియర్ కళాశాలలకు ఖర్చు కోట్లలో | 365 | 162 | 55 |
| ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలకు ఖర్చు (సంవత్సరానికి కోట్లలో) | 38.52 | 8.74 | 5.76 |
| 1956 నుండి నేటివరకు ఖర్చు కోట్లలో | 848 | 181 | 121 |
| ప్రైమరీ స్కూల్స్ శాతాలలో | 48 | 23 | 29 |



ఆంధ్ర, రాయలసీమలలోని విశ్వవిద్యాలయాలు ఆ ప్రాంతపు విద్యార్థులకు, ఉద్యోగులకు మాత్రమే నిలయం కాగా, రాజధాని నగరంలోని సంస్థలలో కూడా ఆ ప్రాంతం వారే సింహ భాగం దక్కించుకున్నారు. ఇక్కడి సంస్థలలోని వైస్-చాన్స్‌లర్‌లు, ప్రిన్సిపాల్స్, అధికారులు, ఉద్యోగులలో అధికభాగం ఆంధ్రులేకాగా, అక్కడి సంస్థలలో తెలంగాణా వారికి కనీసం అటెండర్‌లాంటి పోస్టులు కూడా దక్కలేదు. ఇక్కడ కూడా మనవారికి దక్కింది స్వీపర్లు, అటెండర్స్, క్లర్క్‌లలాంటి ఉద్యోగాలే. అందులో కూడా ఆంధ్రులు లేరని చెప్పలేం. ముల్కీ నిబంధనలు అమలులో ఉన్న కాలంలో కూడా మన విద్యా సౌకర్యాలు మనకు దక్కలేదు. రాజధానిలో ఉన్నటువంటి రాష్ట్రవ్యాప్త పరిధి కలిగిన యూనివర్సిటీలలో తెలంగాణాకు చెందిన వారు 10 శాతంలోపే ఉండగా, తెలంగాణేతరులు 90 శాతంపైగా ఉన్నారు. ఇదిలా ఉండగా ఆంధ్రా, రాయలసీమలలోని, విశ్వవిద్యాలయాలలో ఆ ప్రాంతానికి చెందినవారే 99 శాతం కాగా, ఒక్కశాతం కూడా తెలంగాణా వారు ఉన్నట్లు దాఖలాలు లేవు.

ఆంధ్ర ప్రాంతంలో లక్షమంది జనాభాకు, రాయలసీమలో 70 వేల మంది జనాభాకు ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండగా,



తెలంగాణాలో మాత్రం ఆరు లక్షల జనాభాకు ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పర్చడం దోపిడీ విధానంలో భాగమే. లక్షా డెబ్బైవేల మందికి ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆ రెండు ప్రాంతాలలో ఉండగా, మూడు లక్షల డెబ్బై వేల మందికి ఒక డిగ్రీ కళాశాల తెలంగాణలో ఉన్నది. వెయ్యి జనాభాకే ఒక్క ప్రాథమిక పాఠశాల అక్కడ ఉండగా, రెండు వేల జనాభాకు ఒకటి ఇక్కడ ఉన్నది.

## 2. వైద్యం :

సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ముందే ఇక్కడ ఉస్మానియా, గాంధీ, నిజాం, క్యాన్సర్, నీలోఫర్, కోరంటి, యునాని, ప్రసూతి ఆసుపత్రులు నిర్మించబడి, ప్రజారోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడ్డాయి. అయితే విశాలాంధ్ర ఏర్పాటు తర్వాత క్రమక్రమంగా పాలకుల వివక్షవల్ల ఈ వ్యవస్థను నాశనం చేశారు. సమైక్య రాష్ట్ర ఏర్పాటు తరువాతే వైద్య వ్యవస్థకు గ్రహణం పట్టింది. నిజాం ఆర్థోపెడిక్ ఆసుపత్రిని స్వయం ప్రతిపత్తి సంస్థగా మార్చి పేదలకు అందని ద్రాక్షపండుగా చేసి, మిగతా ఆసుపత్రులన్నింటిని ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఈ బూటకపు పాలకుల రాకతో పాలిచ్చే ఆవులు పోయి గొడ్డుటావులు దక్కాయి. సామాన్యులకు అందుబాటులో లేని

కార్పోరేట్ ఆసుపత్రులు ఇబ్బడి ముబ్బడిగా, పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. మధ్యతరగతి వారికే అందుబాటులో లేని ఈ ఆసుపత్రులు బీదవారికి గొడ్డుటావులే. నిరంకుశుడైన నిజాం నవాబు ప్రజారోగ్యంపై చూపించినంత శ్రద్ధ, ప్రజాస్వామ్య ప్రభుత్వంగా చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వాలు చూపించలేకపోయాయి.

ఎంతోకాలం నుండి సేవలందిస్తూ వస్తున్న ఆసుపత్రులన్నింటిని నిధుల లేమికి గురిచేసి, మా తాతలు నేతులు తాగారని చెప్పుకోవడానికి మాత్రమే ఉపయోగపడేలా చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల స్థానంలో కార్పోరేట్ రంగానికి పట్టం కట్టారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మందులుండవు. డాక్టర్లుండరు. వసతులుండవు. నిధులు కేటాయించడం లేదు. చివరికి వీటిని కేవలం పోస్టుమార్టం ఆసుపత్రులుగా మాత్రమే మిగిల్చారు. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రులను నరకకూపాలుగా సామాన్య జనం చెప్పుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు వైద్య సేవలను అందించలేకపోవడం, కార్పోరేట్ ఆసుపత్రుల విపరీతమైన ఖర్చులను భరించలేకపోవడం మధ్యన సామాన్య జనం దేవునిపై భారం వేసి రోగాలతో కుమిలిపోతున్నారు. కొంతమంది తాహతుకు మించి అప్పులను చేసి కార్పోరేట్



ఆసుపత్రులవైపు పరుగెత్తి, అప్పుల్లో మునిగి జీవచ్ఛవాలుగా బతుకులను వెళ్ళదీస్తున్నారు. విచిత్రమేమంటే కార్పోరేట్ ఆసుపత్రులన్నీ ఆంధ్రులకు చెందినవే కాగా, ప్రభుత్వ ఆసుపత్రులలో కూడా డాక్టర్లు, సిబ్బందిలో ఎక్కువశాతం ఆంధ్రులే.

పేదలకు రెండు రూపాయలకు ఒక కిలో బియ్యం ఇవ్వలేమని చేతులెత్తేసిన ఈ ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగులకు మాత్రం కార్పోరేట్ ఆసుపత్రుల వైద్య ఖర్చులను భరించడానికి ముందుకు రావడం విడ్డూరం. ఉద్యోగులలో అధిక శాతం ఆంధ్రులే అయినందువల్లనో, కార్పోరేట్ ఆసుపత్రులన్ని ఆంధ్రులవే అయినందువల్లనో ఈ బూటకపు వెసలుబాటును కల్పించి ఉండవచ్చు. ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలను పొందడానికి అంగీకరించడం లేదంటే అవి ఎలా పనిచేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. పేదప్రజలకు చిన్న చిన్న మందులను ఉచితంగా అందించలేమని చెబుతున్న ప్రభుత్వం, ఉద్యోగులకు పెద్దమొత్తంలో చెల్లించడానికి ముందుకు రావడంలో ఆంతర్యమేమిటో? అస్మదీయుల కార్పోరేట్ ఆసుపత్రులను లాభాల బాటలో పయనింపచేయడానికే ఈ వెసలు బాటును కల్పించివుండవచ్చు. కార్పోరేట్ ఆసుపత్రులన్ని



కేవలం ప్రభుత్వ సహాయంతోనే గట్టెక్కగలుగుతున్నాయని అందులోని రోగులైన మంత్రులను, అధికారులను, ఉద్యోగులను చూసినప్పుడు తెలిసిపోతున్నది. ఇంతపెద్ద ఎత్తున ప్రభుత్వం నుండి రాయితీలను అందుకుంటున్న ఈ కార్పోరేట్ ఆసుపత్రులు ప్రాణాలతో పోరాటం జరుపుతున్న రోగులువస్తే, వారిని ఉస్మానియా, గాంధీలకు వెళ్ళమంటారెందుకో!

| **ఆసుపత్రులు(2001-02)** | **ఆంధ్ర** | **రాయలసీమ** | **తెలంగాణ** |
|---|---|---|---|
| హోమియో ఆసుపత్రులు | 139 | 56 | 50 |
| స్త్రీ, శిశు ఆసుపత్రులు | 5 | 2 | 2 |
| ఆయుర్వేద ఆసుపత్రులు | 392 | 195 | 128 |
| వెటర్నరీ ఆసుపత్రులు | 120 | 50 | 90 |

1956 నుండి తెలంగాణాలో ఒక్క జనరల్ ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేయలేదు. తెలంగాణాకు కేటాయించిన నిధులనుండి ఉమ్మడి ప్రాంతాల ప్రజల అవసరాలను నెరవేరుస్తున్న ఉస్మానియా, గాంధీలాంటి ప్రభుత్వ ఆసుపత్రులకు అరకొర నిధులను అందజేస్తున్నారు. వీటికి ఏయేటికాయేడు కేటాయింపులు తగ్గిపోతున్నాయి. ఇదే సమయంలో కార్పోరేట్ ఆసుపత్రులకు, నర్సింగ్



హోమ్‌లకు సబ్సిడీ ధరల్లో స్థలాలు, జాతీయ బ్యాంకుల ద్వారా ఋణాలు కల్పిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగపరుస్తున్నారు. ఉదాహరణకు అపోలో ఆసుపత్రికి ఆనాడు ఎకరానికి మూడు లక్షల రూపాయల మార్కెట్ ధర ఉన్న భూమిని కేవలం ఎకరానికి ఎనిమిది వేల నాలుగు వందల రూపాయల (రూ. 8,400/-) చొప్పున 30 ఎకరాల భూమిని కేటాయించారు.

ఏనాటినుండో ఉన్న ఇక్కడి ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీలను విజయవాడలోని వైద్య విధాన పరిషత్‌కు అనుబంధ సంస్థలుగా మార్చారు. విజయవాడ, తిరుపతిలలో ఆరోగ్య శాస్త్రాల సంస్థలను స్థాపించడం వల్ల అక్కడి ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి కాని, తెలంగాణాలోని ఏ ఒక్కజిల్లా కూడా ఈ అదృష్టానికి నోచుకోలేదు.

వద్దంటే గద్దె ఎక్కి పెద్దరికం చేస్తావా?
మూడుకోట్ల చేతులు
నీ మేడను పడదోస్తాయి - మెడనే విడదీస్తాయి
నీకు నిలుచు హక్కు లేదు - నీకింకా దిక్కులేదు

నిజాం నవాబుకు వ్యతిరేకంగా దాశరథి వ్రాసిన ఈ కవిత నేటి ఆంధ్రా పాలకులకు కూడా సరిగ్గానే సరిపోతుంది.

## 3. ఉద్యోగాలు :

వీరోచిత పోరాటాలకు, విప్లవోద్యమాలకు మారుపేరైన తెలంగాణా యువత నేడు నిరాశ, నిస్పృహల్లో మునిగిపోయింది. ఆకలికేకలతో అలమటిస్తున్నది. రాష్ట్రంలోని ఉపాధి అవకాశాలన్నింటిలో కోస్తా, రాయలసీమవారి హడావిడే తప్ప తెలంగాణా వాసుల ఊసే వినిపించడం లేదు. ఆరుసూత్రాల పథకం పేరున ముల్కి నిబంధనలను కాలరాసి, ఉద్యోగాలన్నింటిని గుండుగుత్తగా ఆంధ్రులే చేజిక్కించుకుని, తెలంగాణాకు నిరుద్యోగాన్ని మిగిల్చారు. ఆరు సూత్రాల పథకం రాకముందే తెలంగాణా వాసులకు దక్కాల్సిన 22వేల ఉద్యోగాలలో తెలంగాణేతరులు నియమింపబడ్డారు. సెక్రటేరియట్ ఏర్పాటు చేసినప్పుడు మరో 50 వేల మందిని దిగుమతి చేసుకున్నారు. తెలంగాణా వారికి తెలుగు రాదని ఇంకో లక్ష ఉద్యోగాలను ఆంధ్ర – రాయలసీమ వారితో నింపారు. ప్రభుత్వరంగ సంస్థలు, కార్పోరేషన్‌లను ముల్కితో నిమిత్తం లేకుండా తెలంగాణేతరులతో నింపేశారు. స్థానిక సంస్థలలో పద్ధతీ పాడు లేకుండా ఈ ప్రాంతం వారిని దరిచేరనీయలేదు.



1983 లో ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారమే ఎన్జీవోలలో రెండు లక్షల ఇరవై నాలుగువేలమంది ఆంధ్రులు కాగా, లక్షా తొమ్మిదివేల మంది మాత్రమే తెలంగాణాకు చెందినవారు. గత 45 ఏళ్ళుగా ఉద్యోగాలలో తెలంగాణావారికి చెప్పలేనంత అన్యాయం జరిగినా పట్టించుకునేవారే కరువైనారు. తెలుగుదేశం రాకతో ఈ వ్యత్యాసాలు మరింత పెరిగాయి. తెలుగు విశ్వవిద్యాలయం, ఓపెన్ యూనివర్సిటీ, పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయాలలో తెలంగాణ ప్రాతినిధ్యం నామమాత్రమే. తెలంగాణకు చెందిన విద్యావంతులంతా కేవలం ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజిలలో పేర్ల నమోదుకే పరిమితమైనారు. పరిశ్రమలలో పనిచేస్తున్నవారు కూడా రెండున్నర లక్షలమంది ఆంధ్రులే కాగా, లక్షలోపు మాత్రమే తెలంగాణావారున్నారు. దినసరివేతనంతో కంపెనీలలో పనిచేసేవారిలో సహితం 83% ఆంధ్రులే కాగా, 17% మాత్రం తెలంగాణకు చెందినవారు ఉన్నారు. ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే ఉన్న పరిశ్రమల్లో దాదాపు 1,60,000 మంది తెలంగాణేతరులు పనిచేస్తున్నట్లు అంచనా.



నిజాం కాలంలోని తెలంగాణా ఉద్యోగులు పదవీ విరమణ చేసినపుడు ఆ ఖాళీలన్నింటినీ ఆంధ్రులతో నింపారు. ఆరవ జోన్‌లో భాగమైన హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా చెప్పుకుంటూ ఉద్యోగాలన్నీ ఆంధ్రులకే కట్టబెట్టారు. తెలంగాణా జిల్లాలలోకూడా అధికారుల స్థాయి ఉద్యోగాలన్నింటిని ఆంధ్రులతోనే నింపారు. అదే కోస్తా-రాయలసీమలలో చిరుద్యోగాలలో కూడా తెలంగాణాకు చెందినవారికి స్థానమీయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా పై స్థాయి అధికారులంతా ఆంధ్రులే అయినందున లోపాయికారిగా వ్యవహారం నడిచిపోతున్నది. న్యాయస్థానాలలో కూడా 95% తెలంగాణేతరులే అయినందున కోర్టులకెక్కినా తెలంగాణకు న్యాయం జరగడం కష్టమే. తెలంగాణాకే పరిమితమయిన సంస్థలలో కూడా ఆంధ్రులదే ఆధిపత్యం. ప్రభుత్వోద్యోగాలలో అధికభాగం ఆంధ్రులకే కట్టబెట్టడం నేటికి జరుగుతున్న తంతే. జిల్లా కలెక్టర్లు, జడ్జీలు, అధికారులు వంటి పదవులు ఆంధ్రులకు దక్కగా, కొద్దిపాటి క్లర్కులు, బంట్రోతులు తెలంగాణాకు దక్కాయి. ప్రస్తుతం సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులలో 87% ఆంధ్రులే ఉండడాన్ని బట్టి తెలంగాణాకు జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని అంచనా వేసుకోవచ్చు.



| ఉన్నతోద్యోగాలు (2001-02) | ఆంధ్ర | రాయలసీమ | తెలంగాణ |
|---|---|---|---|
| ఐ.ఎ.ఎస్ | 115 | 19 | 27 |
| ఐ.పి.ఎస్. | 50 | 19 | 20 |
| ఐ.ఎఫ్.ఎస్. | 48 | 6 | 20 |
| హైకోర్టు జడ్జీలు | 15 | 2 | 8 |
| తెలంగాణా కోర్టులలో వివిధ రకాల జడ్జీలు | 69 | 13 | 31 |
| తెలంగాణా ఇంజనీరింగ్ కాలేజీల ప్రిన్సిపాల్స్ | 7 | 1 | 25 |
| ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీల ప్రిన్సిపాల్స్ | 27 | - | - |
| రాయలసీమ ఇంజనీరింగ్ కాలేజీల ప్రిన్సిపాల్స్ | 2 | 10 | - |
| ఎన్.జి.రంగా కాలేజీల ప్రిన్సిపాల్స్ | 9 | 4 | - |
| ఎన్.జి.రంగా బోర్డు మెంబర్లు | 9 | 2 | 4 |
| ఎ.పి.పి.ఎస్.సి.బోర్డు మెంబర్లు | 7 | 6 | 2 |
| కమర్షియల్ టాక్సు ఆఫీసులో అధికారులు | 418 | 42 | 161 |
| కలెక్టర్లు | 10 | 1 | - |
| వైస్ ఛాన్సలర్లు | 10 | 2 | 5 |
| రిజిస్ట్రార్లు (విశ్వవిద్యాలయాలు) | 6 | 7 | 4 |
| ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అధికార్లు | 5 | - | - |

**610 జి.ఓ. పూర్వాపరాలు :**

తెలంగాణాకు ఉద్యోగాలలో అన్యాయం జరిగిందని నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 30-12-1985న 1975 నుండి 1985 వరకు జరిగిన అక్రమాలను సరిచేసే ఉద్దేశ్యంతో 610 జి.ఓ.ను జారీచేయడమైనది. తెలంగాణ వారికి బదులుగా ఉద్యోగాలను పొందిన ఆంధ్రులను వారి ప్రాంతాలకే బదిలీ చేసి, ఆ స్థానంలో తెలంగాణ వారినే నియమించాలనేది ఈ జి.ఓ. ముఖ్యోద్దేశ్యం. వాస్తవానికి ఈ జి.ఓ. 31-3-1986 నాటికే అమలు చేయాల్సిందిగా కాల వ్యవధిని నిర్ణయించారు. కానీ 20 సంవత్సరాలు గడిచినా పాలకుల వివక్ష వలన, అధికారులు తెలంగాణను సవతి తల్లి సంతానంగా భావిస్తున్నందువల్ల నేటికీ అమలుకు నోచుకోలేదు. ఇదిలా ఉండగా ఈ మధ్యకాలంలో తెలంగాణా వాసులకు దక్కాల్సిన మరిన్ని ఉద్యోగాలను ఆంధ్రులు కొల్లగొట్టారు. ఫలితంగా తెలంగాణకు చెందిన విద్యావంతులు రోడ్లవెంబడి తిరగడమో, అడవులపాలు కావడమో ఆనవాయితీగా మారింది.

1956లో సమైక్య రాష్ట్రం ఏర్పడిన నాటినుండి ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. 1968 నాటికే తెలంగాణకు చెందాల్సిన 25 వేల ఉద్యోగాలను ఆంధ్రులు చేజిక్కించుకున్నట్లు నిర్ధారించి,



ఇప్పుడు 610 జి.ఓ.ను విడుదల చేసినట్లుగానే, 21-1-1969న నాటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి జి.ఓ. 36ను జారీ చేసినప్పటికి అమలుకు నోచుకోలేదు.

**610 జి.ఓ.లోని ప్రధాన అంశాలు :**

1. నిబంధనలకు వ్యతిరేకంగా నియమించబడిన వారిని వారివారి స్వస్థలాలకు 31-3-1986 లోగా పంపించాలి.
2. జూరాల, శ్రీశైలం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల కింద నియమించబడిన నాన్ గజిటెడ్ కేడర్ ఉద్యోగాలకు చెందిన స్థానికేతరులను వారివారి జోన్‌లకు బదిలీ చేయాలి.
3. సెక్రటేరియట్, శాఖాధిపతుల కార్యాలయాలలో లోకల్ వారికి తగిన న్యాయం జరగాలి.
4. లోకల్ క్యాండిడేట్లుగా బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలను పొందినవారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలి.
5. అక్రమ నియామకాలు, ప్రమోషన్లకు సంబంధించి తెలంగాణ అభ్యర్థులు చేసుకునే అప్పీల్లన్నింటిని 31-3-86లోగా పరిష్కరించాలి.
6. ప్రెసిడెన్సియల్ ఆర్డర్ తర్వాత జరిగిన నియామకాలు, ప్రమోషన్లన్నింటిని పరిశీలించి 30-6-1986 లోగా రాష్ట్ర



సచివాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించి తెలంగాణ ఉద్యోగులకు జరిగిన అన్యాయాలను సరి చేయాలి.

610 జి.ఓ. జారీ అయ్యే నాటికే 59వేల తెలంగాణకు చెందిన ఉద్యోగాలను స్థానికేతరులు దక్కించుకున్నట్లు అంచనా. అయితే వాటిని సవరించకపోగా నేటికి ఆ సంఖ్య రెండున్నర లక్షలు దాటిందని అంటున్నారు.

**610 జి.ఓ.పై చిత్తశుద్ధిలేని రాజకీయ పార్టీలు :**

ఛండశాసనుడిగా పేరుగాంచిన ఎన్టీఆర్ తానే 1985లో విడుదల చేసిన 610 జిఓను అమలు చేయకుండా నాలుగేళ్ళపాటు పదవీకాలాన్ని వెళ్ళబుచ్చారు. 1989-94 మధ్య కాంగ్రెస్ అధికారంలో వున్నా ఈ జి.ఓ.ను అమలు చేయలేకపోయింది. 1995 నుండి 2004 వరకు అధికారంలో వున్న తెలుగుదేశం ప్రభుత్వం ఈ జి.ఓ.ను అమలు చేయలేదు. తెలుగుదేశానికి కొంతకాలం మిత్రపక్షంగా, మరికొంతకాలం శత్రుపక్షంగా ఉన్న కమ్యూనిస్టులు ఈ విషయంలో మూగబోయారు. తెలంగాణలో మాత్రమే ఉనికిని కలిగి ఉన్న బిజెపి తెలుగుదేశానికి మిత్రపక్షంగా ఉండికూడా ఏమీ సాధించలేకపోయింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ రెండేళ్ళు గడిచినా ఈ జీ.వో అమలు చేస్తామంటూనే ఆచరణలో ఆ కమిటీ



ఈ కమిటీ అని కాలం వెల్లదీస్తున్నది.

కంచే చేను మేసినట్లు ప్రభుత్వ ఉత్తర్వులను అధికారులే అమలు చేయకుండా అడ్డుకుంటుండగా అడిగేదెవరిని? అమలు చేయలేని ఉత్తర్వును ఎందుకు జారీ చేసినట్టు? ఈ జి.ఓను అమలు చేయకపోవడంతో జారీ చేసిన రామారావు, ఆయన తరువాత వచ్చిన ముఖ్య మంత్రులందరినీ అసమర్థుల కిందే జమకట్టాలి. అసమర్థుడైన రాజును నమ్ముకునేకన్న అసలు రాజే లేకపోవడం ఉత్తమమని నీతి శాస్త్రాల్లో చెబుతుంటారు. ఈ జి.ఓ అమలుకు నోచుకోకపోవడానికి బాధ్యులెవరో గుర్తించిందీ లేదు, శిక్షించిందీ లేదు. తెలంగాణకు అన్యాయం జరిగే జి.ఓలన్నీ అక్షరం పొల్లుపోకుండా ఆగమేఘాలమీద అమలవుతుండగా, తెలంగాణకు ప్రయోజనం చేకూర్చే ఏ జి.ఓ కూడా అమలు కావడం లేదంటే పాలకుల పక్షపాతం ఎంత తీవ్రంగా వుందో అర్థం చేసుకోవచ్చు.

ఈ జివోపై గిర్‌గ్లానీ కమీషన్ తన నివేదికను ఏనాడో ప్రభుత్వానికి అందజేసింది. క్యాబినెట్ ఆమోదించింది. అయినా అమలు చేయటంలో అదే తాత్సారం. ఆ కమీషన్ తన తుది రిపోర్టులో తెలంగాణా వాసులకు ఉద్యోగాలలో అన్ని రంగాలలో కూడా అన్యాయమే జరిగిందని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం.

## 4. నీటి వనరులు :

> గనుల్లోంచి బంగారాన్ని బయటకు తీస్తే వచ్చే ఆదాయం కన్న -
> భూమికి నీటి వసతి కలిపిస్తే వచ్చే ఆదాయం ఎక్కువ
>
> **-సర్ ఆర్థర్ కాటన్**

తెలంగాణ కుడి, ఎడమల కృష్ణా, గోదావరి నదులు పారుతున్నా, దేశంలోనే అగ్రస్థానంలో వుండాల్సిన ఈ ప్రాంతం ఆంధ్ర పాలకుల వివక్ష వల్ల దేశంలోనే వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. తెలంగాణకు సాగునీరు అందకపోవడమేగాక, కనీసం త్రాగునీటికి కూడా నోచుకోలేకపోయింది. కృష్ణా నదికి స్వాగతం పలుకుతున్న పాలమూరుకు సాగునీరు లేదు, వీడ్కోలు పలుకుతున్న నల్గొండకు త్రాగునీరు లేదు. నాగార్జున సాగర్ నిర్మాణానికి నల్గొండ జిల్లా 21 గ్రామాలను కోల్పోయింది. ఈ జిల్లా వాసులు ఫ్లోరైడ్ నీటికి బలై పుట్టుకతోనే కాళ్లు చేతులు వంకరలై అవిటితనాన్ని అనుభవిస్తున్నారు. తెలంగాణ కష్టాలకు అసలైన కారణాలలో నీటి వనరులలో జరిగిన మోసమే ప్రధానమైనది. రాష్ట్ర ధాన్యాగారంగా పేరెన్నికగన్న కోస్తా జిల్లాలకు సాగునీటిని అందజేస్తున్న కృష్ణా, గోదావరి నదులు రెండు కూడా తెలంగాణ ప్రాంతంలోనే ప్రవేశించి ఈ ప్రాంతవాసులను వెక్కిరిస్తూ, అదనంగా ఈ ప్రాంత ప్రజల కన్నీటిని కూడా తమలో కలుపుకొని కోస్తాంధ్ర భూములను తడుపుతున్నాయి.



### కృష్ణా నది :

మహబూబ్ నగర్‌లో ప్రవేశిస్తున్న ఈ నది 69% పరీవాహక ప్రాంతాన్ని తెలంగాణలోనే కలిగివున్నది. కేవలం 13% పరీవాహక ప్రాంతం కలిగివున్న కోస్తాంధ్రకు 65% నీటిని వినియోగిస్తుండగా, 18% పరీవాహక ప్రాంతం కలిగివున్న రాయలసీమకు 20% నీటిని వినియోగిస్తున్నారు. తెలంగాణ నీటివాటా తేల్చకుండా మొత్తం నీటిని కొల్లగొట్టే పథకాలు సిద్ధం చేస్తున్నారు.

1930లో ప్రాణం పోసుకున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ముందే 1952లో నిజాం నవాబు శ్రీకారం చుట్టగా, ఉమ్మడి ప్రాజెక్టుగా నిర్మించడానికి మదరాసు రాష్ట్రం వ్యతిరేకించిన ఫలితంగానే ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్రం కొరకు ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతో ఆంధ్రుల కుయుక్తుల కారణంగా ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రాంతానికి గొడ్డుటావులా మారిపోయింది. నల్గొండ జిల్లాలో నిర్మించిన ఈ ప్రాజెక్టు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు కుడి ఎడమ కాల్వల ద్వారా సమాన నీటిని అందించే ఒప్పందంతో ప్రారంభమైంది. కానీ నేడు కుడి కాలువ ద్వారా ఆంధ్ర ప్రాంతానికి 20 లక్షల ఎకరాలకు పైగా సాగునీరందుతుండగా, ఎడమ కాల్వ ద్వారా



తెలంగాణ ప్రాంతానికి కేవలం 5 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందుతున్నది. ఈ 5 లక్షల ఎకరాలలో కూడా నిబంధనలకు వ్యతిరేకంగా వలస వాదులు చేజిక్కించుకున్న భూములు కలిసే వున్నాయి. ఎడమ కాలువ ద్వారా నల్గొండ, ఖమ్మం జిల్లాలకు అందాల్సిన నీటిని మాత్రం పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేకుండా కె.ఎల్.రావు కుయుక్తులతో తెలంగాణ నీటిని కృష్ణా జిల్లాకు తరలించడం జరిగింది. గుంటూరులో సాగవుతున్న పొలాలు, మొత్తం తెలంగాణలో సాగవుతున్న పొలాలకంటే ఎక్కువ. ప్రాజెక్టులో ముంపుకు గురైంది తెలంగాణ ప్రాంతం. ప్రాజెక్టు నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలు తెలంగాణ వాసులు. ప్రాజెక్టు నిర్మాణమైంది తెలంగాణాలోనే. అయినా ఈ ప్రాజెక్టు తెలంగాణ వాసులకు మొండిచెయ్యిని చూపిస్తూ ముందుకు వెళ్ళింది. ఫలితంగా లక్షలాదిమంది తెలంగాణా ప్రజలు నిరాశ్రయులైనారు. గ్రామాలకు గ్రామాలే వలస వెళ్ళాల్సి వచ్చింది. తట్ట, పార గురించి తెలిసినంతగా పలకా, బలపాల గురించి తెలియని పాలమూరు లేబర్ రాత్రింబవళ్ళు కష్టించి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేశారు. ఇంతకష్టాపడ్డా పాలమూరుకు దక్కిందేమీ లేదు.

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణకు చెందిన 117 గ్రామాలు ముంపుకు గురైనాయి. రెండున్నర లక్షల మంది నిరాశ్రయులైనారు. ఇక్కడి కుడి కాలువ రాయలసీమకు కొంతవరకు



ఉపయోగపడిందేకాని, ఎడమ కాలువ తెలంగాణకు మాత్రం చుక్క నీటిని కూడా అందించలేక పోయింది.

1948లో నిజాం నవాబు ప్రారంభించిన తుంగభద్ర ప్రాజెక్టు నుండి మహబూబ్ నగర్‌కు 20 టిఎంసిల నీటిని ఇవ్వాల్సి వుండగా, 1956 తరువాత మాత్రం మహబూబ్‌నగర్ సరిహద్దువరకు త్రవ్విన కాలువ అక్కడే ఆగిపోయింది.

రాజోలిబండ డైవర్షన్‌లో చట్టపరంగా, న్యాయబద్ధంగా మహబూబ్‌నగర్ ప్రాంతానికి రావాల్సిన నీటిని రాయలసీమ నాయకులు జబర్దస్తీగా తూములు పగులగొట్టి, గేట్లు లేపి నీళ్ళు మళ్ళించుకున్నా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళ్ళు మూసుకొని చోద్యం చూస్తున్నది.

బచావత్ ట్రిబ్యునల్‌లో జూరాల ప్రాజెక్టుకు 17 టి.ఎం.సీల నీటిని కేటాయించినా, 30 సంవత్సరాలు గడిచిపోయినా ఈ ప్రాజెక్టుకు మోక్షం కలుగలేదు. ప్రాజెక్టును కుదించి 10 టి.ఎం.సీ.లకు పరిమితం చేసి చివరకు ప్రాజెక్టును నిర్మించినప్పటికి కాలువల పనులు పూర్తి కాలేదు. పూర్తిస్థాయిలో నీరు నింపుకునేందుకు కర్నాటక ముంపు గ్రామాలకు చెల్లించాల్సిన 30 కోట్లు చెల్లించక పాలమూరు పొలాలను ఇప్పటికీ ఎండబెడుతూనే ఉన్నారు.

## గోదావరి నది :

గోదావరి నది యొక్క 79% పరీవాహక ప్రాంతం తెలంగాణలో వుండగా, 21% పరీవాహక ప్రాంతం మాత్రమే కోస్తా ఆంధ్రలో వుంది. కాని ఈ నది తెలంగాణా ప్రాంతానికి 10% నీటిని కూడా అందించలేకపోయింది.

35 సంవత్సరాల క్రితం ప్రారంభమైన పోచంపాడు ప్రాజెక్టు పాలకుల వివక్షవల్ల నేటికి కూడా పూర్తి కాలేకపోయింది. కాని 13 సంవత్సరాల క్రింద మొదలుపెట్టిన తెలుగు గంగ ప్రాజెక్టు ఆగమేఘాలతో పూర్తయింది. ఎన్నడో మొదలు పెట్టిన పోచంపాడు ఇంకా పూర్తి కాలేదా? అనే అనుమానం ప్రజలకు వస్తుందనుకున్నారో ఏమో! దీనికి మధ్యలోనే శ్రీరాంసాగర్‌గా నామకరణం చేశారు.

నిజాంకాలంలోనే ప్రారంభమైన నిజాంసాగర్ ప్రాజెక్టు క్రింద ఉన్న భూములను వలసవాదులు పెద్దఎత్తున చేజిక్కించుకున్నారు. తద్వారా ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజలకన్న ఆంధ్రులకే అధికంగా ప్రయోజనం చేకూర్చడం దురదృష్టం.

మంజీరా నదిపై నిర్మించిన సింగూరు ప్రాజెక్టు ఉమ్మడి ఆస్తిగా చెప్పుకునే రాజధాని నగర ప్రజలకు త్రాగునీరందించడానికే



పరిమితం చేశారు. ఈ ప్రాజెక్టు క్రింద ఒక్క ఎకరానికి కూడా సాగునీరందించకపోగా, కనీసం ప్రాజెక్టు చుట్టుపక్కల ఉన్న మెదక్ జిల్లాలోని గ్రామాల ప్రజలకు మంచినీటిని కూడా అందించడం లేదు. ఇలా వుండగా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఖర్చు చేసిన 250 కోట్ల నిధులను తెలంగాణ వాటాగా చూపించారు.

తెలంగాణ నీటివనరులు తెలంగాణ అవసరాలను తీర్చకుండా ఇతరుల అవసరాలను తీర్చడం ఏ న్యాయసూత్రాలు అంగీకరించవు. మన జలాలను ఆంధ్రప్రాంతానికి మళ్ళించడంలో కృషిచేసిన కె.ఎల్.రావును అపర భగీరధుడుగా వర్ణిస్తుంటే మనం తలలూపడంలో అర్థమే లేదు. ఏనాటినుండో ఉన్న చెరువులన్నీ ఎందుకు మాయమయ్యాయో మనం నిలదీయాలి.

## ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి జలయజ్ఞం :

*(విద్యాసాగర్ రావుగారి నీళ్ళు-నిజాలు పుస్తకంలోని భాగం)*

ప్రభుత్వం తలపెట్టిన జలయజ్ఞం పూర్తయితే తెలంగాణలో మొత్తం 39 లక్షల 83 వేల ఎకరాలకు సాగునీరందే అవకాశం ఉంటుంది. ఆంధ్రప్రాంతంలో 107 లక్షల 20 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. తెలంగాణలో సాగునీరందే భూమిలో 15 లక్షల



73 వేల ఎకరాలకు నీరు లిఫ్ట్ మార్గంగా అందవలసి ఉంటుంది. అదనంగా తెలంగాణలో 1 లక్ష 4 వేల ఎకరాలు స్థిరీకరింపబడితే ఆంధ్రలో 20 లక్షలు 33 వేల ఎకరాలు స్థిరీకరింపబడతాయి.

ఆంధ్రప్రదేశ్ అవతరణ నాటికి తెలంగాణా ఆంధ్ర ప్రాంతాలలో సాగునీరందే భూమి నిష్పత్తి 1:1.7 (చిన్న తరహా ప్రాజెక్టుల ద్వారా సాగయ్యే భూమి 18 లక్షల ఎకరాలుగా భావిస్తే ఈ నిష్పత్తి 1:1.3) కాగా 2004 నాటికి ఆ నిష్పత్తి 1:3.8 అయింది. జలయజ్ఞం తదనంతరం ఆ నిష్పత్తి 1:2.7 అవుతుంది. అంటే ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా తెలంగాణ మిగతా ప్రాంత అభివృద్ధి స్థాయికి చేరుకోలేకపోవటమటుంచి కనీసం ఆంధ్రప్రదేశ్ ఏర్పడక పూర్వమున్న స్థితిలో కూడా లేకపోవడం అత్యంత దురదృష్టకరం. ఇంక ఏదో పగలదీస్తాం, తెలంగాణను అభివృద్ధి చేస్తాం అని ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతుంటే ఎలా నమ్మడం?

ఇక ప్రాజెక్టుల వివరాలలోకి వెడితే జలయజ్ఞం కార్యక్రమంలో రెండు సంవత్సరాలలో పూర్తి చేయతలబెట్టిన ప్రాజెక్టుల కోవ ఒకటయితే అయిదేళ్లలో పూర్తి చేయబూనిన ప్రాజెక్టు శ్రేణి రెండవది. ఈ రెండు కేటగిరీలు కాక మరికొన్ని ప్రత్యేక ప్రాజక్టులను



కూడా ప్రభుత్వం చేపట్టింది. రెండేళ్ళలో పూర్తిచేయదలచిన మొత్తం ఎనిమిది ప్రాజెక్టులలో తెలంగాణకు చెందిన మూడు ప్రాజెక్టులు దేవాదుల (మొదటి ఫేజ్), అలీసాగర్, గుత్ప - ఈ మూడు ఎత్తిపోతల పథకాలే. ఆంధ్ర ప్రాంతంలో వంశధార రెండవదశ-మొదటి ఫేజ్, తాటిపూడి, పుష్కరం, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు మొత్తం అయిదింటిని చేపట్టారు. ఈ అయిదింటిలో తాటిపూడి, పుష్కరం మినహాయిస్తే మిగిలినవి గ్రావిటీ ప్రాజెక్టులు. ఈ కేటగిరీలో తెలంగాణపై 1185 కోట్లు ఖర్చు పెడతారు. 1 లక్ష 23 వేల ఎకరాల క్రొత్త ఆయకట్టుకు నీరందుతుంది. అదనంగా 93 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరింపబడుతుంది. ఆంధ్రప్రాజెక్టులపైన 4592 కోట్లు ఖర్చవుతాయి. 11 లక్షల 25 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది.

ఇక అయిదేళ్ల ప్రాజెక్టుల విషయానికి వస్తే తెలంగాణలో ఆరు ప్రాజెక్టులను అంటే ఎలిమినేటి మాధవరెడ్డి, శ్రీరాంసాగర్ ద్వితీయదశ, శ్రీరాంసాగర్ వరదకాలువ, భీమా, కల్వకుర్తి, నెట్టంపాడులను చేపట్టారు. శ్రీరాంసాగర్ వరదకాలువ, ద్వితీయదశ

తప్ప మిగిలిన నాలుగు ఎత్తిపోతల పథకాలే. ఆంధ్రప్రాంతంలో పన్నెండు ప్రాజెక్టులు తోటపల్లి, ఝంఝావతి, పులిచింతల, గుండ్లకమ్మ, రామతీర్థం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, గురురాఘవేంద్ర, కె.సి.కాలువ ఆధునీకరణ, గాలేరు నగరి, పెన్న అహోబిలం ద్వితీయదశ, హంద్రీ–నీవా, చిత్రావతి నది బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, వెలిగొండ. ఈ కేటగిరిలో తెలంగాణలో 9 వేల 536 కోట్ల రూపాయలు వెచ్చించి 15 లక్షల 83 వేల ఎకరాలు సాగుకి తీసుకువస్తే ఆంధ్రలో 12 వేల 439 కోట్ల రూపాయల ఖర్చుతో 18 లక్షల 13 వేల కొత్త ఆయకట్టుకు నీరందించడమే కాక మరో 14 లక్షల 31 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తారు.

ఇక ప్రత్యేక ప్రాజెక్టు కేటగిరీలో చేపడుతున్న పోలవరంపై 7981 కోట్లు ఖర్చు అని ప్రభుత్వం చెబుతున్నా ముంపుకు గురయ్యే బాధితుల పునరావాస, సహాయ కార్యక్రమాలు, ముంపుకు గురయ్యే భూముల నష్టపరిహారం మొదలైనవి తీసుకుంటే మరో 5 వేల కోట్లు ఎలాగూ అవుతుందని నిపుణుల అంచనా. ఈ ప్రాజెక్టు మూలంగా 7 లక్షల 20 వేల ఎకరాలు సాగుకు వస్తాయని చెబుతున్నారు. కాని 23 లక్షల 21 వేల ఎకరాల ఆయకట్టు కోసం భారీ సైజు కాలువలు



తవ్వుతున్నారు. తెలంగాణలో దుమ్ముగూడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులు చేపట్టి 3876 కోట్లు ఖర్చుపెట్టి 3 లక్షల 39 వేల ఎకరాలకు సాగునీరందిస్తామని ప్రభుత్వ గణాంకాలు వెలడిస్తున్నాయి. అంటే మొత్తం జలయజ్ఞంలో తెలంగాణలో రూపాయలు (14597) 14 వేల 597 కోట్లు ఖర్చుపెడితే ఆంధ్రప్రాంతానికి 25,012 కోట్లు ఖర్చుపెడుతున్నారు. (పోలవరం అదనపు ఖర్చు పరిగణనలోకి తీసుకోలేదు.) అంటే తెలంగాణపై ఖర్చు 35 శాతం ఆంధ్రపై 65 శాతం అని గణాంకాలు స్పష్టంగా చెబుతుంటే తెలంగాణకు 50 శాతంపైగా పెట్టుబడి పెడుతున్నామని చెప్పడం విడ్డూరమే కాదు పచ్చి అబద్ధం అని అర్థమవుతుంది. అబద్ధాలని పదేపదే ప్రచారం చేయడం ద్వారా వాటికి చెల్లుబాటు కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమైనట్లు కానవస్తోంది. ముఖ్యమంత్రి చండీఘడ్‌లో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో తమ పార్టీ అధ్యక్షురాలికి తెలంగాణలో అధికశాతం (50 శాతం కంటే ఎక్కువ) నిధులను సమకూర్చామని చెప్పడం ఇందుకు నిదర్శనం. 6–10–2005 నాడు ముఖ్యమంత్రి పత్రికా విలేఖర్ల సమావేశంలో గత సంవత్సరం నీటిపారుదల రంగంలో కోస్తాకు 22 శాతం, రాయలసీమకు 21 శాతం,



తెలంగాణకు 57 శాతం నిధులు ఖర్చు చేసామని చెబుతూనే ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే తెలంగాణాకు 51 శాతం, సీమకు 21 శాతం, కోస్తాకు 28 శాతం నిధులు వెచ్చించామని చెప్పారు. ముఖ్యమంత్రి చెప్పిన అంకెలను బట్టి నిరుడు తెలంగాణలో 1893 కోట్లు ఈ సంవత్సరం 6 నెలలలో 1052 కోట్లు అంటే మొత్తం 2945 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. కోస్తా, సీమలకు కలిపి ఇదే వ్యవధిలో కేవలం 2536 కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. ఇదే విషయాన్ని పునరుద్ఘాటిస్తూ కొందరు మంత్రివర్యులు పత్రికా విలేఖర్ల సమావేశంలో తెలంగాణకు గత 20 నెలలో 2990 కోట్లు ఖర్చు చేసామని, ఆంధ్ర ప్రాంతానికి 2400 కోట్లు ఖర్చు చేసామని వివరించారు. అయితే ప్రతిపక్షాలు తెలంగాణలో పెట్టినట్లు చెబుతున్న భారీ మొత్తం 2990 కోట్ల వివరాలు అడగగా పొన్నాల లక్ష్మయ్య గత పద్దెనిమిది నెలల్లో జలయజ్ఞంలో భారీ ప్రాజెక్టులపైన కేవలం 1140 కోట్లు ఖర్చు పెట్టామని ఒప్పుకున్నారు. మిగతా 1850 కోట్ల రూపాయల సంగతేమిటి? దీనికి ప్రభుత్వం దగ్గర జవాబేమైనా ఉందా? ఇలా తప్పుడు ప్రచారం చేయడంలో ప్రభుత్వ ఉద్దేశ్యం తెలంగాణ ప్రజలను ప్రతినిధులను మభ్యపెట్టడం తప్ప మరొకటి కనిపించదు.



గత తొమ్మిది సంవత్సరాలలో తెలుగుదేశం 177 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టిందని ఆ లెక్కన చూస్తే తమ ఘనతను మెచ్చుకోవాలని ప్రభుత్వం తపన. అది నిజమే కావచ్చు గాని తెలంగాణలో 50 శాతంకన్నా ఎక్కువ నిధుల ఖర్చు చేస్తున్నామని 'డోలు' వాయించడం వెనక ఏదో వ్యూహం, మోటుగా చెప్పాలంటే కుట్ర కానవస్తోంది.

ఇంతేగాక తెలంగాణపట్ల ప్రభుత్వం చూపుతున్న దారుణ వివక్షకు ఇంకా అనేక ఉదాహరణలను పేర్కొనవచ్చు.

★ అన్ని అనుమతులు ఉన్న శ్రీరాంసాగర్ ద్వితీయ దశ, శ్రీరాంసాగర్ వరదకాలువ పనులను అయిదేళ్ల కేటగిరీలోకి త్రోసి అనుమతులు లేని తెలుగుగంగను రెండేళ్ళలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టుల జాబితాలోకి చేర్చడంలో అంతరార్థం ఏమిటి? వివక్ష కాదా?

★ ఇచ్చంపల్లి, పోలవరం ప్రాజెక్టులు రెండు కూడా ఎంతోకాలంగా ఒకే గాటన కట్టివేయబడ్డాయి. రెండింటికీ కేంద్ర మంత్రిత్వ శాఖల అనుమతులు లేవు. పొరుగు రాష్ట్రాలు అభ్యంతరాలు లేవనెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇచ్చంపల్లిని గాలికొదిలేసి ఆగమేఘాలపైన పోలవరం ప్రాజెక్టును

చేపట్టడానికి కారణం ఒక్కటే – వివక్ష.

★ తెలంగాణలో ఇచ్చంపల్లి, లోయర్ పెన్‌గంగ, లెండి, అదిలాబాద్‌లోని అనేక మధ్యతరహా ప్రాజెక్టులు గ్రావిటీ మార్గాన నీరందిస్తాయి. ప్రభుత్వం వీటిపై ఏమాత్రం దృష్టి సారించలేదు. ఎన్నో ఏళ్ళుగా నల్లగొండవాసుల కోరిక ఎస్.ఎల్.బి.సీ. సొరంగం – ఈ పనిని వేగిరపరచకుండా వీటిని జలయజ్ఞంలోని ఏ లిస్టులోనూ చేర్చకుండా వెలిగొండ సొరంగాన్ని చేర్చడంలో ఉద్దేశ్యమొక్కటే – వివక్ష.

★ తెలంగాణ ప్రాజెక్టుల్లో అధికశాతం ఎత్తిపోతల పథకాలే. వాటి అమలుకు రెండువేల మెగావాట్ల విద్యుత్తు అవసరం. సమాంతరంగా విద్యుత్తు ప్రాజెక్టులను ప్రారంభించకుండా సాగునీటి ఎత్తిపోతల పథకాలు పూర్తిచేస్తే వాటి గతేమవుతుంది?

ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచన చేసినట్టు లేదు. కారణం వివక్ష. ఎలాంటి అనుమతులు, నీటి కేటాయింపులు లేని అనేక ప్రాజెక్టులు హంద్రీ-నీవా, గాలేరు నగరి, తెలుగు గంగ, వెలిగొండ



వంటివి పూర్తి చేయడానికి రాష్ట్ర బడ్జెటును ఉపయోగిస్తూ, తెలంగాణ ప్రాజెక్టులైన ఇచ్చంపల్లి, దుమ్ముగూడెం, ప్రాణహిత-చేవెళ్ల, శ్రీరాంసాగర్ వరదకాలువ, దేవాదుల మూడోదశ – వీటిని జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించి వీటికి 25 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరడం తెలంగాణ పట్ల ప్రేమా? వివక్షా? ఇది కేవలం ఆంధ్ర ప్రాజెక్టులను రాష్ట్ర బడ్జెట్‌లో పూర్తిచేసి తెలంగాణ ప్రాజెక్టుల భారాన్ని కేంద్రంపై నెట్టి చేతులు దులుపుకునే బాధ్యతారాహిత్యమైన చర్యకు పూనుకోవడం తప్ప మరొకటి కాదు.

కోస్తాకు లాభించే పోలవరం ప్రాజెక్టు జి.ఓ. 96 ను ఇంజనీర్ ఇన్ చీఫ్ 24-08-2004 నాడు పంపిన ప్రతిపాదనను ఆమోదిస్తూ 10-09-2004 నాడు అంటే 17 రోజుల్లోనే విడుదల చేయడం జరుగుతుంది. ఉన్నఫళంగా 7 లక్షల 20 వేల ఎకరాల ఆయకట్టును 23 లక్షల 21 వేల ఎకరాలకు పెంచినా ఎలాంటి అభ్యంతరం ఉండదు. ఇదే విధంగా సీమకు లాభించే పోతిరెడ్డిపాడు జి.ఓ 170ని సంబంధిత చీఫ్ ఇంజనీర్ కడపనుండి 20-08-



2005 న పంపిన ప్రతిపాదనను ఆమోదిస్తూ మూడు వారాల్లోనే అంటే 13-09-2005న విడుదల చేస్తారు. ఇందులో 7 లక్షల 63 వేల ఎకరాలకు నిక్కచ్చిగా నీటి సరఫరా చేస్తాం అని హామీ ఇస్తారు. కృష్ణా జలాలపై ఎలాంటి హక్కు లేకున్నా ఎవరూ అభ్యంతరం తెలియజేయరు. ఇక తెలంగాణకు లాభించే ప్రాణహిత-చేవెళ్ల స్కీంకు ముఖ్యమంత్రి హామీలను కూడా ప్రక్కనబెట్టి అనేక అవాంతరాలు కల్పిస్తారు. 160 టి.ఎం.సి.లకు బదులుగా 50 టి.ఎం.సి.లకు అనుమతి ఇస్తూ ఇది ప్రక్క రాష్ట్రాల అభ్యంతరాల గురించి పరిశీలించమని చెబుతూ 3 నెలల తరువాత జి.ఓ. 557 ను విడుదల చేస్తారు. అన్యాయమని అన్ని పార్టీలు గొడవపెడితే జి.ఓ. 623 నెలరోజుల తర్వాత ఇచ్చి సవరిస్తారు. ఇంతాచేస్తే ఇది 'ఇన్వెస్టిగేషన్' కోసం ఇచ్చిన ఉత్తరువే. మిగిలిన ప్రాజెక్టుల మాదిరిగా 'నిర్మాణం' కోసం కాదే. ఆ ఇన్వెస్టిగేషన్ పనులు కూడా ఇంతవరకు అంటే జి.ఓ. ఇచ్చి నాలుగు నెలలైనా ప్రారంభం కాలేదు. ఆహా! సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు ఎంత న్యాయం జరుగుతుందో ఒక్కసారి ఆలోచించండి?



## 5. వ్యవసాయం :

సాగునీరు అందకుండా చేసి తెలంగాణ వ్యసాయాన్ని పాలకులు నాశనం చేశారు. కుంటలు, చెరువులకు మరమత్తులు చేయకుండా మాగాణి భూములు మెట్ట భూములుగా మారేందుకు కృషి చేశారు. తెలంగాణాలో మాగాణి పంట పెరిగిందని ప్రభుత్వం లెక్కలు చెబుతున్నది. కాని ఈ పెరుగుదలకు బోరుబావులే కారణమన్న రహస్యాన్ని విప్పి చెప్పడంలేదు. ప్రాజెక్టుల ముంపుకు లక్షలాది ఎకరాల తెలంగాణ భూములు నష్టపోయాయి. ముంపుకు గురికాని భూములలో అత్యధిక శాతం ఆంధ్రుల వశమైపోయాయి. ఒక్క సింగరేణి కంపెనీవల్లనే తెలంగాణ ఆరు లక్షల ఎకరాల వ్యవసాయ భూమిని కోల్పోయింది. రియల్ ఎస్టేట్, ఫాంహౌజ్‌ల క్రింద ఇప్పటికే మూడు లక్షల ఎకరాలకు పైగా నష్టపోయాం. ఆంధ్ర ప్రాంతంతో పోల్చినట్లయితే తెలంగాణలో నీటి వసతికిగాని, విద్యుత్ సబ్సిడీకి గాని చేసిన ఖర్చు చాలా తక్కువ. ఈ ఒక్క విషయంలోనే గత 45 ఏళ్ళలో తెలంగాణాకు లక్షలాది కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందట.

మన రైతుల ఆత్మహత్యలు ప్రపంచాన్ని కదిలించినా, మన

పాలకులను కదిలించలేకపోయాయి. పురుగుమందులు రైతుల ప్రాణాలను తీయడానికే ఉపయోగపడుతున్నాయి. శాశ్వతమైన చర్యలు చేపట్టనందున ఆత్మహత్యల చరిత్ర ఇక్కడి రైతుల జీవనంలో భాగమైపోయింది.

తెలంగాణా ప్రాంతంలోని భూములను ఆంధ్రులు కొనుగోలుచేయరాదనే నిబంధనను అతిక్రమించి సారవంతమైన, నీటివనరులున్న భూములను ఆంధ్రులు తమ వశంచేసుకోవడం మరింత తీవ్రతరం చేస్తున్నారు. తుఫానులో కొబ్బరిచెట్లు కూలిపోయినప్పుడు కోస్తా రైతులకు సహాయమందించడంలో ఏమరపాటు చేయలేదుకాని, ఇక్కడి రైతుల ఆత్మహత్యల విషయంలో మీనమేషాలు లెక్కించారు. మన ప్రాంతంలో ఆల్‌కబీర్ పశువధశాలలను స్థాపించి మన పశుసంపదనంతా హరించుకుపోయేలా చేశారు.

అత్యధిక సాగుభూమి తెలంగాణాలోనే ఉంది. నదులన్నీ ఇక్కడినుండే ప్రవహిస్తున్నాయి. అయినా తెలంగాణలోనే వ్యవసాయం వెనుకబడిపోవడానికి ప్రధాన కారణం పాలకుల వివక్షనే.



తెలంగాణలో సాగునీటి సౌకర్యం గల భూమిలో సుమారు 63 శాతం బోర్లు, బావుల క్రిందనే ఉన్నది. 16 లక్షల విద్యుత్ పంపుసెట్ల ద్వారా సుమారు 25లక్షల ఎకరాల్లో తెలంగాణ రైతాంగం పంటలు పండిస్తున్నారు. ఇతర ప్రాంతాల రైతులకు తన ఖర్చుతో ప్రాజెక్టులు నిర్మించి సాగునీరు అందిస్తున్న ప్రభుత్వం సొంత ఖర్చుతో సాగునీరు సౌకర్యం కల్పించుకున్న తెలంగాణ రైతాంగానికి తగినంత విద్యుత్ సరఫరా చేయడం లేదు. ప్రభుత్వ అసమర్థత వల్ల రోజుకు మూడు, నాలుగు గంటలకు మించి వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయలేని పరిస్థితి. అధికారంలోకి రావడానికి ఉచిత కరెంటు ఇస్తామని, ఆచరణలో విఫలమైంది. సమైక్యరాష్ట్రంలో ఉన్నందుకే తెలంగాణ రైతాంగానికి ఈ దీనస్థితి దాపురించిందని చెప్పడానికి విద్యుదుత్పాదన - వినియోగం అనే ఒక్క అంశం చాలు. కావలసినంత బొగ్గు ఉన్నా రామగుండం, కొత్తగూడెంలలో 3850 మెగావాట్ల విద్యుదుత్పాదన (రాష్ట్ర ఉత్పత్తిలో మూడింట రెండు వంతులు) జరుగుతున్నా, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులలో తెలంగాణ వాటా సుమారు 1360 మెగావాట్లు ఉన్నా తెలంగాణ రైతాంగానికి కరెంటును ఇవ్వడం లేదు. ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు



మళ్ళిస్తున్నారు. రామగుండంలో ఉత్పత్తి అవుతున్న 2600 మెగావాట్ల కరెంటుతోనే తెలంగాణ అవసరాలన్నీ తీర్చవచ్చు. కానీ ఎన్‌టిపిసి ఆధీనంలో రామగుండం థర్మల్ పవర్ స్టేషన్లు ఉండడం వల్ల రాష్ట్ర వాటాగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్తులో కేవలం 27 శాతం (600 మెగావాట్లు) మాత్రమే లభిస్తున్నది. కొత్తగూడెంలో 1250 మెగావాట్లు ఉత్పత్తి అవుతున్నా ఇతర ప్రాంతాలకు మళ్ళిస్తున్నారు.

## 6. పరిశ్రమలు :

పరిశ్రమలు ఆంధ్రులకు దేవాలయాలే కావచ్చు. కానీ తెలంగాణా వారికి మాత్రం ఇవే పరిశ్రమలు వైద్యానికి లొంగని రాచపుండులా పరిణమించాయి. తెలంగాణ ప్రాంతంలో ఇబ్బడి ముబ్బడిగా పరిశ్రమలు స్థాపించడంతో వాతావరణ కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. మరోవైపు సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ముందు జీవనోపాధిని కల్పించిన పరిశ్రమలన్నీ మూతపడ్డాయి. కొత్తగా వస్తున్న పరిశ్రమలలో తెలంగాణా వాసులకు ఉపాధి లభించడం లేదు.

విలీనానికి ముందు తెలంగాణ ప్రజలకు కల్పతరువుల్లా ఉపయోగపడ్డ 'ఆజంజాహి మిల్స్, ఉస్మానియా కెమికల్స్, నిజాం



షుగర్స్, తాజ్ గ్లాస్ ప్యాక్టరీ, ప్రాగాటూల్స్, సిరిపూర్ పేపర్ మిల్స్, సింగరేణి కాలరీస్, హైదరాబాద్ ఆస్‌బెస్టాస్' లాంటి ప్రముఖ పరిశ్రమలు మూసివేతకు గురైనాయి. నిజాం కాలంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ ల్యాబ్‌ను ఆర్.ఆర్. ల్యాబ్‌గా మార్చేసి ఆంధ్రులతో నింపేశారు, 1956కు ముందున్న పరిశ్రమలన్నింటిలో తెలంగాణ వాసులే ఉద్యోగులు కాగా, నేడు అవి ఆంధ్రులకే స్థావరాలైనాయి. పరిశ్రమలన్నీ తెలంగాణలోనే వుండగా నిరుద్యోగులు కూడా ఇక్కడే అధికంగా ఎందుకున్నారో, ఈ ప్రాంతమే ఎందుకు అభివృద్ధి చెందడంలేదో నిలదీయాల్సిన సమయమాసన్నమైంది. ఆనాడు రైస్ మిల్లులు తప్ప మరే పరిశ్రమలు లేని ఆంధ్ర ప్రాంతం వారు నేడు పారిశ్రామికంగా ముందంజలో ఎందుకున్నారో గమనించాలి. ఆంధ్రులు పరిశ్రమలను ఏర్పాటు చేసుకునే సౌలభ్యం కొరకే స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్‌లను ప్రభుత్వం సృష్టించినట్లు అవి అందించిన రుణాలను, పొందిన వ్యక్తులను పరిశీలించినప్పుడు అర్థమవుతున్నది. ఇటీవల ప్రకటించిన ప్రత్యేక ఆర్థిక జోన్‌ల విషయంలో కూడా అన్ని ఆంధ్రా జిల్లాలే ఎంపిక కాబడ్డాయి.

పరిశ్రమల స్థాపనకు తెలంగాణా వ్యవసాయ భూములను, నీటిని, తక్కువ ధరకే విద్యుత్తును ప్రభుత్వాలు అందించాయి. పైగా రోడ్డు సౌకర్యాలు, ఫోను సౌకర్యాలు కలుగజేశాయి. పెట్టుబడులమీద 20% వరకు సబ్సిడీలను అనుమతించారు. సేల్స్ టాక్స్‌లో మినహాయింపునిచ్చారు. ఇంతా చేస్తే ఏ కులంవారి పరిశ్రమలలో ఆ కులంవారే ఉద్యోగులు, ఏ ప్రాంతంవారి పరిశ్రమలలో ఆ ప్రాంతంవారే ఉద్యోగులు. రెడ్డి ల్యాబ్స్‌లో ఆంధ్ర ప్రాంతానికి చెందిన రెడ్లకే అధిక ఉద్యోగాలు లభించగా, సిరీస్ కంపెనీలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన రాజులకు ఉద్యోగాలు లభించాయి. అలాగే కమ్మ కులం వారి కంపనీలలో ఆ కులస్తులే ఉద్యోగాలను పొందగలిగారు. వీటన్నిటివల్ల పారిశ్రామికంగా తెలంగాణ అభివృద్ధి చెందుతున్నా ఉద్యోగ వసతి మాత్రం లభించడం లేదు. ఆంధ్రుల పరిశ్రమలన్నీ హైదరాబాద్ చుట్టూ ఉన్న రంగారెడ్డి జిల్లాకే పరిమితమవుతుండగా కోస్తాంధ్ర జిల్లాలలో కొత్తకొత్త పరిశ్రమలు పుట్టుకొస్తున్నాయి. తెలంగాణ ఇతర జిల్లాలలో ఉన్న పరిశ్రమలు కూడా ఊడిపోవడమే బాధాకరమైన విషయం.



పరిశ్రమలను స్థాపించేంతవరకు తెలంగాణ వాసులను భవన నిర్మాణ కూలీలుగా పనిచేయించిన ఆంధ్ర పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు ప్రారంభించిన రోజునుండి తెలంగాణ వాసులను గేటుదాటి లోపలకు రానీయటం లేదు. విదేశాలకు ఎగుమతి చేయబడుతున్న గ్రానైట్ కంపెనీలకు ముడిసరుకంతా తెలంగాణ ప్రాంతానిదే కాగా, పరిశ్రమల యజమానులు, ఉద్యోగులు మాత్రం తెలంగాణేతరులే. తెలంగాణలోని మొత్తం ప్రైవేటు పరిశ్రమలలో 23% మాత్రమే తెలంగాణ ఉద్యోగులున్నారు. ఇదే సమయంలో ఆంధ్రలోని పరిశ్రమలలో తెలంగాణ ఉద్యోగులే లేకపోవడం గమనార్హం.

| పరిశ్రమల రాయితీలు | ఆంధ్ర | రాయలసీమ | తెలంగాణ |
|---|---|---|---|
| విద్యుచ్ఛక్తి | 60% | 7.5% | 12.5% |
| వ్యవసాయ పరిశ్రమలు | 54 | 23 | 23 |
| జాతీయ బ్యాంకుల రుణాలు | 54 | 16 | 30 |
| పరిశ్రమలు | 6000 | 750 | 1250 |
| కార్మికులు లక్షల్లో | 2.56 | 0.30 | 0.95 |
| పరిశ్రమలలో దినసరి కూలీలు లక్షల్లో | 3.16 | 0.70 | 0.81 |



## 7. గృహ నిర్మాణం :

రాజధాని నగరంలో విచ్చల విడిగా ఎన్‌క్లేవ్‌లు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు పుట్టుకొస్తున్నాయి. హైటెక్ సిటీ, మెగాసిటీ పేర్లతో పురాతన సంస్కృతి మాయమౌతున్నది. సగటున తెలంగాణ వాసుల ఇళ్ళ స్థలాలకన్నా నాలుగు రెట్ల వైశాల్యంతో ఆంధ్రుల మేడలు పెరుగుతున్నాయి. **ఫలితంగా లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములు వలసవాదుల గృహ నిర్మాణానికే వినియోగింపబడుతున్నాయి.** హైదరాబాద్ జిల్లా నూరుశాతం గృహ నిర్మాణానికే వినియోగింపబడగా, రంగారెడ్డి జిల్లాలో సగం భూములు వ్యవసాయం నుండి దారి మళ్ళాయి. నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, మెదక్ జిల్లాలు కూడా వలసవాదుల అడ్డాలకు వ్యవసాయ భూములను అర్పిస్తున్నాయి. జనాభా లెక్కల్లో కాకుండా ఇళ్ళ స్థలాల ఆధీనాన్ని బట్టి చెప్పాలంటే హైదరాబాద్‌లో 60% ఆంధ్రులదే అని చెప్పాల్సిన పరిస్థితి ఎదురైంది. గృహ నిర్మాణ రంగం వేగం పుంజుకున్నదని చెప్పడం కన్నా తెలంగాణేతరుల గృహాలు శరవేగంతో పెరుగుతున్నాయని చెప్పడం వాస్తవికతకు దగ్గరగా వుంటుంది. తెలంగాణేతరుల గృహ నిర్మాణాలకు ఇళ్ళ స్థలాల పేరున, ఇటుకలు



తయారు చేసే నెపంతో వ్యవసాయ భూములు తగ్గుతుండగా, **ఇసుక తరలింపుతో భూగర్భజలాల మట్టం తగ్గిపోయి వ్యవసాయం దెబ్బతింటున్నది.** రాజధాని నగరం చుట్టూ వందకిలోమీటర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారుల వశమైపోయింది.

రాజధాని నగరంలో అన్ని ప్రాంతాల వారు ఉన్నప్పటికీ ఆంధ్ర - తెలంగాణ వాసులు మాత్రం గిర్ర గీసినట్లుగా ఎవరికి వారే విడిపోయినట్టుగా ఉన్నారే కాని, కలిసి ఉన్నట్లు లేదు. పెరిగిన నగరం పాతబస్తీ, కొత్త బస్తీలుగా విడిపోగా, కొత్తబస్తీలో ఆంధ్ర - తెలంగాణాలుగా విడదీసినట్లు కాలనీలు తెలియజేస్తున్నాయి. జూబ్లీ హిల్స్, బంజారా హిల్స్, సంజీవరెడ్డి నగర్, వెంగళరావు నగర్, కూకట్ పల్లి, వనస్థలిపురం లాంటివి ఆంధ్రుల స్థావరాలుగా గుర్తింపు పొందగా, అడ్డగుట్ట, జగత్‌గిరిగుట్ట, నామాలగుండు, బతుకమ్మకుంట లాంటివి తెలంగాణా వాసులకు చెందినవిగా గుర్తింపు పొందాయి. లక్డీకా పూల్, టప్పాచబూత్ర, ఫలక్‌నామా వంటి బస్తీల స్థానంలో బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్, హైటెక్‌సిటీ లాంటి కాలనీలు చోటు చేసుకుంటున్నాయి. ఎటొచ్చి కాలం గడుస్తున్న కొద్ది తెలంగాణా వాసుల జాడలు మాత్రం నీలి నీడలుగానే మిగిలిపోతున్నాయి.

గృహ నిర్మాణ రంగంలో 1956లో ప్రారంభమైన దోపిడీ 1969 నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ పుట్టుకతో పరాకాష్టకు చేరుకున్నది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముగిసిన వెంటనే పథకం ప్రకారం దోపిడీ మొదలైంది. రాజధాని నగరంపై క్రమంగా పట్టు సాధించడానికే హుడా, హౌసింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. హౌసింగ్ బోర్డు ద్వారా హైదరాబాద్ చుట్టూ కొత్తకొత్త కాలనీలను ఏర్పాటు చేసి ఆంధ్రులకు ధారాదత్తం చేశారు. అలాంటివే 'భరత్‌నగర్, బాగ్‌లింగంపల్లి, ఎస్.ఆర్. నగర్, వెంగళరావు నగర్, మలక్‌పేట, వనస్థలిపురం, మౌలాలి, గచ్‌బౌలి, విజయనగర్ కాలనీ, మెహిదీ పట్నం'లలో నిర్మించిన కాలనీలు. **ఉదా. ఆసియాలోకెల్లా అతి పెద్దదైన కూకట్‌పల్లి కాలనీలో 97% ఇళ్ళను ఆంధ్రులే కైవసం చేసుకోవడం పక్షపాత పాలనకు నిదర్శనం.** ఇప్పటివరకు ప్రభుత్వం, హుడా, హౌసింగ్ బోర్డు, లేబర్ డిపార్ట్‌మెంట్ నిర్మించిన మొత్తం గృహాలలో 90% ఆంధ్రులే చేజిక్కించుకుని హైదరాబాద్‌ను చుట్టుముట్టారు.

1970లో జూబ్లీహిల్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి ఎకరాకు వందరూపాయల నామమాత్రం ధరకు 1,398 ఎకరాలను ధారాదత్తం చేశారు. **ఆక్కడ ఉన్న తెలంగాణ పేద ప్రజలను, గిరిజనులను తరిమికొట్టి ఆ సొసైటీకి ధారాదత్తం చేసిన భూమి విలువ ప్రస్తుత**



**ధరల్లో వేల కోట్ల రూపాయల్లో ఉంటుంది. తీరా చూస్తే ఆ సొసైటీలో అధికశాతం ఆంధ్రులే సభ్యులు.** రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వశపరుచుకున్న భూములను వారు ప్లాట్లుగాచేసి ఎకరానికి చెల్లించిన ధరలలో గజాలను అమ్ముతున్నారు. తెలంగాణావాసులు తమ సంతతికి 50 గజాల స్థలాలను కొనిపెట్టలేనంతగా ధరలు అకాశాన్నంటాయి. **చెరువులు, కుంటలు కూడా బూటకపు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆకలికి ఫలహారమైపోతున్నాయి. అటవీ ప్రాంతాలు, బంజరు భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సిరులు పండిస్తున్నాయి.** పారిశ్రామికవాడల పేరున తెలంగాణ పేదప్రజల భూములను సేకరించి, సబ్సిడీ రేట్లతో బూటకపు పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారు. ఇంతా చేస్తే ఆ వ్యాపారులు సబ్సిడీ ధరలకు పొందిన భూములను అధికలాభాలకు అమ్ముకున్నా పట్టించుకునే నాధుడే లేడు.

## 9. పత్రికలు - టెలివిజన్లు :

అసత్యాలను, అర్ధసత్యాలను సత్యాలుగా మార్చడానికి కొన్ని దిన పత్రికలు పోటీ పడుతున్నాయి. చదువురాని వారిని బోల్తా కొట్టించడానికి ఇదేపనిని కొన్ని టెలివిజన్ ఛానళ్ళు చేపట్టాయి. పాలమూరు జిల్లాలోని 24 లక్షల జనాభాలో 14 లక్షల జనం వలస



పోయినా ఈ పత్రికలకు గుర్తుకు రాలేదు కానీ, తెలంగాణ ముఖ్యమంత్రులను దించేయడంలో ప్రతిరోజూ మొదటిపేజీ వార్తలే. ఏకంగా ఓ తెలంగాణ ముఖ్యమంత్రినే బఫూన్‌గా చిత్రిస్తూ కార్టూన్‌లను ప్రతిరోజూ ప్రచురించాయంటే మీడియా ఆధిపత్యం ఎలా కొనసాగుతున్నదో అంచనా వేయవచ్చు.

పత్రికా రంగంలో అసమానతలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. విలీనానికి ముందు తెలంగాణా ప్రాంతంలో ఉన్న పత్రికలన్నీ ఆంధ్ర పాలకుల వివక్షకు గురై కాలగర్భంలో కలిసి పోయాయి. ఫలితంగా పత్రికా రంగంలో ఆంధ్రుల గుత్యాధిపత్యానికి ఎదురే లేకుండా పోయింది. పాలకులు అస్మదీయ పత్రికలకే ప్రకటనలు, సబ్సిడీలు, గ్రాంట్లను మంజూరు చేస్తూ కొన్ని దినపత్రికలను తమ పార్టీ కరపత్రాలుగా మార్చుకుంటున్నారు.

మీడియా మొత్తం ఆంధ్రుల గుప్పిట్లోనే ఉన్నందున తెలంగాణ కష్టనష్టాలు ప్రభుత్వం దృష్టికిగానీ, బయటి ప్రపంచం దృష్టికి గానీ తెలియనీయడం లేదు. తెలంగాణ పేరు వింటేనే కొన్ని పేపర్లకు కంపరం పుట్టుకొస్తున్నట్లు కనిపిస్తున్నది. చిన్నచిన్న సంఘటలను పతాక శీర్షికలుగా ముద్రించి పెద్దపీట వేస్తున్న కొన్ని



దినపత్రికలు, ఉవ్వెత్తున లేచిన తెలంగాణ ఉద్యమ వార్తలు ప్రాముఖ్యతలేనివిగా లోపలి పేజీలకే పరిమితం చేస్తున్నారు. ఉద్యమాన్ని విజయవంతం చేయాలంటే ప్రస్తుతమున్న దినపత్రికలను, ప్రసార సాధనాలను మాత్రమే నమ్ముకుంటే సరిపోదు. పక్షపాత ధోరణి చూపిస్తున్న మీడియాపై కూడా ఉద్యమం నడిపించాల్సిన అవసరముంది.

## 10. సినిమా రంగం :

సినిమా రంగంలో లైట్ బాయ్‌నుండి హీరో వరకు మొత్తం ఆంధ్రులే. తెలంగాణ సంస్కృతిని నాశనం చెయ్యడానికి సినిమా రంగం నడుం బిగించినట్లు కనిపిస్తున్నది. ఇక్కడి యాసను, భాషను, సంస్కృతిని సినిమాల ద్వారా అవమాన పరుస్తున్నారు. రౌడీ వేషధారులకు, హాస్యనటులకు తెలంగాణ యాస పేరుతో భాషను తగిలిస్తున్నారు. వాస్తవానికి వారు తెలంగాణకు చెందిన భాషగా చూపిస్తున్న భాష కూడా తెలంగాణాలో ఎక్కడా కనిపించదు. నిజాం కాలంలో ఉర్దూ పదాల కలయికతో తెలుగును సంకరం చేసి మాట్లాడే వారు తెలంగాణలో ఒక్క శాతం కూడా లేరు. అలాంటి భాషను మొత్తం తెలంగాణ ప్రాంతానిదే అన్నట్లు బూటకపు ప్రచారాన్ని తమ సినిమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

సినిమా రంగమంతా 99 శాతం ఆంధ్రులకే చెందినందువల్లనో ఏమోకాని సినిమా రంగానికి ఇబ్బడిముబ్బడిగా సబ్సిడీలను ప్రకటించడంలో పోటీపడుతూ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగపరుస్తున్నది. రామోజీఫిలింసిటీకి, సినిమా స్టూడియోలకు, సినిమారంగంలో ఉన్న వారికి సబ్సిడీ ధరలకు ఇళ్ళ స్థలాలను కేటాయించడం విడ్డూరం. సినిమావారు అలా సంగ్రహించిన భూములను తప్పుదారి పట్టించినప్పుడుకూడా అడిగిన వారు లేరు. రామకృష్ణా స్టూడియో ఇప్పటికే వ్యాపార సముదాయంగా మారింది.

### 11. ఇతర రంగాలు :

చిట్స్, ఫైనాన్సెస్, టూర్స్ అండ్ ట్రావెల్స్, ప్రింటింగ్, కన్‌స్ట్రక్షన్స్, రియల్ ఎస్టేట్స్‌లాంటి వాటిలోకూడా ఆంధ్రులదే పూర్తి ఆధిపత్యం.

| ఇతరాలు (2001-02) | ఆంధ్ర | రాయలసీమ | తెలంగాణ |
|---|---|---|---|
| గ్రంథాలయాలు | 630 | 243 | 466 |
| పంచాయితీ శాఖలు | 883 | 342 | 295 |
| అగ్నిమాపక కేంద్రాలు | 104 | 40 | 62 |



ఇవి గాక అన్ని రంగాలలో అడుగడుగునా తెలంగాణాకు అన్యాయమే జరిగింది. **రాష్ట్రంలోనే వెనుకబడిన జిల్లాగా ముద్ర నెత్తినెత్తుకున్న మహబూబ్‌నగర్‌కు నాలుగుశాతం తెల్లకార్డులను కేటాయించి, అగ్రస్థానంలో ఉన్న తూర్పుగోదావరికి 7 శాతం తెల్లకార్డులను కేటాయించడం శోచనీయం.** సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (ఐ.ఆర్.డి.పి) క్రింద కేటాయింపులలో చిత్తూరుకు మొదటి స్థానం దక్కగా, ఆ తర్వాత స్థానాలను తూర్పుగోదావరి, గుంటూరులు దక్కించుకున్నాయి. జనాభా ప్రాతిపదికన కాకుండా గుడ్డి లెక్కలతో అధిక శాసనసభాస్థానాలను ఆంధ్రప్రాంతమే దక్కించుకున్నది. తెలంగాణ శాసనసభ స్థానాలలో అక్కడక్కడ ఆంధ్రులే సీట్లను దక్కించుకున్నారు. తెలంగాణా కోటాలో అలా గెలిచిన వలసవాదులు మంత్రిపదవులను కూడా దక్కించుకుంటున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి తెలంగాణలోని 9 జిల్లాల్లో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించాడంటే తెలంగాణ వెనుకబాటు తీవ్రతను ఊహించవచ్చు. రోజువారీ కూలీ పనులను కల్పించేందుకు ఉద్దేశించిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని చూపిస్తూ, దాన్ని కూడా తెలంగాణ అభివృద్ధిగా వర్ణించడం కొంచెపు బుద్ధి కాక మరేమిటి?



# తెలంగాణపై అపోహలు

### 1. ప్రకృతిపరంగానే తెలంగాణ వెనుకబడిన ప్రాంతం కాదు :

సకల సంపదలు కలిగిన తెలంగాణ నేడు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకన్నా మహబూబ్‌నగర్‌లోనే అత్యధిక సాగుభూమి వుంది. ఖమ్మం జిల్లాలో అత్యధిక ఆటవిక సంపద వుంది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో ఎనలేని బొగ్గు నిక్షేపాలున్నాయి. తెలంగాణలోనే అత్యధిక విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. రాష్ట్రంలో పేరుగాంచిన ప్రధాన నదులైన కృష్ణ, గోదావరి నదుల పరీవాహక ప్రాంతం 70 శాతానికి పైగా తెలంగాణలోనే ఉంది.

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని' అన్నట్లు ఇక్కడ అన్నీ ఉన్నా ఇక్కడి ప్రజలకు అన్నీ కరువే. త్రాగడానికి నీళ్ళులేని ప్రజలు తెలంగాణాలోనే ఉన్నారు. తినడానికి తిండిలేనివారు మనవారే. ఉండడానికి ఇల్లులేనిది మన ఊర్లే. చదవడానికి తగినన్ని విద్యా సంస్థలు లేవు. చదివిన వారికి కొలువులు లేవు. వ్యవసాయానికి సాగునీరు లేదు. నీరు ఉంటే కరంటు ఉండదు. పైగా తెలంగాణ ప్రజలకు మోసాలు చేసే కుయుక్తి తెలియదు. మోసాలనుండి



రక్షించుకునే యుక్తి తెలియదు. పర్యవసానంగా తెలంగాణవాసులు తరతరాలుగా అష్టకష్టాలనే వంశ పారంపర్య ఆస్తిగా తమ భావి తరాలకు అందజేస్తున్నారు. తెలంగాణ వెనుకబాటుకు కారకులుగా నిజాం నవాబులను చూపించి ఇంతకాలం ఆంధ్ర పాలకులు పబ్బం గడిపారు. కానీ వాస్తవానికి ఆంధ్ర పాలకులు వచ్చిన తరువాతే తెలంగాణ దోపిడీ తీవ్రమైంది. కృష్ణా, గోదావరిలనుండి నీటిని, సింగరేణి నుండి బొగ్గును, తెలంగాణ ప్రాంతంలోని సున్నపురాయిని ఆంధ్రులు కొల్లగొట్టడం వల్లనే తెలంగాణ ప్రాంతం వెనుకబడి పోయిందనేది వాస్తవం.

ప్రకృతిపరంగా తెలంగాణ వెనుకబడిన ప్రాంతంకానేకాదు. వెనుకకు నెట్టివేయబడిన ప్రాంతం మాత్రమే. విలీనం రోజున తెలంగాణ ఆంధ్ర కంటే వెనుకబడిలేదు. ఇక్కడ అనాడే మిగులు బడ్జెట్ ఉండేది. అడపాదడపా తుఫాన్‌లకు గురియై వలసవచ్చిన ఆంధ్రులను ఆదుకోగలిగారు. ఇక్కడి మిగులు బడ్జెట్, ఇక్కడి సంపదతోనే ఆంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి పరిచారు. అక్కడి అభివృద్ధి చిహ్నాలన్నీ సమైక్య రాష్ట్ర ఏర్పాటు తర్వాతే రూపొందగా, ఇక్కడి అభివృద్ధి చిహ్నాలేమైనా ఉంటే, అవి సమైక్య రాష్ట్ర ఏర్పాటుకు ముందు రూపుదిద్దుకున్నవే. ఆమాటకొస్తే నిజాం నవాబు రాయలసీమ,

కోస్తాంధ్రలను ఈస్ట్ ఇండియా కంపెనీకి దారాదత్తం చేశాడేకాని తెలంగాణను మాత్రం వదులుకోలేకపోయాడంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ప్రకృతిపరంగా తెలంగాణ వెనుకబడిన ప్రాంతమని చేస్తున్న గోబెల్స్ ప్రచారమంతా బూటకం. తుఫాన్లవల్లగాని, భూకంపాలవల్లగాని ఎలాంటి ప్రమాదంలేని సురక్షితమైన ప్రాంతం మన తెలంగాణ. ఏ ప్రాంతాన్ని వశపరచుకోవాలన్నా ముందుగా వారి సంస్కృతిని నాశనం చేయాలనే సూత్రాన్ని అక్షరాల పాటిస్తూ, క్రమక్రమంగా మన సంస్కృతిని సర్వనాశనం చేస్తూ, మనపై పట్టు సాధించి మనలను స్వంత రాష్ట్రంలోనే పరాయివారిగా మార్చాలని కుయుక్తులు పన్నుతున్నారు. వారి ఎత్తులను చిత్తుచేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంటే త్వరలోనే మనది కూడా అభివృద్ధి చెందిన ప్రాంతమేనన్న నిజం తెలుస్తుంది.

## 2. నక్సలిజం వల్లనే తెలంగాణకు నష్టం జరుగలేదు :

తీవ్రవాదం ఉన్నంతకాలం అభివృద్ధికి అడ్డంకే అని సాకులు చెబుతూనే ఉంటారు మన పాలకులు. అభివృద్ధి లేకపోతే తీవ్రవాదం పుట్టక తప్పదని తరతరాల చరిత్ర తెలియజేస్తున్నది. వాస్తవానికి వెనుకబాటుతనం వల్లే నక్సలిజం పుట్టుకురాగా, నక్సలైట్లవల్లే



తెలంగాణ వెనుకబడి ఉన్నదని అధికారంలో ఉన్నవారు వాదిస్తూ ఉంటారు. తెలంగాణకు అన్యాయం జరిగినందువల్ల, పేదరికం పెరగడం వల్ల, నిరుద్యోగం విజృంభించడంతోనే నక్సలిజం పుట్టి వేళ్లూనుకుంది. ప్రాంతాలన్నీ సమాంతరంగా అభివృద్ధి చెందివుంటే, పాలనలో వివక్ష లేకుంటే ఏనాడో నక్సలిజం జాడలు లేకుండా పోయేవి.

అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని నక్సల్స్ ఎన్నోసార్లు ప్రకటించారు. సంపద కేంద్రీకృతమవడాన్నే వారు వ్యతిరేకిస్తున్నారు. నక్సల్స్‌తో మూతపడిన సంస్థలకన్నా ప్రభుత్వాలు మూసివేసిన సంస్థలే అధికం. మూతపడిన పరిశ్రమలను తెరిపించాల్సిందిగా నక్సలైట్లు అనేకసార్లు డిమాండ్ చేశారు. నక్సలైట్ ఉద్యమం తీవ్రంగా ఉన్నదని చెబుతున్నప్పటికి తెలంగాణలో పరిశ్రమలు విజయపథంలో నడుస్తున్నాయి.

చర్య-ప్రతిచర్య అనే పద్ధతిలో పోలీసులు - నక్సలైట్ల మధ్య సాధారణ ప్రజలు నలిగిపోతున్నారు. నానాటికీ తెలంగాణ పల్లెలు ఖాళీ అవుతున్నాయి. పోలీసులు తమ కార్యదక్షతను ప్రదర్శించడానికి, నక్సలైట్లు తమ ఉనికిని నిరూపించుకోవడానికి పడుతున్న తంటాలలో



చివరికి తెలంగాణ ప్రాంతమే తల్లడిల్లి పోతున్నది. తెలంగాణ ప్రాంతం వేరయితే నక్సలిజం దానంతటదే సమసిపోతుందనేది నిర్వివాదాంశం.

## 3. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమైతే ముస్లింల రాజ్యంగా మారదు :

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమైతే ముస్లింల రాజ్యమైపోతుందని, ప్రచారం చేస్తున్నారు, ఇందులో ఎటువంటి వాస్తవం లేదు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ముఖ్యమంత్రులను తొలగించాలనే దురుద్దేశ్యంతో ఆంధ్రుల కుత్సితాల వల్లనే రాజధానిలో మత కలహాలు జరిగినట్లు చరిత్ర తెలియజేస్తున్నది.

తెలంగాణవాసులు ఎంతో కాలంనుండే హిందూ ముస్లింలుగా సహజీవనం సాగించడం నేర్చుకున్నారు. ముస్లిం పండుగలైన జహంగీర్‌పీర్ దర్గా జాతరలను సైతం హిందువులు జరుపుకుంటున్నారు. తెలంగాణలోని హిందూ - ముస్లింలను తోలుబొమ్మలను చేసి, ఆంధ్ర పాలకులు నాటకమాడుతున్నారు. ఆమాటకొస్తే ఇప్పటివరకు జరిగిన మతకలహాలలో ముస్లింల నుండి ఇక్కడి హిందువులను రక్షించడానికి అక్కడి హిందువులు ఏనాడైనా ముందుకు వచ్చారా? అలాగే ఇక్కడి ముస్లింలను రక్షించడానికి అక్కడి ముస్లింలు ప్రాణాలొడ్డారా? కలిసి జీవించడాన్ని గురించి ఇక్కడి



ప్రజలకు బాగా తెలుసు. ఈ విషయంలో ఆంధ్రులను చూసి నేర్చుకోవాల్సిన అవసరం లేదు.

## 4. భాష ఒక్కటైతే కలిసి వుండాలా? :

ప్రపంచంలో ఒకేభాష మాట్లాడే వారికి, ఒకే మతాన్ని పాటించే వారికి అనేక దేశాలున్నాయి. దేశంలో ఒకేభాషను మాట్లాడే వారికి వేరువేరు రాష్ట్రాలున్నాయి. ఒక తల్లి రక్తం పంచుకుపుట్టిన అన్నదమ్ములే విడిపోతుండగా, మనసులు కలువని భార్యాభర్తలే వేరు కాపురాలను ఎంచుకుంటుండగా, పరస్పర విరుద్ధమైన భావాలతో కలిసి ఉండేదెందుకు? భాషతో కలిసి వుండాలనడం భావ్యం కాదు. కలువాల్సింది భావాలే కాని, భాష కాదు. కలిపింది ప్రాంతాలనే కాని, మనసులను కాదు. నీటిలో నూనె కలిసినట్లు కలిశామే తప్ప, పాలు నీళ్లలా కలువలేకపోయాం. కలపడానికి ముందే విలీనానికి తెలంగాణా వాసులు వ్యతిరేకించారంటే, ఇక్కడి ప్రజల ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండానే కలిపారన్నది అంగీకరించి తీరాల్సిన విషయం.

అయినా భాష ఒక్కటే అన్న విషయాన్ని కూడా ఆంధ్రులు అంగీకరించినట్లు దాఖలాలు లేవు. మన భాషను, యాసను

ఏనాటినుండో తమ సినిమాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. తెలుగు భాషను రక్షించడానికి చర్యలే చేపట్టకపోగా, విద్యారంగాన్నంతా ఆంగ్లంతో నింపి, తెలుగును కనుమరుగు చేశారు. నిజమైన తెలుగును మాట్లాడేవారు రాష్ట్రంలోనే ఒక శాతానికి మించి కనిపించరు. ఉర్దూ, ఇంగ్లీషు పదాల కలయిక లేనిదే భావాలను సరిగా వ్యక్తీకరించలేని కూడలిలో ఉన్నాం. ఇంకా భాషను పట్టుకొని కలిసి ఉండాలనడం దేనికి? ఆమాటకొస్తే తెలంగాణ ప్రజలది సరైన తెలుగు కాదని గేలి చేస్తుంటారు. కాని భారతాన్ని ఆంధ్రీకరించిన తిక్కన, భాగవతాన్ని తెలుగీకరించిన పోతనలు తెలంగాణ ప్రాంతంవారే అని చరిత్రకారులు అంటున్నారు.

## 5. రాష్ట్రాలు విడిపోవడం జాతీయవాదానికి దెబ్బకాదు :

అభివృద్ధికి చిన్న రాష్ట్రాలే దోహదపడుతున్నట్లు పరిస్థితులు తెలియజేస్తున్నాయి. మనకన్న పెద్ద రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌లు మనకన్నా వెనుకబడి ఉన్నాయి. చిన్న రాష్ట్రాలైన పంజాబ్, హర్యానా, హిమాచాల్ ప్రదేశ్‌లు మనకన్నా ముందున్నాయి. స్వాతంత్ర్యానంతరం – భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తర్వాత ఎన్నో రాష్ట్రాలనేర్పరచుకున్నాం. ఈశాన్య ప్రాంతంలో చిన్న చిన్న రాష్ట్రాలు పుట్టుకొచ్చాయి. పంజాబ్, హర్యానాలు విడిపోయాయి.



నిన్నగాక మొన్న హిందీ మాట్లాడే రాష్ట్రాలనుండే ఉత్తరాంచల్, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్‌లు పుట్టుకొచ్చాయి. దేశంలోనున్న 28 రాష్ట్రాలు భాషా పరంగాకానీ, జనాభా పరంగా కానీ, వైశాల్యపరంగా కానీ ఏర్పరచినవి కావు. లక్షల్లో జనాభా వున్న రాష్ట్రాలు ఒకవైపు, కొన్ని దేశాలకన్నా ఎక్కువ జనాభా వున్న రాష్ట్రాలు మరొకవైపు ఈ దేశంలోనే వున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం జనాభా పరంగా, వైశాల్యపరంగా దేశంలో ఇప్పుడున్న సగం రాష్ట్రాలకన్నా పెద్దదే అవుతుంది.

వైశాల్యపరంగా అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, గోవా, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, మేఘాలయ, నాగాలాండ్, పంజాబ్, సిక్కిం, త్రిపుర, జమ్మూకాశ్మీర్, ఉత్తరాంచల్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు ఏర్పాటు కాబోయే మన తెలంగాణా కన్న చిన్నవే.

## 6. తెలంగాణ ఉద్యమం వేర్పాటు వాదం కాదు :

తెలంగాణ ఉద్యమాన్ని వేర్పాటు వాదమని, ప్రాంతీయ తత్వమని అధికారంలో ఉన్న బూటకపు నాయకులకు విమర్శించడం అలవాటైపోయింది. కాని మన కన్నా ముందే, 1952లోనే ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి వేర్పాటు కొరకు ఉద్యమాలు నడిపి ప్రత్యేక "ఆంధ్ర రాష్ట్రం" ఏర్పరచుకున్నది ఆంధ్రులేనని మరిచిపోరాదు. ప్రత్యేక



ఆంధ్ర రాష్ట్రం కొరకు పొట్టి శ్రీరాములు ఆనాడు చేసింది గొప్ప కార్యమే అయితే తెలంగాణ వాసులు నేడు నడిపిస్తున్న ఉద్యమం కూడా గొప్ప కార్యమే.

ప్రత్యేక రాష్ట్రం కొరకు ఉద్యమాన్ని నడిపిస్తున్నంత మాత్రాన తెలంగాణ ప్రజల దేశభక్తిని శంకించాల్సిన అవసరం లేదు. జాతీయ వాదానికి ప్రతీకలైన హోళి, రాఖీపూర్ణిమ వంటి జాతీయ పండుగలు దేశ ప్రజలకు ధీటుగా తెలంగాణా వాసులు జరుపుకుంటుండగా, ఈ రెండు జాతీయ పండుగలకు ఆంధ్ర ప్రాంతంలో ఆనవాలే లేని విషయాన్ని గమనించాలి.

## 7. పారిశ్రామికాభివృద్ధికి ఆంధ్రులు కారణం కాదు :

ఆంధ్రుల వల్లనే ఈ ప్రాంతంలో పరిశ్రమలు పుట్టుకొచ్చాయని మరో కువిమర్శ బయలుదేరింది. కాని ఆంధ్ర ప్రాంతంలో ఒక్క పరిశ్రమ కూడా లేని రోజుననే ఇక్కడ రెండొందల పరిశ్రమలుండేవి. విలీనం తర్వాత ఆ పరిశ్రమలన్నీ అసమర్థులైన, అవినీతిపరులైన ఆంధ్రా అధికారుల చేతివాటం వల్లనే మూసివేతకు గురైనాయి. ఆ తర్వాత ఆ పరిశ్రమల స్థానంలోనే ఆంధ్రులు ప్రభుత్వం నుండి ప్రత్యేక వసతులను పొంది నూతన పరిశ్రమలను ఏర్పరచుకున్నారు. వడ్డించే స్థానంలో ఆంధ్ర పాలకులుండగా,



తెలంగాణ వాసులకు పరిశ్రమలను స్థాపించుకునే అవకాశమే లేకుండా పోయింది. అయినా అన్ని రకాల పరిశ్రమలకు ముడిసరుకులు తెలంగాణలో అందుబాటులో వుండగా, ఆంధ్రుల గొప్పతనాన్ని వర్ణించడంలో ఔచిత్యమేముంది? వారి ప్రాంతంలో పరిశ్రమలను పెట్టుకునే వాతావరణంగానీ, వసతులుగానీ లేకపోవడం వల్లనే ఇక్కడ పరిశ్రమలను స్థాపించారే తప్ప తెలంగాణ ప్రాంత అభివృద్ధిపై అభిమానంతోగాని, రాజధాని నగర అభివృద్ధిపై ప్రేమతోగాని కానేకాదు. సబ్సిడి ధరల్లో స్థలాలు, నీటివసతి, విద్యుచ్ఛక్తిలాంటివి పొంది పరిశ్రమలను స్థాపించారు. అయినా వారు పెట్టిన పరిశ్రమల ద్వారా కూడా లాభాలు, ఉద్యోగాలు ఆంధ్రులకే లభించగా, కాలుష్యం కంపు తెలంగాణకు దక్కింది.

## 8. ఆంధ్రులవల్ల రాజధాని అభివృద్ధి చెందలేదు :

ఆంధ్రుల వల్లనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని ఓ బూటకపు వాదాన్ని వారు ముందుకు తెస్తున్నారు.

విశాలాంధ్ర ఏర్పాటుకు ముందు కరువు కాటకాల సమయాల్లో మన పల్లె జనాలకు ఈ నగరం కామదేనువులా జీవనోపాధిని కల్పించింది. కాని అభివృద్ధి చెందిందని చెప్పుకుంటున్న

ఈ నగరం నేడు తెలంగాణ పల్లె ప్రజలను నిరాశకే గురి చేస్తున్నది. నగరం నిండా, ఏ అడ్డమీద చూసినా తెలంగాణ కూలీలు పనులకొరకు పరుగులు పెడుతున్నారు. వారానికి ఒకసారి కూడా పనిదొరకని పరిస్థితి ప్రత్యక్షంగా కనిపిస్తున్నది. పెరుగుతున్న పలు అంతస్తుల భవనాలు తెలంగాణ ప్రజలకు ఆశ్రయం ఇవ్వలేకపోతున్నాయి. ఫలితంగా ఎక్కడ చూసినా ఖాళీ ప్లాట్లలో గుడిసెలు వెలుస్తున్నాయి. మూసీ నదికి ఇరువైపుల మురికిలో జీవిస్తున్న వారంతా తెలంగాణావారేనని మరిచిపోరాదు. నిరుద్యోగంతో యువకులు రోడ్లవెంబడి తిరుగుతున్నారు. దిక్కుతోచని మరికొందరు అడవులు పట్టుకుని తిరుగుతున్నారు. అవినీతి రాజ్యమేలుతున్నది. కాలుష్యంతో కంపరం పుట్టుకొస్తున్నది. ఇదేనా హైదరాబాద్ అభివృద్ధి?

పలు అంతస్తుల భవనాలు, విశాలమైన కాలనీలు విస్తరించడమేనా అభివృద్ధి అంటే? కోట్లకు పడగలెత్తినవారు ఓవైపు, కూటికి లేనివారు మరోవైపు వుండడమేనా అభివృద్ధి? సంపద కేంద్రీకృతమైపోయింది. తెలంగాణేతరుల చేతుల్లోకే సంపదంతాపోతున్నది. చేతకాని ప్రభుత్వాలవల్లనైతేనేమి, పక్షపాతపు పరిపాలన వల్లనైతేనేమి, కొందరు ఉద్యోగులు, కొందరు కాంట్రాక్టర్లు



అవినీతితో ప్రజాధనాన్ని దోచి, పెద్దపెద్ద భవనాలు నిర్మించుకున్నంత మాత్రాన అభివృద్ధి జరిగినట్లా? జనాభా పెరగడం గానీ, భవనాలు పెరగడం గానీ అభివృద్ధికి ప్రామాణికం కాదు. ప్రజలకు వసతులు పెరిగితే, జీవనోపాధి పెరిగితే, జీవన ప్రమాణాలు పెరిగితే నిజమైన అభివృద్ధి జరిగినట్లు చెప్పుకోవాలి. ప్రపంచమంతటా జనాభా పెరిగిపోతున్నట్లే హైదరాబాద్‌లోనూ పెరిగింది. పల్లెటూళ్లలో కూడా కాంక్రీట్ భవనాలు చోటు చేసుకుంటున్నట్లే హైదరాబాద్‌లో భవనాల అంతస్తులు పెరిగాయి. ఇదంతా ఆంధ్రుల వల్లనే జరిగిందంటే ఎలా? చార్మినార్, కోటి, ఆబిడ్స్‌లు ప్రాధాన్యతను కోల్పోయి - కూకట్‌పల్లి, వనస్థలిపురం, మాదాపూర్, ఫిలిం సిటీ లాంటివి ప్రాధాన్యతను సంతరించుకుంటే అభివృద్ధి చెందినట్లా?

ఆమాటకొస్తే ఇప్పటికీ హైదరాబాద్‌లో చెప్పుకోదగినవిగా పేర్కొంటున్న గండిపేట చెరువు, హుసేన్ సాగర్, ఉస్మాన్ సాగర్, నెహ్రూ జంతు ప్రదర్శన శాల, సాలార్‌జంగ్ వస్తు ప్రదర్శన శాల, అసెంబ్లీ భవనం, ఉస్మానియా విశ్వ విద్యాలయం, ఉస్మానియా ఆస్పత్రి, సెక్రెటేరియట్, గోల్కొండ కోట లాంటి అభివృద్ధి చిహ్నాలన్నీ ఆంధ్రుల ప్రమేయం లేకుండానే సమైక్య రాష్ట్రానికి ముందే ఇక్కడున్నాయి.



ఎవరికీ అందుబాటులో లేని హైటెక్ సిటీ, సబ్సిడీలతో ఎమ్మెల్యేల కాలనీలు, సినిమా స్టుడియోలు, కార్పోరేట్ ఆస్పత్రులు, రామోజీ ఫిల్మ్‌సిటీ లాంటివే ఆంధ్రుల పాలనలో అభివృద్ధి చెందాయి. ఈ అభివృద్ధికి కూడా పరోక్షంగా తెలంగాణావారే నష్టపోగా ఆంధ్రులే అభివృద్ధి చెందారు. వారి మాటల్లో చెప్పాలంటే సామాన్యునికి ఇండ్ల స్థలాలరేట్లు అందుబాటులోలేనంత ఎత్తు ఎదగడం అభివృద్ధి అన్నమాట! ఇంకా చెప్పాలంటే నగరంలోని ఉద్యోగాలన్నీ ఆంధ్రులే వశపర్చుకుని, వారే అభివృద్ధి చెందినమాట వాస్తవం. పాలకులు కల్పించిన వసతుల ఆధారంగా ఆంధ్రులే పరిశ్రమలను స్థాపించుకుని, వారే లాభాలను గడించారన్నది నిజం. పాత హైదరాబాద్ నగరం చుట్టూ వలసవాదులు అందమైన కాలనీలు నిర్మించుకున్న మాట సత్యం. కానీ, వీటన్నింటివల్ల తెలంగాణ ప్రజలు నికరంగా నష్టపోయారు. 'మంది ఎక్కువైతే మజ్జిగ పలుచన' అన్నట్లు తెలంగాణేతరుల వలసల వల్ల సహజ వనరుల పంపకంలో మనమే నష్టపోయాం. ఒక్క మాటలో చెప్పాలంటే 'మన పప్పును, వారి పొట్టును కలుపుకుని అందరం కలిసి ఊదుకుని తింటున్నామని మరచిపోరాదు'. అంటే హైదరాబాదును ఆధారంగా చేసుకొని ఆంధ్రులు అభివృద్ధి చెందారేకాని, ఆంధ్రులవల్ల తెలంగాణవాసులకు దక్కిందేమిలేదు.



గోల్కొండ రాజులు, నిజాం పాలకులు పన్నుల రూపంలో ప్రజలను దోచి హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశారు. వారు కూడా మనపై ప్రేమతో అభివృద్ధి చేయకపోయినా, అదృష్టవశాత్తు ఆ అభివృద్ధి మాత్రమే నేడు మనకు మిగిలింది. నేటి పాలనలో కూడా ఏదైనా అభివృద్ధి జరిగిఉంటే, అదికూడా ఆంధ్రుల అభివృద్ధి కొరకు జరిగిందే తప్ప, తెలంగాణకు పెద్దగా ఉపయోగపడుతున్నదేమీలేదు. అయినా ఆ అభివృద్ధి కూడా తెలంగాణా నిధులతో, తెలంగాణా ప్రజలను మభ్యపెట్టి చేస్తున్నదే అని మరిచిపోరాదు. ఆరు సూత్రాల పథకం అమలులోకి రాకముందు ఈ నగరంలోని సౌకర్యలన్నీ తెలంగాణ వారికి మాత్రమే అందుబాటులో ఉండేవి. కాని నేడు చాలా వాటిపై తెలంగాణా వాసులు పట్టు కోల్పోతుండగా, ఆంధ్రులకే పూర్తి హక్కులు లభిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఒకవైపు రాజధాని అభివృద్ధిని తెలంగాణ అభివృద్ధిగా చూపిస్తూ, మరోవైపు అభివృద్ధి ఫలాలను కూడా వారే దక్కించుకుంటూ 'ఆరుసూత్రాల పథకం'తో హైదరాబాద్ అందరిదీ (ఫ్రీజోన్) అని చెపుతూ తెలంగాణకు అభివృద్ధిలో మొండిచేయి చూపిస్తున్నారు. 1956 నాటి హైదరాబాద్ (పాతబస్తీ) ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోగా, వలసవాదుల అడ్డాలు మాత్రమే (కొత్తసిటీ)

అభివృద్ధి చెందాయి. పాతబస్తీని పరిశీలిస్తే హైదరాబాద్ ఎంత అభివృద్ధి చెందిందో అర్థమైపోతుంది.

### 9. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం రాజకీయ నాయకుల సృష్టి కాదు :

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర నినాదం రాజకీయ నిరుద్యోగులు పుట్టించారనే పుకార్లలో వాస్తవం లేదు. ప్రజాబలం లేనిదే ఏ ఉద్యమమూ నిలదొక్కుకోలేదని ప్రపంచ చరిత్ర ఎన్నోసార్లు రుజువు చేసింది. అన్యాయాలు జరుగకపోతే ప్రజలకు ఎన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పినా ఉద్యమాలలో పాల్గొనరనేది అక్షర సత్యం. జీవనానికే గడ్డు పరిస్థితులున్న మనదేశంలాంటి దేశాలలో, ప్రత్యేకించి ఆకలి చావులకు నిలయమైన తెలంగాణ వంటి ప్రాంతాలలో పనులను విడిచిపెట్టి ఉద్యమాలలో పాల్గొనడం సాధ్యంకాని పని. ప్రజా ఉద్యమంగా రూపు దిద్దుకున్న కారణం చేతనే 1971లో 10 మంది ఎం.పి.లు గెలిచారు. గెలిచినవారు ఏం చేశారన్నది ఇక్కడ అప్రస్తుతం. ప్రజలు తమ కర్తవ్యాన్ని తాము నిర్వర్తించారు. వివిధ కారణాల వల్ల ఉద్యమం అనుకున్న ఫలితం పూర్తిగా సాధించి ఉండకపోవచ్చు, అంతమాత్రాన ఉద్యమాన్నే శంకించడం భావ్యంకాదు.

ఇప్పటికే ఈ ఉద్యమానికి తెలంగాణకు చెందిన ఉద్యోగులు బాహాటంగానే తమ మద్దతును ప్రకటించారు. రాజకీయాలతో



సంబంధం లేని మేధావులు, సామాన్య ప్రజలు, విద్యార్థులలో అత్యధికులు ప్రత్యేక రాష్ట్రాన్ని సమర్థిస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీలలో భాగమైనందున ఆయా పార్టీల నిర్ణయాలకు తలొగ్గడంతో అతి తక్కువమంది తెలంగాణ నాయకులు మాత్రమే తెలంగాణను బాహాటంగా సమర్థించలేకపోతున్నారు.

### 10. 1969 తెలంగాణ ఉద్యమ ఫలితాలు :

1969నాటి తెలంగాణ ఉద్యమం అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయినా ఈ ఉద్యమం తర్వాతే మొదటిసారిగా తెలంగాణ వ్యక్తికి (పి.వి. నరసింహారావు) ముఖ్యమంత్రి పదవి లభించింది. ఆ తరువాతే మర్రిచెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య లాంటి వారలకు ముఖ్యమంత్రి పదవులు దక్కాయి. కేటాయింపులలో కూడా కొద్దిపాటి పెరుగుదల ప్రారంభమైంది. అఖిలపక్ష ఒప్పందం, ఆరుసూత్రాల పథకాలు ముందుకు వచ్చాయి. అయితే వీటన్నింటివల్ల తెలంగాణకు ఒరిగిందేమిటని ప్రశ్నించేవారు కూడా లేకపోలేదు. వివిధ కారణాల వల్ల ఈ చర్యలు తెలంగాణ కష్టాలను తగ్గించలేకపోయి వుండవచ్చు. కాని, ఆనాటినుండే తెలంగాణ ప్రాంతానికి గుర్తింపు లభించి, తెలంగాణ పేరు వింటేనే ఆంధ్రపాలకులకు వణుకు పుట్టే పరిస్థితులు ఎదురయ్యాయి.



ఆ ఉద్యమమే జరుగకుండా ఉంటే ఇప్పుడు జరిగిందని చెప్పుకుంటున్న నష్టంకన్నా ఎన్నోరెట్లు ఎక్కువ నష్టం జరిగి వుండేది. అవమానాలు మరింత పెరిగేవి. చెన్నారెడ్డి, సత్యనారాయణ రెడ్డి లాంటి వారికి గవర్నర్ పదవులు దక్కేవి కావు. ఉద్యమం పుట్టుకొచ్చినందువల్లనే పి.వి.నరసింహారావు, శివశంకర్, మల్లికార్జున్, వెంకటస్వామి, అంజయ్యలకు కేంద్రంలో మంత్రి పదవులు దక్కాయి. ఒకవేళ నాటి ఉద్యమం ఏమీ సాధించలేదని చెప్పుకుందామన్నా ఈనాటి ఉద్యమానికి ఆ ఉద్యమమే ప్రేరణ అని అంగీకరించక తప్పదు.

### 11. తెలంగాణ ఏర్పడితే ఇక్కడి ప్రజలకు దక్కే ప్రయోజనాలేమిటి?

- ★ కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదుల్లో తెలంగాణ కొరకు కేటాయించిన నీటిని వినియోగపర్చుకుని రైతులు లాభం పొందుతారు.
- ★ తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌తో వ్యవసాయానికి అవసరమైన మేరకు సరఫరా చేయవచ్చు.
- ★ సుమారు రెండు లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగులుగా మారుతారు.



- ★ తెలంగాణ సంస్కృతి, భాషలు పునరుద్ధరింపబడతాయి. భాష సంస్కృతుల అవమానానికి స్థానముండదు.
- ★ నక్సలిజం పూర్తిగా తుడుచుకుపోయే అవకాశముంది.
- ★ తెలంగాణ వనరుల వినియోగం కొంతమేరకు తగ్గే అవకాశం ఉన్నందున వాటిని భావితరాలకు పదిలపరచవచ్చు.
- ★ విద్యార్థులకు విద్యావకాశాలు పెరుగుతాయి.

### 12. తెలంగాణది కూడా ఘనమైన చరిత్రే :

స్వాతంత్ర్య పోరాటానికి దీటుగా నిజాం నిరంకుశత్వంపై నడిపించిన పోరాటం, స్థానికేతరులకు వ్యతిరేకంగా నడిపించిన ముల్కి ఉద్యమం, సమైక్య రాష్ట్ర ఏర్పాటు నాటి నుండి ఆంధ్రులకు వ్యతిరేకంగా నడిపిస్తున్న పోరాటాలన్ని నిజమైన చైతన్యానికి ప్రతిరూపాలే. కాని తెలంగాణ చరిత్రను కాలరాయడానికి పాలకులు చేసిన వికృత చేష్టల వల్ల ఈనాటి ప్రజలకు ఆ పోరాటాల ఆనవాళ్ళు మాయమైనాయి. చరిత్రలో విజయగాథలు మాత్రమే నిలిచి ఉంటాయనేది ఒక సత్యం కాగా, మానవీయ కోణాలను ఆవిష్కరించదలచిన తెలంగాణ పోరాటాలు క్రమక్రమంగా కనుమరుగై పోతున్నాయి. తమ పూర్వీకుల విజయగాథలను పుస్తక రూపంలో తేవడానికి తెలంగాణ వాసులు ప్రయత్నించకపోవడం ఒక కారణం కాగా, లేని చరిత్రను తెలంగాణ

ప్రజలపై పాలకులు బలవంతంగా రుద్దిన కారణంచే తమ చరిత్రను మరిచిపోయారు. ఆదిమ జాతుల మనుగడ పోరాటాలనుంచి ఇప్పటి వరకు తెలంగాణాకు చెక్కుచెదరని చరిత్ర ఉంది. ప్రపంచంలో ప్రాచీన నాగరికతలకు దీటైన నాగరికత ఉంది. తరిచి చూస్తే తెలంగాణలో ప్రతి ఊర్లో ఇందుకు సంబంధించిన ఏదో ఒక ఆనవాలు కనిపిస్తుంది.

ఆధిపత్యం చెలాయించే జాతులు వెనుకబడ్డవారి చరిత్రను పైకి రానీయరని ఆర్యుల కాలంనాటినుండే తెలుస్తున్నది. ఇంతటి ఉద్యమానికి ఘనమైన చరిత్ర ఆపాదించలేకపోయినా ఫరవాలేదు కాని, సంకుచితత్వంతో దాన్ని వేర్పాటు వాదంగా చిత్రించడం చూస్తుంటే ప్రతి తెలంగాణ పౌరునిపై తేళ్లు, జెర్రులు పాకినట్లు అవుతున్నది. ఆంధ్రా ఆధిపత్యంతో నడిచిన పత్రికలన్ని ఆ ఉద్యమానికి వక్రభాష్యమే చెప్పడం వల్లనే ఈ దౌర్భాగ్యస్థితి నెలకొన్నదనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రస్తుత ఉద్యమాన్ని కూడా ఇదే విధంగా కనుమరుగు చేసే అవకాశాలున్నందున ప్రజలు, ఉద్యమకారులు ఏమరుపాటుతో మెలగవలసిన అవసరం ఎంతైనా ఉంది.



# తెలంగాణ - రాజకీయ పార్టీలు

## కాంగ్రెస్ పార్టీ :

ఏ ఎండ కాగొడుగు పట్టే వారిలో కాంగ్రెస్ వారే అగ్రేసరులని అందరికీ తెలిసిన విషయమే. తెలంగాణ కష్టాలకు అసలు కారకులు కాంగ్రెస్ వారే కాగా, కొంగ జపంలా తెలంగాణ సమస్యలపై ఇతర పార్టీలను విమర్శించడంలో మాత్రం ముందుంటారు. సమైక్య రాష్ట్ర ఏర్పాటు నుండి ఏకధాటిగా 26 సంవత్సరాలు అధికారంలో ఉన్నది ఆ పార్టీయే. అంతేగాకుండా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే తెలంగాణ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా హైదరాబాదును విలీనం చేశారు. విలీన ఒప్పందపై సంతకాలు చేసిన ఇరు ప్రాంతాల నాయకులు ఆ పార్టీకి చెందిన వారే. కాంగ్రెస్ పక్షపాత పాలనకు వ్యతిరేకంగానే 1969 లో తెలంగాణ ప్రజలు ఉద్యమించారు. అదే కాంగ్రెస్ హయాంలోనే కాంగ్రెస్ వారే జైఆంధ్రా ఉద్యమాన్ని నడిపించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి హయాంలో



సుమారు 400 మంది తెలంగాణ యువకులు నేలకొరిగారు. సుమారు 8 దశాబ్దాల చరిత్రను కలిగి ఉన్న కాంగ్రెస్ పార్టీని 1971 నాటి పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఛీకొట్టారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ ప్రజా సమితికి ఓటు వేసి, తమ ప్రత్యేక రాష్ట్ర కోరికను వెలిబుచ్చినా, ప్రజాభి ప్రాయాన్ని పాతరలో పెట్టింది కేంద్రంలోనున్న ఆనాటి కాంగ్రెస్ పార్టీయే.

'కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెడగొట్టినట్టు' ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించినప్పుడల్లా తెలంగాణ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు 'గుంపులో గోవింద' అన్నట్లు తెలంగాణ నినాదాన్ని అందుకొని తమ ఉనికిని కాపాడుకోవాలనే తాపత్రయంతో ఉద్యమానికి తూట్లు పొడవడం ఆనవాయితీగా వస్తున్నది. ఇదే తంత్రంలో భాగంగా తూతూ మంత్రాలతో తెలంగాణ కాంగ్రెస్ ఫోరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమం ఊపందుకుంటున్న దశలో టి.ఆర్.సి.సి. కి చెందిన నాయకులు రోజుకోమాట చెబుతూ, గుంపులో గోవింద అన్నట్లు తాము సహితం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకే పోరాడుతున్నట్లు ఫోజులిచ్చారు.



తెలంగాణ కొరకు పోరాడుతున్న వారిపై విమర్శలు గుప్పిస్తూ కాలం గడిపారు. తాము అధికారంలోకి వస్తే తెలంగాణ వచ్చేసినట్లే అని ప్రగల్భాలు పలికి ఇక్కడి ప్రజలను అయోమయానికి గురిచేసి, ఉద్యమానికి ఊపురాకుండా చేయడంలో తమ వంతు పాత్రను పోషించారు. అధికారం దక్కుతుందో లేదో అనే అనుమానంతో టి.ఆర్.ఎస్.తో పొత్తుకు తహతహలాడి, తీరా అధికారం దక్కాక అధికార మత్తులో మైమరచిపోతూ తెలంగాణను మరిచిపోయారు. పైగా తమ పాలనలో తెలంగాణ అభివృద్ధి చెందుతుందంటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ ప్రక్కదారి పట్టింపజూస్తున్నారు. అధికారంలో లేని రోజున తెలంగాణకు పోరాడమని చెప్పుకుంటూ, అధికారం దక్కాక మూగనోము పాటిస్తామనడం కొంగజపాన్ని గుర్తుకు తెస్తున్నది. ఆనాడు కోటలు దాటిన వారి మాటలు, నేడు చేతలు చూస్తే గడప కూడా దాటడం లేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అన్ని వైపులనుండి అనుకూల పరిస్థితులు ఏర్పడినప్పుడు వీరి మౌనవ్రతమే అడ్డంకిగా మారినందున చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోతారని గుర్తించి చిత్తశుద్ధితో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సహకరించాలనే సంకల్పాన్ని ఏర్పరచుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు.

## కమ్యూనిస్టులు :

అధినాయకత్వంలో ఉన్న ఆంధ్రా కమ్యూనిస్టు నాయకులకు ఎదురు చెప్పే నాయకులు తెలంగాణ కమ్యూనిస్టులలో లేనందున కమ్యూనిస్టు పార్టీ ఎంచుకున్న విశాలాంధ్ర వాదానికి ఎటువంటి అడ్డంకి ఎదురుకాలేదు. నిజాంమీద వీరోచిత పోరాటం సాగించిన కమ్యూనిస్టులకు విశాలాంధ్ర నినాదం ఆ గొప్పతనానికి గుర్తింపు లేకుండా చేసింది. ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు తెలంగాణ కమ్యూనిస్టు కార్యకర్తలను జెండాలను, తుపాకులను మోసే వారుగానే భావిస్తున్నారు కాని, ఏనాడూ భావ ప్రకటన స్వేచ్ఛకుగాని, కలం పట్టుకునే అవకాశానికి గాని స్థానమీయలేదు.

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం పట్ల కమ్యూనిస్టులు సైంధవునిలా అడ్డుపడుతున్నారు. కష్టపడి 'ఇల్లుకట్టి కల్లుతాగి తగులబెట్టినట్లు' విప్లవాలతో నిజాం నిరంకుషత్వం నుండి తెలంగాణను విడిపించడానికి ప్రాణ త్యాగాలు చేశామని గొప్పగా చెప్పుకుంటూ, విలీన సమయంలో అత్యుత్సాహాన్ని ప్రదర్శించి తెలంగాణను కసాయి చేతిలో పెట్టడం వైపే మొగ్గు చూపారు. సమైక్య రాష్ట్ర ఏర్పాటును ప్రోత్సహించి కొంత



ఉనికిని కోల్పోగా, మరోసారి ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకిస్తూ ఉన్న కాస్త ఉనికిని కూడా ఊడ్చుకున్నారు. తెలంగాణ ప్రజల ఈనాటి శాపనార్థాలకు మరో నూరేళ్ళవరకు కమ్యూనిస్టులకు రాష్ట్ర పగ్గాలు దక్కే అవకాశాలు లేవు. భాష ఒక్కటైనందున కలిసుండాలని కాకి గోల చేస్తున్న కమ్యూనిస్టులు, వారి పార్టీలో మాత్రం కలిసుండలేక కుక్కలు చింపిన విస్తరిలా ముక్కలు ముక్కలుగా విడిపోయారు.

ఆంధ్ర భూస్వామ్య శక్తులకు జంట వాయిద్యంగా మారి, సమైక్యతా రాగాన్ని వినిపిస్తూ, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని ప్రగల్భాలు పలుకుతూ, ఆంధ్ర పాలకుల వివక్షను నిలువరించడంలో విఫలమై, వీరు పిచ్చి చూపులు చూస్తున్నారు. తెలంగాణ ప్రాంతీయ బోర్డును తెలుగు దేశం అధినేత రద్దుపరచిన రోజున కానీ, లేదా 610 జీవో విషయంలో కాని ఒక పేపర్ స్టేట్‌మెంట్‌తో తెలంగాణ ప్రజలకు సంతోషం కలిగించినా, తెలంగాణ వాసులు కమ్యూనిస్టులను అక్కున చేర్చుకొని ఉండేవారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు విషయంలో కమ్యూనిస్టులను నమ్ముకోవడం కుక్కతోకను పట్టి గోదావరి ఈదినట్లుగానే ఉంటుంది.



## తెలుగుదేశం పార్టీ :

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాకే తెలంగాణకు కష్టాలు రెట్టింపయ్యాయి. ఆంధ్రుల ఆధిపత్యం మరింత పెరిగింది. కమ్మ కులస్తుల పార్టీగా చెప్పుకునే స్థితికి తెలుగుదేశం దిగజార్చబడ్డది. తెలుగుదేశం అధినేత రామారావుకు రాజకీయ పరిజ్ఞానం లేకపోవడం వల్ల, ఆయన ఆంధ్ర అధికారులపైనే ఎక్కువగా ఆధారపడినందున ఆయన తీసుకున్న చర్యలన్నీ తెలంగాణకు నష్టమే కలిగించాయి. ప్రాంతీయాభివృద్ధి బోర్డు రద్దు మొదటి వివక్ష కాగా, తెలుగు గంగ పథకంతో తెలంగాణ నిధులకు కోత పడడం మరో వివక్ష. వీరి పాలనా కాలంలో స్థాపించబడ్డ విశ్వవిద్యాలయాలన్నీ ఆంధ్ర, రాయలసీమ, రాజధాని ప్రాంతాలకే పరిమితమైనాయి. అప్పటికే రాజధానిలో ఉన్న వైద్య విద్యాలయాలను విజయవాడ వైద్య విధాన పరిషత్తులో భాగంగా మార్చారు. పద్మావతీ మహిళా విశ్వ విద్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేశారు. నల్గొండలో ఏర్పాటు చేయ సంకల్పించి, ప్రారంభించిన ఓపన్ యూనివర్సిటీని రాజధానికి తరలించారు.



తెలుగుదేశం కుటుంబ పాలనకు శ్రీకారం చుట్టినందున ఆ పార్టీ తెలంగాణ వ్యక్తులకు ముఖ్యమంత్రి పదవులను గత 23 ఏళ్ళనుండి కట్టబెట్టలేక పోవడమే కాక, తెలుగుదేశం పార్టీ ఉన్నంతవరకు కట్టబెడుతుందన్న గ్యారంటీ లేదు. మామా అల్లుళ్ళు భాగాలను పంచుకొని 17 ఏళ్ళ కాలాన్ని పాలించి ఒకరిని మించి ఒకరు తెలంగాణాకు జరిగే నష్టంలో పోటీ పడ్డారు. రామారావు, చంద్రబాబుల నాయకత్వంలో ఆంధ్ర, రాయలసీమలకు వడ్డింపులు పెరిగాయి. ఆంధ్ర ఉద్యోగుల స్థానంలో తెలంగాణ వారిని నింపాల్సిన పరిస్థితి తలెత్తినప్పుడు "నేను కొట్టినట్లు నటిస్తా, నీవు ఏడ్చినట్లు నటించు" అన్నట్లు కంటి తుడుపుగా 610 జీవోను విడుదల చేసి రామారావు చేతులు దులుపుకోగా, దాన్ని అమలు చేయకుండా అడ్డుకోవడంలో తొమ్మిదిన్నరేళ్ళపాటు చంద్రబాబు విజయం సాధించాడు. ఆంధ్ర సంస్కృతిని రుద్దే ప్రయత్నం కూడా తెలుగుదేశం పార్టీ పాలనా కాలంలోనే అధికంగా పెరిగింది.

తెలుగుదేశం పార్టీ కాలంలో తెలంగాణకు దక్కింది శంఖుస్థాపన రాళ్ళే. ఒక్క పథకం కూడా కార్యరూపం దాల్చలేకపోయింది. ఆంధ్ర, రాయలసీమలకు చెరో విశ్వవిద్యాలయాన్ని

కట్టబెట్టిన తెలుగుదేశం పార్టీ తెలంగాణకు మాత్రం ఎందుకు కట్టబెట్టలేకపోయిందో ఇక్కడి ప్రజలు ఆలోచించాలి. మారుమూల ఉన్న కుప్పంలో ఏకంగా ద్రావిడ విశ్వ విద్యాలయాన్ని చంద్రబాబు స్థాపించి పక్షపాత పాలనలో ఆ పార్టీని పరాకాష్ఠకు చేర్చాడు. అయినా సమైక్య రాష్ట్ర వాదమే తమ లక్ష్యమని బాహటంగానే ప్రకటించినందున ఆ పార్టీ తెలంగాణ విషయంలో గొడ్డుటావునే తలపింపజేస్తున్నది.

**భారతీయ జనతా పార్టీ :**

'ఒక ఓటు రెండు రాష్ట్రాలు' అని చిలుక పలుకులు పలికిన బిజెపి గద్దెనెక్కిన తర్వాత 'ఒకే పార్టీ – రెండు విధానాలు' అన్నట్టుగా ప్రవర్తించింది. తన పాలనా కాలంలో దేశంలో మూడు కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసి, తెలంగాణ వాసుల్లో ఆశలు రేపింది. తమ పార్టీ కాకినాడలో ప్రత్యేక తెలంగాణ కొరకు తీర్మానం చేశామని చెప్పుకుంటూ, తెలంగాణను ఏర్పరచడానికి ఎలాంటి ప్రయత్నం చేయకుండానే ఆరేళ్ళ అధికారాన్ని వెలగబెట్టారు. 2004 వరకు తెలంగాణ అంశం ఎత్తలేమని బిజెపి జాతీయ నాయకులు ఆదేశించడంతో రాష్ట్ర బిజెపి మూగబోయింది. 2004 తర్వాత బిజెపి తన ఉనికినే కోల్పోయింది.



రాష్ట్రంలో బిజెపి ఉనికికి సహకరించిన మూల స్తంభంగా పేరు గడించిన నరేంద్ర ఇప్పటికే ఆ పార్టీకి దూరమయ్యాడు. ఇక మిగిలిందల్లా ఆంధ్ర నాయకులు, తెలంగాణ ఓటర్లతో మినుకు మినుకు మంటున్నది. అధికారంలో ఉన్ననాడు ఏమీ చేయలేని ఈ పార్టీ, అధికారం పోయిన తర్వాత ఆ పార్టీ కూడా తెలంగాణ వాదాన్ని నెత్తికెత్తుకున్నది. రాష్ట్రంలో ఏదో ఒక పార్టీ ఆసరాతో నెట్టుకొస్తున్న ఆ పార్టీపైనే పూర్తిగా భాద్యత పెట్టి నిద్రపోవడం అత్యాశే అవుతుందనడంలో సందేహం లేదు. భారతీయ జనతా పార్టి జాతీయ కార్యవర్గం ఇటీవల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కొరకు తీర్మానించడం చాలా సంతసించదగ్గ పరిణామం.

**తెలంగాణ రాష్ట్ర సమితి :**

ఏప్రిల్ 27, 2001 న తెలుగుదేశం ప్రభుత్వంలో డిప్యూటి స్పీకర్‌గా పనిచేస్తున్న కల్వకుంట చంద్రశేఖర్ రావు చంద్రబాబు నాయుడుపై తిరుగుబాటు బావుటాను ఎగురవేస్తూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకై 'తెలంగాణ రాష్ట్ర సమితి'ని స్థాపించాడు. 1972 తర్వాత



పుట్టిన తెలంగాణ పార్టీలలో టిఆరెస్సే అతి పెద్ద పార్టీ అని చెప్పుకోవచ్చు. పుట్టీ పుట్టగానే సంచలన విజయాలను సాధించి, ఆ పార్టీ తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఇక్కడి ప్రజలు కూడా మిగతా తెలంగాణ పార్టీల కన్నా, ఆ పార్టీని అధికంగానే ఆదరించి, అక్కున చేర్చుకున్నారని, అప్పట్లో జరిగిన స్థానిక ఎన్నికలు రుజువు చేశాయి. డిప్యూటి స్పీకర్ పదవికి శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి, ఎంతో కొంత త్యాగం చేసిన చంద్రశేఖర్ రావును ప్రజలు నమ్మడం న్యాయమే. 'ఉద్యమం నుండి విరమించుకుంటే రాళ్ళతో కొట్టి చంపే హక్కును తెలంగాణ ప్రజలకిస్తున్నానని' ఆయన బాహటంగా చెప్పిన పలుకులు ఇక్కడి ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. ఈ ప్రకటన 1969 నాటి ఉద్యమంలో 'బానిస బ్రతుకు కన్న చావే మేలు' అనే నినాదంతో ఆనాడు ప్రజలను మేల్కొలిపిన కె.వి.రంగారెడ్డి ప్రకటనను గుర్తుకు తెస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర సమితిలో బిజెపి నుండి రాజీనామా చేసి బయటకు వచ్చిన నరేంద్ర చేరటంతో ఆ పార్టీపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంచింది. అడపా, దడపా మానవ సహజమైన తప్పులతో,



కొన్ని తప్పుడు నిర్ణయాలతో ఈ పార్టీ తెలంగాణ సాధనలో ఎగుడు దిగుడులను ఎదుర్కొంటున్నా ఇంకా చిత్తశుద్ధితోనే పనిచేస్తున్నదని ప్రజలు నమ్ముతున్నారు. గత ఆరేళ్ళనుండి ప్రత్యేక తెలంగాణ సమస్యను ఆరిపోనీకుండా రావణ కాష్టంలా రగిలిస్తూ వస్తున్న టీఆరెస్ మంటలకు తలో సమిధను ఇక్కడి ప్రజలు సమర్పించగలిగితే ప్రత్యేక రాష్ట్రం మరింత వేగంగా ఏర్పడుతుందనడంలో సందేహం లేదు. ఇతర పార్టీలను నమ్ముకోవడం కన్న తెలంగాణ రాష్ట్రం కొరకే పుట్టిన పార్టీలను నమ్ముకోవడం సముచితం.

> **"తెలంగాణ బిడ్డ ఆవేశపరుడు. అంతర్ముఖత్వం, తిరగబడేతత్వం – రెండూ సమపాళ్లలో ఉంటాయి. తెలంగాణా మనిషిలో భోళాతనం, లౌక్యం తెలియని అమాయకత్వం, ముక్కుసూటితనం, సంపదకోసం అంగలార్చకపోవటం, ధర్మాగ్రహం వంటి గుణగణాలు ఇక్కడి సాదామనిషి ఆత్మను పట్టిస్తాయి. వ్యక్తిగతంగా చూసినా, సామాజికంగా చూసినా న్యాయమైన పోరాటాలు ఈ గడ్డమీద తప్ప ఇంకోచోట వచ్చే అవకాశం లేదు."**
>
> **– దాశరథి రంగాచార్య**

# సమైక్య రాష్ట్రంలో ముఖ్యమంత్రులు

ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నీలం సంజీవరెడ్డి మొదటి రోజే తెలంగాణకు ఇవ్వాల్సిన ఉపముఖ్యమంత్రి పదవిని రద్దు చేసి పక్షపాత పాలనకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగుల సీనియారిటీలో మద్రాసు నుండి వచ్చిన ఉద్యోగులకు ప్రమోషన్లు, హైదరాబాద్ రాష్ట్రానికి చెందిన ఉద్యోగులకు రివర్షన్లు అమలు చేసి వివక్ష చూపించాడు. తెలంగాణా ఉద్యోగులకు ఉన్న జీతాలలో కోత పెట్టి ఆంధ్రా ఉద్యోగుల జీతాల పెంపుతో ఈ ప్రాంతానికి ద్రోహం చేశాడు. ముఖ్యమంత్రి పదవి నుండి దిగిపోతూ కూడా తన ప్రాంతానికే చెందిన దామోదరం సంజీవయ్యకు ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టి తెలంగాణకు అన్యాయం చేయడమే కాక పి.సి.సి. అధ్యక్ష పదవిని కూడా తెలంగాణ వారికి దక్కకుండా చేయడంలో విజయం సాధించాడు.

తదుపరి ముఖ్యమంత్రిగా వచ్చిన దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా వివాదాస్పదుడు కాకపోయినప్పటికీ ముల్కీ నిబంధన



విషయంలో తెలంగాణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సందర్భంలో మాజీ ముఖ్యమంత్రిగా మారిపోయిన ఈయన అందరికన్నా ముందుగా జై ఆంధ్రా ఉద్యమానికి పిలుపునివ్వడంలో ముందుండుట వలన తెలంగాణ దృష్టిలో ఈయన విలన్‌గానే మిగిలిపోయాడని చెప్పక తప్పడంలేదు.

సంజీవయ్యను అజ్ఞాతంలోకి పంపి రెండవసారి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతను చేపట్టిన సంజీవరెడ్డి సంజీవయ్య పునరుద్ధరించిన ఉపముఖ్యమంత్రి పదవిని మళ్ళీ రద్దు చేసి మరోసారి తెలంగాణకు మొండిచేయిని చూపించాడు.

సంజీవరెడ్డి స్థానంలో ముఖ్యమంత్రిగా వచ్చిన కాసు బ్రహ్మానందరెడ్డి తెలంగాణ ఎడల చూపించిన వివక్ష తారాస్థాయికి చేరింది. చెన్నారెడ్డిని అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఆయనను కేంద్రానికి పంపించాడు. పక్షపాతానికి ఈయన తలుపులు బార్లా తెరవడంతో 1969 లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పుట్టుకొచ్చింది. ఈ ఉద్యమంలో సుమారు 400 మంది విద్యార్థులను నిర్దాక్షిణ్యంగా చంపించడంలో ఈయన పాత్ర ప్రధానమైనది.



తెలంగాణ ఉద్యమ ఫలితంగా బ్రహ్మానందరెడ్డి రాజీనామాతో తెలంగాణ వ్యక్తి పి.వి.నరసింహారావు ముఖ్యమంత్రిగా ఎన్నికై ముల్కీ నిబంధనలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు అప్పీలు చేసి తెలంగాణాకు న్యాయం జరిపించడానికి చిత్తశుద్ధితో కృషిచేశారు. సుప్రీంకోర్టు ముల్కీ నిబంధనలపై తెలంగాణకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పుడు పి.వి. హర్షాన్ని వెలిబుచ్చడంతో ఆయన పదవికే గండం ఏర్పడింది. తీర్పుకు వ్యతిరేకంగా అభిప్రాయాన్ని వెలిబుచ్చిన సంజీవయ్యకు ఆంధ్రులు నీరాజనం పట్టగా, తీర్పును హర్షించిన పి.వి.ని దించివేయడానికి ఆంధ్రా మంత్రులు రాజీనామా చేసి రాష్ట్రపతి పాలనను పెట్టించడంలో విజయం చెందారు. రాష్ట్రపతి పాలన ముగిసిన తరువాత కూడా పి.వి.ని ముఖ్యమంత్రిగా మళ్ళీ ఎన్నిక కాకుండా అడ్డుకోవాలనే దురుద్దేశంతో పార్టీ అధ్యక్ష పదవి నుండి కూడా రాజీనామా చేసే వరకు ఆంధ్రా నాయకులు నిద్రపోలేదు.

పి.వి. స్థానంలో ఉత్తరాంధ్ర నుండి ఖమ్మంకు వలస వచ్చిన జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఎంపిక చేయబడి తెలంగాణ నాయకులను తనకు ఎదురులేకుండా చేసే ఉద్దేశ్యంతో చెన్నారెడ్డి



ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా, పి.వి.ని అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శిగా నియమించేలా చేయడంలో విజయం చెందాడు. కేంద్రం ఎమర్జెన్సీ విధించడంతో ఈయన పరిపాలనలోని లోటుపాట్లు ప్రజల దృష్టికి అంతగా రాలేదు. అదృష్టవశాత్తు సమర్థమైన ముఖ్యమంత్రిగా చెప్పుకోబడుతున్న ఈయన నాయకత్వంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 30 స్థానాలే దక్కాయి.

తెలంగాణ ఉద్యమ నాయకుడు మర్రి చెన్నారెడ్డి ఇందిరా కాంగ్రెస్ జెండా క్రింద ముఖ్యమంత్రిగా ఎన్నికై కేంద్రంలో తెలంగాణ వారికి మంత్రిపదవులు ఇప్పించడంలో విజయం చెందాడు. హైదరాబాద్ నగరాన్ని ఆంధ్రులు కైవసం చేసుకోకుండా అడ్డుకునే ఉద్దేశ్యంతో రంగారెడ్డి జిల్లాను సృష్టించాడు. ఆంధ్రా రాయలసీమ విద్యార్థులు తెలంగాణ విద్యాసంస్థల్లో సీట్లు పొందకుండా అడ్డుకునే ఉద్దేశ్యంతో జోనల్ పద్ధతిని ప్రవేశపెట్టాడు. అంతేకాకుండా శ్రీరాంసాగర్ నిర్మాణంలో అధిక శ్రద్ధ చూపించి తెలంగాణ ప్రాంతానికి నీరు అందేలా చర్యలు తీసుకున్నాడు. తెలంగాణకు సముచితమైన స్థానాన్ని కల్పించడానికి చర్యలు తీసుకుంటున్న సమయంలో మతకలహాలను, అసమ్మతిని సృష్టించి ఈయనను దించివేయడంలో ఆంధ్రా నాయకత్వం విజయం చెందింది.

ఈయన స్థానంలో మరో తెలంగాణ వ్యక్తి టి. అంజయ్య ముఖ్యమంత్రిగా నామినేటు చేయబడినప్పటికి మతకలహాలను మళ్ళీ ప్రారంభించి ఏడాదిన్నర కన్న ముందే ముఖ్యమంత్రిపదవి నుండి దిగిపోయేలా ఆంధ్రా నాయకులు ప్రయత్నించారు. ఆంధ్రానాయకులు రాజీవ్‌గాంధీ దగ్గర నడిపించిన నాటకంతో తెలంగాణకు చెందిన అంజయ్యను బాహటంగా అవమానపరచి, పదవీ భ్రష్టున్ని చేసి తెలంగాణను అవమానపరచారు. ఆయన స్థానంలో వచ్చిన భవనం వెంకటరాంరెడ్డి ప్రజలతో సంబంధమే లేకుండా ఆరు నెలలే పరిపాలించినందున ఆయన గురించి చెప్పుకోవాల్సిందేమీ లేదు. భవనం స్థానంలో విజయబాస్కర రెడ్డి ముఖ్యమంత్రిగా నామినేట్ చేయబడి, మూడు మాసాలు అసంతృప్తి సెగల మధ్య కాలాన్ని గడిపినప్పటికీ, తరువాత జరిగిన ఎన్నికల్లో టి.డి.పి.కి ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో ఈయన ముఖ్యమంత్రిగా చేసిందేమీ లేదని చెప్పుకోవచ్చు. అయితే జైఆంధ్రా ఉద్యమంలో విజయబాస్కరరెడ్డి తెలంగాణ ప్రజలపై అక్కసు వెల్లబుచ్చిన కారణంచే ఈయన మీద తెలంగాణ ప్రజలకు ఏనాడు సదభిప్రాయం లేదు.



మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ స్థానంలో తెలుగుదేశం ముఖ్యమంత్రిగా ఎన్టీరామారావు పదవిలోకి వచ్చిన వెంబడే తెలంగాణ ప్రాంతీయ మండలిని రద్దుపరచడం, ఆస్థాన కవి పదవి నుండి దాశరథిని అవమానకరంగా తొలగించడం ఈయన తెలంగాణకు చేసిన ఘనకార్యాలుగా చెప్పుకోవచ్చు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న విగ్రహాలన్ని ఆంధ్రా వ్యక్తులకే కేటాయించాడు. శ్రీశ్రీకి స్థానం కల్పించాడే కాని దాశరథికి స్థానం కల్పించలేకపోయాడు. ఉద్యోగాలలో తెలంగాణకు అన్యాయం జరిగిందని మొసలి కన్నీరు కార్చి కంటితుడుపుగా ఒక జి.ఓ.ను విడుదల చేశాడు కాని అమలు చేయకుండానే పాలనాకాలాన్ని ముగించుకున్నాడు. శ్రీశైలం ఎడమకాలువ ఊసే ఎత్తకుండా కుడికాలువకు సంబంధించిన తెలుగుగంగ, పీలేరు, నగరి, హంద్రీ-నీవా ప్రాజెక్టులపై నిధులను కురిపించాడు. అప్పటి రాష్ట్రపతి జైల్‌సింగ్ గారిచే నల్గొండలో శంకుస్థాపన చేయబడిన సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని రాజధానికి తరలించడంలో అత్యుత్సాహం చూపించాడు. ఇదే సమయంలో విజయవాడలో ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయాన్ని, తిరుపతిలో మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయించాడు. ఈయనపై



తిరుగుబాటు చేసి నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రిగా ఎన్నికై నెలరోజుల పాటు పనిచేసినప్పటికీ తన పదవిని రక్షించుకునే ఉద్దేశ్యంతో హైదరాబాద్ పాత నగరాభివృద్ధికి పదికోట్ల రూపాయలు మంజూరు చేసాడు. ప్రజాస్వామ్య పరిరక్షణలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్టీఆర్‌కు మద్దతు పలకడంతో తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నికైన ఎన్టీఆర్ శాసన సభను రద్దుచేసి తిరిగి ఎన్నికల్లో గెలిచి బంధువర్గానికి పెద్దపీట వేశాడు. 1989 ఎన్నికల్లో టి.డి.పి. ఓడిపోయి కాంగ్రెస్‌కు విజయం దక్కడంతో రెండవమారు పదవిలోకి వచ్చిన చెన్నారెడ్డిని దించడానికి ఆంధ్రా నాయకత్వం మళ్ళీ మతకలహాలకు ఆజ్యం పోసింది. ఫలితంగా ఏడాదికే అవమానకరంగా పదవినుండి దిగిపోవాల్సి వచ్చింది. ఏనాడూ ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనకుండా రాజకీయాన్ని నడిపిన నేదురుమల్లి ముఖ్యమంత్రిగా నామినేట్ చేయబడి ఆయన నేర్పిన అనమ్మతి రాజకీయాలకే బలి అయ్యాడు. వీరి స్థానంలో విజయభాస్కరరెడ్డి మరోసారి నామినేట్ చేయబడి తన చేతులమీదుగా ఎన్టీఆర్‌కు మరోసారి అధికారాన్ని అప్పగించాడు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ఆయన అల్లుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా తనను తాను ప్రకటించుకున్నాడు. నీటి మీద రాతల



మాదిరిగా తెలంగాణ పథకాలు ప్రకటించి చేతులు దులుపుకున్నాడు. మహబూబ్‌నగర్‌ను దత్తత తీసుకున్నానని చెప్పి ఆ జిల్లాకు ఒరగబెట్టిందేమి లేదు. పుట్టినదగ్గరల్లా అప్పులు తెచ్చి ఆంధ్రా ప్రాజెక్టులకు ఖర్చు చేసి తెలంగాణకు చిప్ప మిగిల్చాడు. తన నియోజక వర్గమైన కుప్పంలో ఏకంగా ఓ యూనివర్సిటీనే స్థాపించి పక్షపాత పాలనను రుజువు చేశాడు. జై ఆంధ్రా ఉద్యమంలో రాజకీయ నాయకుడిగా పుట్టుకొచ్చి సమైక్య రాష్ట్రం కావాలంటూ పల్లవిని అందుకున్నాడు. తెలంగాణ ఉద్యమాన్ని దెబ్బతీసే దురుద్దేశంతో తెలంగాణ ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండగా కొత్తగా ఇచ్చంపల్లి, దేవాదుల పేర్లతో శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకున్నాడు.

**ప్రస్తుత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి :**

"చంద్రబాబునాయుడును గద్దె దించితే తెలంగాణ రాష్ట్రం వచ్చేసినట్లే" అని భావిస్తున్న తరుణంలో శాసనసభకు ముందస్తు ఎన్నికలు రావటం, ఆ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం కొరకు పోరాడుతున్న తెలంగాణ రాష్ట్ర సమితి కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీచేయడం, ఎన్నికల్లో చంద్రబాబు చిత్తు చిత్తుగా ఓడిపోవడం లాంటివి ప్రత్యేక రాష్ట్రం కొరకు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజల కళ్ళలో కాంతిరేఖలు నింపాయి. కాని ఆ సంతోషం

వాస్తవరూపం దాల్చకుండా నూతన ముఖ్యమంత్రిగా వచ్చిన డా॥ వై.ఎస్.రాజశేఖర రెడ్డి అడుగడుగునా సైందవునిలా అడ్డుకుంటున్నారు. తొమ్మిదేళ్ళ పాలనలో చంద్రబాబు చేసిన నష్టం కన్న రెండున్నరేళ్ళలో వై.ఎస్.ఆర్. ఎక్కువ నష్టాన్ని కలుగజేశాడు. అయిదూళ్ళు ఇవ్వమన్నా ఇవ్వనని మొండికేసిన దుర్యోధనుని పాత్రను పోషిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డుకోవడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నాడు.

గత 50 సంవత్సరాలలో ఈయన కన్న ముందు పరిపాలించిన ఆంధ్రా ముఖ్యమంత్రులు ఇక్కడి నీటివనరులను, ఉద్యోగాలను గుండుగుత్తగా కొల్లగొట్టినదానిని రాజశేఖరరెడ్డి కూడా కొనసాగించడానికే కంకణం కట్టుకున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుత ముఖ్యమంత్రి పదవీ కాలంలో తెలంగాణకు జరిగిన నష్టాలను స్థూలంగా పరిశీలిద్దాం.

★ **ఉద్యోగాలు** : చంద్రబాబునుండి వారసత్వంగా సంక్రమించిన 610 జి.ఓ సమస్యను రాజశేఖరరెడ్డి కూడా పరిష్కరించకుండా మీనమేషాలను లెక్కిస్తూ పబ్బం గడుపుతున్నాడు.

★ ప్రభుత్వ ఉద్యోగాలలో అవుట్ సోర్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి రాబోయే ఉద్యోగాలన్నింటిని ఆంధ్రా, రాయలసీమ వారికే



కట్టబెట్టాలని కుయుక్తులు పన్నుతున్నాడు. ఇప్పటికే కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాల పేరుతో ఇరవై వేల ఉద్యోగాలను అస్మదీయులకు కట్టబెట్టాడు. అటెండర్లు, డ్రైవర్లు లాంటి పోస్టుల్లో తెలంగాణ వారు అధికంగా ఉన్న కారణంచే ఆ పోస్టులనే రద్దుచేయాలని అంటున్నాడు.

★ **పోలవరం ప్రాజెక్టు** : తెలంగాణ జిల్లా ఖమ్మంకు చెందిన లక్షలాది ఆదివాసుల, పేద ప్రజల ఆర్తనాదాలను లెక్కచేయకుండా వందలాది గ్రామాలను ముంపుకు గురిచేస్తూ ఆంధ్రా ప్రాంతానికి నీళ్ళందించే పోలవరాన్ని నిర్మించి తీరతానని రోజుకో ప్రకటన గుప్పిస్తున్నాడు.

★ **పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్** : విద్యుత్ ఉత్పాదన కొరకు నిర్మించబడ్డ శ్రీశైలం ప్రాజెక్టునుండి మద్రాసు నగరానికి మంచి నీటిని అందించే నెపంతో ఆ ప్రాజెక్టుకు గండి కొట్టి రాయలసీమ రైతాంగానికి ఈయనకన్న ముందున్న పాలకులు పంచిపెట్టగా, ఈయన ఏకంగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కుల నుండి నలుబది నాలుగువేల క్యూసెక్కులకు పెంచుతూ రహస్యంగా జి.ఓ.ను



జారీ చేశాడు. ఈ చర్యతో కృష్ణా నదినే రాయలసీమకు మలుపుకునే కుట్రకు తెరలేపాడు. తన స్వంత జిల్లా కడపకు లాభం కలిగించడానికి మూడు కోట్ల తెలంగాణా వాసులను నట్టేట్లో ముంచడానికే సిద్ధమయ్యాడు.

★ **పులిచింతల ప్రాజెక్టు** : కృష్ణా నదిలో ఇప్పటికే మొత్తం నీటిని వినియోగించుకుంటూ రెండు పంటలు పండించుకుంటున్న కృష్ణా డెల్టాకు అదనంగా ఒక ఎకరా ఆయకట్టు లేనప్పటికి ముచ్చటగా మూడవ పంట పేరుతో పులిచింతలను నిర్మిస్తానంటున్నాడు. తద్వారా నల్గొండ జిల్లాలోని ఎన్నో భూములు, సాగర్ ఆయకట్టు గ్రామాలు, కోట్ల విలువైన సున్నపు రాయి నిక్షేపాలు మునిగిపోతాయని తెలుస్తున్నా ఖాతరు చేయడం లేదు.

★ ఆంధ్రాలో నిర్మించిన ప్రాజెక్టులతో ఒక టి.ఎం.సి. నీటికి మూడు వేల ఎకరాల పారకమని, తెలంగాణాలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాల క్రింద ఒక టి.ఎం.సి.కి ముప్పైమూడు వేల ఎకరాల పారకమని నిర్ధారించడం తెలంగాణ అభివృద్ధికి వై.ఎస్.ఆర్. ఇస్తున్న వికృత నిర్వచనం.



★ **ప్రభుత్వ, పేదరైతుల భూముల అమ్మకం** : హైదరాబాద్ చుట్టుప్రక్కల ఉన్న మూడు నాలుగు జిల్లాలలోని ప్రభుత్వ, పేద, దళిత రైతుల భూములన్నింటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నాడు. రైతులకు నామమాత్రపు ధర చెల్లించి భూములను కైవసం చేసుకుంటూ మధ్య దళారిల ఆసరాతో ప్రభుత్వమే (హుడా) రియల్ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నది. గద్దెనెక్కిన వెంబడే జలయజ్ఞం పేరుతో ఏకకాలంలో 38 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, నిధులన్నింటిని కాంట్రాక్టర్లకు కట్టబెట్టి అవినీతికి తలుపులు బార్లా తెరిచాడు. ఈ డబ్బును రాజధాని నగరం చుట్టూ ఉన్న భూములను కొనుగోలు చేయడానికి వినియోగిస్తూ సామాన్యునికి అందుబాటులో లేనంతగా భూమి ధరలు పెంచుతున్నాడు. సందట్లో సడేమియా అన్నట్లు అస్మదీయులకు లాభం చేకూర్చే ఉద్దేశ్యంతో అవుటర్ రింగ్‌రోడ్డును ప్రారంభించి, తనవారి భూములను తప్పిస్తూ, పేదల భూములను కృష్ణార్పణం చేస్తూ, అవుటర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంటును గంట గంటకు మారుస్తూ గారడీ చేస్తున్నాడు.

★ **విద్య :** నాలుగు జిల్లాలున్న రాయలసీమ ప్రాంతంలో ఇప్పటికే జిల్లాకు ఒకటి కన్న ఎక్కువ యూనివర్సిటీలు ఉన్నప్పటికీ ఇటీవల ప్రకటించిన మూడు యూనివర్సిటీలలో మరో యూనివర్సిటీని ప్రకటిస్తూ, పది జిల్లాల తెలంగాణా ప్రాంతానికి ఒకే యూనివర్సిటీని కేటాయించాడు. గురుకుల విద్యాలయాలలో కూడా తెలంగాణాకు అన్యాయమే చేసారు. ఏకంగా కడప జిల్లాలో ప్రభుత్వ రంగంలో వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలను స్థాపించాలని నిర్ణయించడం వై.ఎస్.ఆర్. పక్షపాత పాలనకు నిలువెత్తు సాక్ష్యం.

తెలంగాణ ఆదాయాన్ని ఆంధ్రా అభివృద్ధికి వెచ్చిస్తూ తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రమే సహాయం చేయాలని ప్రకటనలు చేస్తూ తెలంగాణా ప్రజాప్రతినిధులకు మంత్రిపదవులు, ఇతర ప్రలోభాలు చూపెడుతూ తెలంగాణాపై ప్రశ్నించకుండా వారి నోళ్ళను నొక్కి పెడుతున్నాడు.

**గమనిక : గత యాభై సంవత్సరాలలో ఆంధ్రా రాయలసీమకు చెందిన వారు సుమారు 44 సంవత్సరాలు పరిపాలించగా, తెలంగాణకు చెందినవారు కేవలం 6 సంవత్సరాలే పాలించడం గమనార్హం.**



# ముగింపు

చేసుకున్న ఒప్పందాలన్ని బుట్టదాఖలైనాయి. రోజు రోజుకు మోసాలు పెరుగుతున్నాయి. తెలంగాణ ప్రజల జీవితాలు దిగజారుతున్నాయి. ప్రత్యేక తెలంగాణా ఉద్యమాలకు ఫలితమే దక్కకుండా చేయాలని కుట్రలు పన్నుతున్నారు. తీర ప్రాంతంలోని ప్రజలమీద చూపించే శ్రద్ధ కన్న అధిక శ్రద్ధను పీఠభూమి మీద నివసించే ప్రజల మీద చూపించాల్సి ఉంటుంది. కాని సమైక్య రాష్ట్ర ఏర్పాటు రోజునుండి కడుపు నిండిన వారికే వడ్డిస్తామంటున్నారు. నిధుల కేటాయింపుల్లో పక్షపాతమే చూపించారు. కృష్ణా, నదీజలాలన్నింటిని ఆంధ్రకు మళ్ళించారు. గోదావరి జలాలను వినియోగించే తెలంగాణా పథకాలను కాగితాలకే పరిమితం చేశారు. 1956 నుండి 1969 వరకు దక్కించుకున్న ఉద్యోగాలను రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా జి.ఓ. 36 అమలు కాకుండా అడ్డుపడ్డారు. 1969 నుండి 86 వరకు దక్కించుకున్న అధిక ఉద్యోగాలను ఆంధ్రా ప్రాంతానికి తరలించి, ఆ స్థానాలలో తెలంగాణా వారిని నింపాల్సిన 610 జి.ఓ. ఈనాటికి అమలుకాలేదు. ఆరు సూత్రాల ఒప్పందంలో



ఆంధ్రులకు అనుకూలమైన నిబంధనలన్నీ అమలుకు నోచుకోగా, తెలంగాణాకు లాభం కలగాల్సిన నిబంధనలను అణచివేశారు. పెద్దమనుష్యుల ఒప్పందం, అఖిలపక్ష ఒప్పందం, 5 సూత్రాల పథకం, ఆరుసూత్రాల పథకం, 8 సూత్రాల పథకంలాంటివన్ని తెలంగాణకు ఎటువంటి న్యాయం చేయలేకపోయాయి. ప్రభుత్వ ఆదాయం తెలంగాణ నుండి అధికంగా ఉండగా, కేటాయింపుల్లో ఆంధ్రా ప్రాంతానికి అధికంగా ఉంటున్నాయి. విశ్వవిద్యాలయాలన్నీ ఆంధ్రా – రాయలసీమల్లోనే కేంద్రీకృతమైనాయి. ఉన్న విద్యా సంస్థలనే కొనసాగించే అవకాశం లేదు. కొత్తవి స్థాపించే అవకాశాలు కూడా అసలే లేవు. స్థాపించినా గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, చిత్తూరు, అనంతపూర్, కడపలు ఎదురుచూస్తూనే ఉన్నాయి. తెలంగాణలో ఉన్న పరిశ్రమలన్ని ఇప్పటికే మూతపడ్డాయి. కొత్త పరిశ్రమలను కోస్తాంధ్ర జిల్లాల్లో నింపేస్తున్నారు. తెలంగాణలో బొగ్గు గనులుంటే ఆంధ్ర ప్రాంతంలో విద్యుత్ పరిశ్రమలను నెలకొల్పడం నగుబాటే. బొగ్గుగనులు, సున్నపురాయి తగ్గిపోతున్నాయి. రాష్ట్ర అప్పులు పెరుగుతున్నాయి. రాష్ట్ర అప్పుల్లో తెలంగాణా వాటా పెరుగుతున్నది. నిరుద్యోగులు పెరుగుతున్నారు. నిన్నటి రోజుకన్న ఈ రోజు అధ్వాన్నంగా తయారైపోతున్నది.



పాలకుల వాగ్దానాలు కార్యరూపం దాల్చలేకపోయాయి. నాగార్జునసాగర్‌లో మోసం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు విషయంలో మోసమే చేశారు. మన ప్రాజెక్టులు అనుకున్న సమయంలో పూర్తి కాకపోవడాన్ని నిలదీసేవారులేరు. చెరువులు, కుంటలు, వాగులు, అడవులు మాయమైపోతున్నా పట్టించుకునేవారు లేరు. పిట్టలు, గుట్టలు పరిశ్రమల దెబ్బకు నాశనమౌతున్నా, సమస్త చేతివృత్తులు చేనేతలు మార్కెట్ మాయకు కనిపించకుండా పోతున్నా అడిగేవారు లేరు. తెలంగాణేతర ప్రాంతాలలో కొత్త ప్రాజెక్టులను ప్రారంభించి, చూస్తుండగానే పూర్తి చేసుకుంటున్నా ప్రశ్నించలేకపోతున్నాం. పదివేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ చాలని కమ్యూనిస్టులు కొత్తపాటను అందుకున్నారు. నికరంగా సంవత్సరానికి తెలంగాణా వాటాకింద 5 వేల కోట్ల అప్పులు పెరుగుతుండగా, కేవలం 5 వేల కోట్లు ఇస్తే సరిపోతుందని అర్థంపర్థం లేని వాదనలను వారు ముందుకు తెచ్చారు. ఇప్పటికే పాతాళంలోకి తెలంగాణాని తోసివేశారు. దాన్ని గట్టెక్కించడానికి బ్రహ్మతరం కూడా కాదు. అంటే సమైక్య రాష్ట్రంలో బాగుపడే అవకాశాలు అసలే లేవు. ఇక మిగిలిందల్లా విడిపోవడమే. విడిపోతే మన నిధులతో ఎన్నటికో ఒకనాటికి బాగుపడే అవకాశముంటుంది.

ఆకలి చావులతో, ఆత్మహత్యలతో తల్లడిల్లుతున్న తెలంగాణావాసులు, ఎవ్వరినుండి కూడా సహాయం అర్థించడంలేదు. ఆంధ్రప్రాంతంలోని గజం స్థలాన్నికూడా ఆశించడంలేదు. వారు అవినీతితో సంపాదించుకొన్న సంపదను పంచి ఇవ్వమని కోరడం లేదు. మన ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా గుర్తించాలని మాత్రమే ఉద్యమిస్తున్నాం. తెలంగాణాను కోరే హక్కు ఇక్కడి ప్రజలకు ఉన్నది. కాగా తెలంగాణను కాదనే హక్కు ఎవరికీ లేదు. కాదనగలుగుతున్నారంటే మన ప్రాంతంతో వారికి లాభం ఉన్నట్లే భావించాల్సి ఉంటుంది.

అంతర్గత పరాయిపాలన నుండి విముక్తి కోసం తెలంగాణ మరో ఉద్యమానికి సిద్ధమైనది. ఈ ఉద్యమం ద్వారా ఏది మారినా, మారకపోయినా మన వనరుల మీద మనకే హక్కు లభిస్తుందనడంలో మాత్రం సందేహం లేదు. స్వపరిపాలన రాష్ట్రంగా మన తెలంగాణాను తీర్చిదిద్దటానికి ఎటువంటి త్యాగాలకైనా వెనుకాడబోమని మనమంతా ప్రతిజ్ఞ చేద్దాం.

మీరెన్నుకున్న నాయకులను నిలదీయండి. ఊరూరా సత్యాగ్రహాలు చేయండి. అప్పుడు తెలంగాణ త్వరలో వస్తుంది.

## జై తెలంగాణ జైజై తెలంగాణ



## అనుబంధము-1

## సమైక్య రాష్ట్రంలో ముఖ్యమంత్రుల పదవీకాలం

**ఆంధ్రా ముఖ్యమంత్రులు**

| | |
|---|---|
| బ్రహ్మానందరెడ్డి | 7 సంవత్సరాల 7 నెలలు |
| ఎన్టీరామారావు | 7 సంవత్సరాల 6 నెలలు |
| నాదెండ్ల భాస్కరరావు | 1 నెల |
| నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి | 1 సంవత్సరం10 నెలలు |
| భవనం వెంకట్రాంరెడ్డి | 9 నెలలు |
| **సెప్టెంబర్ 2006 నాటికి మొత్తం** | **17 సంవత్సరాల 09 నెలలు** |

**రాయలసీమ ముఖ్యమంత్రులు**

| | |
|---|---|
| నీలం సంజీవరెడ్డి (రెండు విడతలు) | 5 సంవత్సరాల 3 నెలలు |
| దామోదరం సంజీవయ్య | 2 సంవత్సరాల 2 నెలలు |
| విజయభాస్కరరెడ్డి(దఫదఫాలుగా) | 2 సంవత్సరాల 6 నెలలు |
| చంద్రబాబునాయుడు | 8 సంవత్సరాల 8 నెలలు |
| రాజశేఖరరెడ్డి(సెప్టెంబర్ 2006 నాటికి) | 2 సంవత్సరాల 6 నెలలు |
| **సెప్టెంబర్ 2006 నాటికి మొత్తం** | **20 సంవత్సరాల 11 నెలలు** |



**తెలంగాణ ముఖ్యమంత్రులు**

| | |
|---|---|
| పి.వి.నరసింహారావు | 1 సంవత్సరం 4 నెలలు |
| మర్రి చెన్నారెడ్డి(రెండు విడతలు) | 3 సంవత్సరాల 7 నెలలు |
| టి. అంజయ్య | 1 సంవత్సరం 4 నెలలు |
| **మొత్తం** | **6 సంవత్సరాల 03 నెలలు** |

| | |
|---|---|
| **ఉత్తరాంధ్రకు చెంది తెలంగాణలో స్థిరపడ్డ** | |
| **జలగం వెంగళరావు** | **4 సంవత్సరాల 2 నెలలు** |

| | |
|---|---|
| **రాష్ట్రపతి పాలన** | **9 నెలలు** |

**గమనిక :** తెలంగాణ ముఖ్యమంత్రులను పనిచేయనీయకుండా అడుగడుగునా అడ్డుతగలడంతో ఏ ముఖ్యమంత్రి తన పదవీ కాలాన్ని పూర్తి చేసుకోలేదు. పి.వి.నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్న కారణం చేతనే రాష్ట్రపతి పాలనను విధింపజేశారు. చెన్నారెడ్డిని రెండు సార్లు, అంజయ్యను ఒక సారి ముఖ్యమంత్రిగా దించేయడానికి మత కలహాలకు ఆజ్యం పోశారు.



## అనుబంధము -2

## సమైక్య రాష్ట్రంలో ఏర్పాటైన విశ్వ విద్యాలయాలు

**ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు**

| | |
|---|---|
| నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు | 1976 |
| శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపూర్ | 1978 |
| పద్మావతి విశ్వవిద్యాలయం, తిరుపతి | 1983 |
| సంస్కృత విశ్వవిద్యాలయం, చిత్తూరు | 1985 |
| వైద్య, ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయం, విజయవాడ | 1986 |
| ద్రావిడ భాషల విశ్వవిద్యాలయం, కుప్పం | 2002 |
| వేమన విశ్వవిద్యాలయం, కడప | 2006 |
| రాజ రాజ నరేంద్ర విశ్వవిద్యాలయం, రాజమండ్రి | 2006 |

**తెలంగాణ ప్రాంతం**

| | |
|---|---|
| కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ | 1976 |
| తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్ | 2006 |

**గమనిక :** రాష్ట్ర రాజధానిలో ఏర్పరచిన విశ్వవిద్యాలయాలు అన్ని ప్రాంతాల వారికి సమానంగానే ఉపయోగపడుతున్నందున వాటి వివరాలు ఇవ్వలేదు.

## అనుబంధము -2

# అంత్యప్రాసతో చురకలు

రాష్ట్రమంతా ఆంధ్ర ఊడలు
అదరగొడుతున్నాయి వారి మేడలు
మాయమవుతున్నాయి మన జాడలు
ఇంకెప్పుడొదులుతాయి ఈ పీడలు

ఆంధ్రా-తెలంగాణాలట బాయిబాయి
కలహాలతో కలిసుండేదెందుకోయి
అన్ని రంగాలలో ఆంధ్రులనేదట బడాయి
తెలంగాణ రక్షణకోసం తప్పదు లడాయి

వారంటారు...........
ఆంధ్రుల గౌరవం నిలబెట్టు
అవసరమైతే తెలంగాణ తాకట్టుపెట్టు
ఇంకెంతకాలం మన ఈ 'ఊ' కొట్టు
ఇప్పటికైనా మేల్కొని 'ఛీ' కొట్టు



విశాలాంధ్రే ముద్దన్నారు
ఉపముఖ్యమంత్రి రద్దన్నారు
అధికార పీఠం వారి జిద్దన్నారు
నీటి దారలు మనకు వద్దన్నారు

ఉద్యోగ నిరుద్యోగ పంపకాలు
ఉద్యోగాలలో వారి పెంపకాలు
నిరుద్యోగంలో మన ముంపకాలు
కాదంటే చిరుద్యోగంలో నింపకాలు

ఆంధ్రులకు చిక్కాయి భోగాలు
తెలంగాణకు దక్కాయి రోగాలు
ఎప్పటికీ వారికేనా యోగాలు
ఇంకెన్నాళ్ళని మన ఈ త్యాగాలు

ఆంధ్రుల హక్కుల రక్షణ
తెలంగాణా ఆస్తుల భక్షణ
అందులోనే పాలకులకు శిక్షణ
మన పది జిల్లాలు వారికి దక్షిణ



తెలంగాణకేమో రాళ్ళొచ్చే
ఆంధ్రాకైతే నీళ్ళొచ్చే
ఎడతెగని మోసాలకు ఏళ్ళొచ్చే
అందుకే ప్రత్యేక రాష్ట్రానికి కాళ్ళొచ్చే

కృష్ణా గోదావరుల జలాలు
ఆంధ్రులకే అందిస్తున్నాయి ఫలాలు
తెలంగాణా వెనుకబాటుకివే మూలాలు
ఎలుగెత్తి చాటాల్సిందే మన కలాలు

టి.ఆర్.ఎస్. పుట్టుకతో..........
మనగల్లీ గల్లీ పునాది రాళ్ళొచ్చే
కాగితాలపై కళాశాలలొచ్చే
మంత్రుల మాటల్లో ఉద్యోగాలొచ్చే
ఇదంతా చూస్తూంటే ఊసరవెల్లే గుర్తొచ్చే

ఆగకుండా సాగుతున్నాయి మోసాలు
కల్లబొల్లి కబుర్లతో కపట వేషాలు
ఏమైపోయాయి తెలంగాణ వాసుల రోషాలు
మెలివేయక తప్పదు మన మీసాలు



కలిసుండాలంటే ఆంధ్రులకే ఇంపు
వారికొరకే తెలంగాణా వాసుల ముంపు
ఎంత కాలం కలిసున్నా తప్పదు కంపు
అందుకే ప్రత్యేక రాష్ట్రానికై చేయాలి తెంపు